www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

వైభవంగా బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం

తరలివచ్చిన తారాలోకం

ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి, కమల్‌హాసన్, వెంకటేశ్, శివరాజ్‌కుమార్ తదితరులు

ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్

10



సోమవారం | 2-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 139

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య పూర్తి; నక్షత్రం: మఖ రా. 12.20 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ.11.04-12.50, దుర్ముహూర్తం: మ.12.39-1.28, మ.3.07-3.56, అమృతఘడియలు: రా.9.40-11.26, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.24

హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

Scooter అంటే ACTIVA
With H-Smart Technology



For more information give a missed call on 7230032200

Super Savetember

1st YEAR FREE SERVICE MAINTENANCE PACKAGE^
^Hurry! Valid until 30th Sept'24

3 Years Standard + 3 Years Free Extended Warranty#

Low ROI @ 7.99%**

Cashback of 5% up to ₹5000##
HDFC BANK Credit Card

For dealer details scan the QR Code

Activa 3.25 CRORE* Happy Customers

HONDA

##Cashback Offer available on all Honda two-wheeler models for EMI transactions made using HDFC Bank credit cards through Pine Labs machines only. ##Customers can avail 5% Instant cashback, up to a maximum of Rs. 5000. ##Valid on one transaction per card/order during the offer period. ##Cashback offer valid until 30th September 2024. ##The scheme is available in select outlets only. **Approval of the loan is at the sole discretion of the financiers, and additional documentation may be required. **The interest rates, down payment, and tenure options are based on the financier's assessment of the applicant's credit profile. **The offers/features may be modified or withdrawn at any time without prior intimation. Product shown in the picture may vary from actual product available in the market. Accessories shown in the picture are not part of standard equipment. #3 years of standard plus 3 years of free extended warranty only on Activa 110cc. #This scheme is offered by authorised main dealers and Associate Dealers. *Source: Cumulative Sales figure of Brand Activa from June 2001 to June 2024 as per HMSI internal data. ^For detailed Terms and Condition of 1st Year Free Service Maintenance Package, kindly contact Authorised Main Dealers and Associate Dealers. ^Above scheme can be withdrawn at any time without prior intimation.

Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda.hmsi.in

జల దిగ్బంధం

రాష్ట్రవ్యాప్తంగా రోజంతా దంచికొట్టిన వాన | ఖమ్మం అతలాకుతలం



పీకల్లోతు నీటిలో.. ఖమ్మంలో నీట మునిగిన ఓ కాలనీ నుంచి సామగ్రిని తీసుకొని వస్తున్న యువకులు

23 చోట్ల.. 25 సెంటీమీటర్లకు పైగా వర్షం!

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి, చిన్నగూడురులో అత్యధికంగా 45 సెం.మీ.

వర్షం దెబ్బకు అతలాకుతలమైన జనజీవనం

15 మందికిపైగా మృతి.. పలువురి గల్లంతు

వేలాది గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

నేడు, రేపు కొన్ని జిల్లాల్లో భారీ, అతిభారీ వర్షాలు

పెదవాగుకు మళ్లీ గండి.. తెగిన 220 చెరువులు

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టు ఒకటే వర్షం! రాష్ట్రం మొత్తమ్మీదా ఆదివారం వర్షం కురవని మండలం ఒక్కటి కూడా లేదు!! నిలిచి కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో కాలువలకు గండ్లు పడ్డాయి! చెరువులు అలుగులు పారాయి. చెక్‌డ్యాములు, జలాశయాలు మత్తడి దుంకాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. ఊర్లన్నీ ఏరులయ్యాయి. వాగులు పొంగి పొర్లి దారులను ముంచెత్తడంతో చాలా గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి!! హైదరాబాద్-విజయవాడ మధ్య.. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రకు.. రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల్లో కొట్టుకుపోయి.. వాన నీటిగుంతల్లో పడి.. 15 మందికిపైగా చనిపోయారు. పలువురి ఆచూకీ గల్లంతయ్యింది. జలదిగ్బంధంలో చిక్కుకుపోయి ప్రాణాలు అరచేతబట్టుకుని సాయం కోసం ఎదురుచూస్తున్నవారు ఎందరో!! వర్షాల దెబ్బకి తెలుగు రాష్ట్రాల్లో 80 రైళ్లు పూర్తిగా, 5 రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి. 49 రైళ్లను దారి మళ్లించారు. సోమ, మంగళవారాల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా భారీ, అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడం.. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది.



సోదరుడి నిశ్చితార్థానికి వచ్చి వెళుతూ..

మృత్యు ఒడికి మహిళా శాస్త్రవేత్త

మహబూబాబాద్ జిల్లాలో వాగులో కొట్టుకుపోయిన కారు.. తండ్రి గల్లంతు

ముగ్గురిలో ఒక్కరే బతికారు!

ఖమ్మం జిల్లాలో దంపతుల గల్లంతు

కుమారుడు క్షేమం.. పొంగులేటి కన్నీరు

12 గంటల నరకయాతన

నెక్కొండలో వరద నీటిలో ఆర్టీసీ బస్సు

రాత్రంతా అందులోనే 46 మంది



మహబూబాబాద్‌లో కొట్టుకుపోయిన రైల్వేట్రాక్

గాలిలో వేలాడుతున్న పట్టాలు

నాగర్‌కర్నూలు జిల్లాలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడుతున్న రెస్క్యూ టీమ్



నేడు విద్యాసంస్థలకు

సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

జేఎన్‌టీయూ పరిధిలో పలు పరీక్షల వాయిదా



సూర్యాపేట జిల్లా కోదాడలో వరద ప్రవాహంలో కొట్టుకు వచ్చిన కార్లు

శ్రీశైలానికి వరద పోటు

5.2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. సాగర్‌కు 4.2 లక్షలు

ప్రకాశం బ్యారేజీకి 10 లక్షల క్యూసెక్కులు వచ్చే చాన్స్!

వివరాలు 12, 13, 14లో..

విలయవాడ!

విజయవాడను ముంచేసిన బుడమేరు

కృష్ణమ్మ మహోగ్రం.. 15 ఏళ్ల తర్వాత మళ్లీ

'నైరుతి'పై కుంభవృష్టి!

అంతే తప్ప ఇది క్లౌడ్ బరస్ట్ కాదు

ఆగస్టులో తీవ్ర ఎండలు.. వేడెక్కిన సముద్రం

సముద్ర నీటిని తాగేసిన వాయుగుండం

అధికారులూ.. జాగ్రత్త!

24 గంటలూ అప్రమత్తంగా ఉండండి

సెలవులో ఉన్నవారు రద్దు చేసుకొని రండి

వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ ఆదేశం

టెలికాన్ఫరెన్స్.. మంత్రులకూ సూచనలు

అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు

వరద నీటిని ఒడిసిపట్టేలా చర్యలు: ఉత్తమ్

వరద పరిస్థితులపై మోదీ ఆరా

సీఎం రేవంత్‌కు ప్రధాని, అమిత్ షా ఫోన్

హెలికాప్టర్లు పంపిస్తామని హామీ

అన్నింటికీ సిద్ధంగా ఉండండి

కలెక్టర్లతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

రాబోయే 24 గంటలూ జాగ్రత్త!

కలెక్టర్లు, ఎస్పీలతో వీసీలో మంత్రి పొంగులేటి

ఏపీకి రాకపోకల బంద్

మహారాష్ట్ర, కర్ణాటకకు కూడా..

కోదాడ వద్ద జాతీయ రహదారిపైకి పాలేరు బ్యాక్ వాటర్

నార్కట్‌పల్లి-అద్దంకి హైవేపైకి వాహనాలు

ఖమ్మం-సూర్యాపేట మార్గం మూత

శ్రీశైలం వద్ద విరిగిన కొండచరియలు

ఘాట్ రోడ్డుపై నిలిచిన రాకపోకలు

భారీ వర్షాలతో 80 రైళ్ల రద్దు

వరంగల్ మీదుగా విజయవాడ వెళ్లేవన్నీ..

పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న ట్రాక్‌లు

వివిధ స్టేషన్లలో నిలిచిపోయిన రైళ్లు



మీ టూపై నివేదికను బయటపెట్టండి

2019 నాటి కమిటీ రిపోర్టును వెల్లడించండి

తద్వారా టాలీవుడ్‌లో మహిళలకు మేలు

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన నటి సమంత

మంచు లక్ష్మీ, చిన్మయి, సుమ మద్దతు

10

ముగ్గురు పిల్లలకు విషమిచ్చి..

ఉరేసుకున్న తల్లి

తాగుడుకు బానిసైన భర్త.. కిడ్నీలు విఫలం

కుటుంబ కలహాలతో ఇల్లాలు సతమతం

కష్టాలు తాళలేక పిల్లలతో బలవన్మరణం

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో దారుణం

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 1: ఇంటి పెద్ద తాగుడుకు బానిసయ్యాడు. విపరీతమైన మద్యపానంతో కిడ్నీలు పాడయ్యాయి. ఆ ఇంట్లో ఇల్లాలు సహా ఐదేళ్లలోపు వయసున్న ముగ్గురు పిల్లలున్నారు. అసలే పేద కుటుంబం. భర్త అనారోగ్యం బారిన పడటంతో ఆర్థిక కష్టాలు, కుటుంబ కలహాలు ఎక్కువయ్యాయి. దీంతో ఆ ఇల్లాలు కుంగిపోయింది. బాధలను భరించలేక చనిపోవాలని నిర్ణయించుకుంది. అయితే, తాను చనిపోతే పిల్లల బాగోగులు ఎవరు చూసుకుంటారనే బెంగతో.. చిన్నారులతో సహా ఆత్మహత్య

మిగతా 3వ పేజీలో...



వెంకటేష్ కుటుంబం(ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

భార్య, ఇద్దరు పిల్లలను హతమార్చి..

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

అప్పుల్లో కూరుకుపోయి తీవ్ర నిర్ణయం

హైదరాబాద్‌లో దారుణ ఘటన

2

పాలిస్తూనే ప్రాణం తీసింది!

శిశువును గొంతు నులిమి చంపిన తల్లి

నాలుగో సంతానమూ ఆడపిల్ల కావడంతోనే..

తల్లిపై హత్య కేసు నమోదు.. ఢిల్లీలో ఘటన



సీఎంఆర్ఎఫ్ స్కాంలో ఇద్దరి అరెస్టు

2 ఆస్పత్రుల పేరుతో 19 నకిలీ బిల్లులు

నల్లగొండ ప్రాంతంలో మోసాలు: డీజీపీ

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ నకిలీ బిల్లుల కుంభకోణానికి సంబంధించి.. నల్లగొండ జిల్లాలో గొట్టి గిరి(46), లేకిరెడ్డి సైదిరెడ్డి(40) అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల్లో వ్యత్యాసాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 6 కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా.. నల్గొండకు చెందిన అమ్మ హాస్పిటల్, మిర్యాలగూడకు చెందిన నవీనా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ పేర్లతో ఆ ఇద్దరూ 19 నకిలీ దరఖాస్తులు సమర్పించినట్లు వెల్లడైందని డీజీపీ వివరించారు. దీంతో వారిద్దరినీ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కోసం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచినట్లు ఆయన వెల్లడించారు.

పాలిస్తూనే ప్రాణం తీసింది!

- నవజాత శిశువును గొంతు నులిమి చంపిన తల్లి
- నాలుగో సంతానంగా మళ్లీ ఆడపిల్లే పుట్టడంతో దారుణం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ముక్కుపచ్చలారని నవజాత శిశువును కన్న తల్లే చంపేసింది. నాలుగో సంతానంగా మళ్లీ ఆడపిల్లే పుట్టడంతో ఆ వివాహిత(28) పాలిస్తూనే ఆ పసికందును గొంతు నులిమి ప్రాణం తీసిందని పోలీసులు తెలిపారు. తల్లిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆరు రోజుల వయసున్న ఆడ శిశువు కనిపించడంలేదని పశ్చిమ ఢిల్లీలోని ఖ్యాలా పోలీసు స్టేషన్‌కు శుక్రవారం ఉదయం ఫోన్ వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. తల్లితో మాట్లాడగా.. రాత్రి తన బిడ్డకు పాలిచ్చిన తర్వాత పక్కనే పడుకోబెట్టుకున్నానని, లేచి చూసేసరికి తన పాప పక్కన లేదని పేర్కొంది. పోలీసులు సీసీటీవీ కెమెరాలతోపాటు చుట్టుపక్కల ఇళ్ల వద్ద తనిఖీలు చేపట్టగా సమీపంలోని ఓ ఇంటి పైకప్పుపై సంచిని గుర్తించారు. అందులోనే ఆ శిశువు విగతజీవిగా పడి ఉంది. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు పోయినట్టు వైద్యులు తెలిపారు. తల్లి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెను పోలీసులు ప్రశ్నించారు. దీంతో తానే తన బిడ్డను చంపినట్టు ఒప్పుకుంది.

వాణిజ్య సిలిండర్ ధర రూ.39 పెంపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: చమురు సంస్థలు వాణిజ్య వంట గ్యాస్ సిలిండర్ ధరను మరోసారి పెంచాయి. అంతర్జాతీయ చమురు ధరల సరళికి అనుగుణంగా నెలవారీ చేసే సవరణల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు ప్రకటించాయి. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి రూ.39 పెంచాయి. ఆగస్టు 1న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.6.50 పెంచిన చమురు సంస్థలు ఈ సారి మరింత భారం మోపాయి. తాజా నిర్ణయంతో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.1919కు పెరిగింది. ఇక, జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా 1.2%, 2% మేర విమాన ఇంధన ధరలను పెంచిన చమురు సంస్థలు తాజా సవరణలో 4.6 శాతం తగ్గించాయి. సవరించిన ధర ప్రకారం.. ఏటీఎఫ్ కిలో లీటరుకు రూ.4,495.50 తగ్గి రూ.93,480.22 కు చేరింది.

శంకర్ ఐఏఎస్ అకాడమీకి రూ.5 లక్షలు ఫైన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 : కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ(సీసీపీఏ) 2022 సివిల్ సర్వీస్ పరీక్షకు సంబంధించి తప్పుదోవ పట్టించేలా ప్రకటన ఇచ్చినందుకు శంకర్ ఐఏఎస్ అకాడమీకి రూ.5 లక్షల జరిమానా విధించింది. 2022 సివిల్ సర్వీసు పరీక్షకు సంబంధించి ఆ అకాడమీ ఇచ్చిన ప్రకటనలో ఆల్ ఇండియా స్థాయిలో ఎంపికైన 933 మందిలో 336 మంది తమ అకాడమీలో శిక్షణ పొందారని, 40 మంది టాప్ 100లో ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై సీసీపీఏ విచారించగా సివిల్స్‌లో ఎంపికైన అభ్యర్థులు శంకర్ ఐఏఎస్ అకాడమీలో ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించి ఇచ్చిన సమాచారం తప్పని తేలింది.



వడోదర.. మొసళ్ల దడ

ఇళ్ల పైకప్పులు.. పార్కులు.. రోడ్లు.. ఎక్కడంటే అక్కడ మొసళ్లు..! ఒక్కోటి 10 నుంచి 15 అడుగులు..! బయటకు రావాలంటేనే భయం..! ఇదీ ప్రస్తుతం గుజరాత్‌లోని వడోదర ప్రజల పరిస్థితి. ఇటీవలి వర్షాలకు నగరంలోకి వందలాది మొసళ్లు కొట్టుకుని వచ్చాయి! అటవీశాఖ అధికారులు 24 మొసళ్లను పట్టుకున్నారు.

తీర్పు వచ్చే సరికి తరం మారుతోంది

వాయిదాల సంస్కృతిని మార్చండి

- కోర్టు అంటేనే సామాన్యుల్లో భయం
- దీనిపై అధ్యయనం చేయండి
- న్యాయ వ్యవస్థకు ముర్ము హితవు



జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ జాతీయ సదస్సులో జస్టిస్ చంద్రచూడ్‌తో ముర్ము

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: కక్షిదారులకు సత్వర న్యాయం అందాలంటే కోర్టుల్లోని 'వాయిదాల సంస్కృతి'ని మార్చాల్సి ఉందని ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. దీనిపై తొలుత దృష్టి పెట్టాలని న్యాయవ్యవస్థకు సూచించారు. ఇక్కడ రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు ముగింపు ఉత్సవంలో ఆమె ప్రసంగించారు. పెండింగ్ కేసులు 'మనందరికీ' పెద్ద సవాలుగా మారాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే తొలుత కేసుల విచారణను వాయిదా వేసే విధానంలో మార్పులు రావాలని చెప్పారు. అత్యాచారం వంటి కేసుల్లోనూ తీర్పులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "అత్యాచారం వంటి కేసుల్లోనూ తీర్పులు వచ్చేసరికి తరం మారుతోంది. న్యాయ ప్రక్రియలో సున్నితత్వం లోపించిందని సామాన్యులు అనుకుంటున్నారు" అని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. గ్రామాల్లోని ప్రజలు న్యాయాలయాలను దేవాలయాలుగా భావిస్తున్నారని అన్నారు. "దేవుని ఇంట్లో ఆలస్యం జరుగుతుందేమోగానీ, అన్యాయం మాత్రం జరగదని నమ్ముతుంటారు. కానీ ఈ అలస్యం ఎంత కాలం? మనమంతా దీనిపై ఆలోచించాలి" అని హితవు చెప్పారు. "కొందరికి న్యాయం లభించే సమయానికి వారి ముఖాల్లో నవ్వులు కనిపించడం లేదు. కొందరి జీవితాలు అంతమవుతున్నాయి. దీనిపై మనమంతా దృష్టి పెట్టాలి" అని అన్నారు. కోర్టు రూముల తీరుపైనా రాష్ట్రపతి అన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కోర్టు రూముల సెట్టింగ్‌ను చూడగానే సామాన్యుల్లో ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. దీనికి 'నల్ల కోర్టు లక్షణం' (బ్లాక్ కోర్ట్ సిండ్రోం) అన్న పేరు పెట్టారు. దీనిపై అధ్యయనం జరగాలని సూచించారు. న్యాయాధికారుల పోస్టుల్లో మహిళల సంఖ్య పెరుగుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు సౌకర్యాలేవీ: సీజేఐ

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగిస్తూ జిల్లా స్థాయి కోర్టుల్లో మహిళా అధికారులు, న్యాయవాదులకు తగిన సౌకర్యాలు లేవని చెప్పారు. కేవలం 6.7శాతం కోర్టుల్లోనే మహిళలకు కనీస సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో 60-70 శాతం మేర మహిళలను న్యాయాధికారులుగా భర్తీ చేస్తున్నారని, అలాంటప్పుడు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాల్సి ఉందని చెప్పారు.

అత్యాచారాలు సర్వసాధారణం అంటారా?

కపిల్ సిబల్‌పై ఉపరాష్ట్రపతి విమర్శలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: కోల్‌కతాలో ట్రైనీ డాక్టరుపై అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటనను తక్కువ చేసి చూపారంటూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌ను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తప్పుపట్టారు. ఆ దుర్ఘటనపై ప్రజానీకమంతా సిగ్గుతో తలవంచుకున్న సమయంలో కొందరు మాత్రం పుండుపై కారం చల్లారని విమర్శించారు. కోల్‌కతా సంఘటనపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుని హోదాలో సిబల్ వ్యాఖ్యానిస్తూ 'అది దుర్బుద్ధికి సూచిక' అని పేర్కొన్నారు. అలాంటివి సాధారణంగా జరుగుతుంటాయన్నారు. దీనినే ఉపరాష్ట్రపతి తప్పుపట్టారు. ఆదివారం రిషీకేష్ ఎయిమ్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. సిబల్ తమ ఆలోచనలను మార్చుకొని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలను రాజకీయ కోణంలో చూడకూడదని చెప్పారు. పని స్థలాల్లో వైద్యులకు రక్షణ కల్పించాల్సి ఉందని అన్నారు.



3 నెలల్లో వందేభారత్ స్లీపర్ రైళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: వందేభారత్ స్లీపర్ ట్రైన్ కోసం బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్) కంపెనీలో తయారు చేస్తున్న బోగీల నమూనా ఫొటోలను కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం విడుదల చేశారు. ఈ రైలు మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. రైలులో మొత్తం 16 బోగీలు(823 బెర్తులు) ఉంటాయని చెప్పారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ఈ రైలును రూపొందిస్తున్నారని, టికెట్ రేట్లు రాజధాని ఎక్స్‌ప్రెస్ స్థాయిలో ఉంటాయని మంత్రి వివరించారు. వందేభారత్ స్లీపర్ రైలు బోగీల్లో ఆక్సిజన్ సరఫరా, వైరస్ వ్యాప్తిని నియంత్రించే వ్యవస్థలతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన టాయిలెట్లు, వేడి నీటి సదుపాయం, అగ్ని నిరోధక వ్యవస్థ.. ఇలా ఇంకా చాలా వసతులు ఉంటాయని చెప్పారు. కవచ్ వ్యవస్థ కూడా ఇందులో ఉంటుందన్నారు.

కాంగ్రెస్‌లో 'క్యాస్టింగ్ కౌచ్'

- కేరళ నాయకురాలి ఆరోపణ.. పార్టీ నుంచి బహిష్కరణ

కోచి, సెప్టెంబరు 1: కాంగ్రెస్ పార్టీ కేరళ శాఖలో పెద్ద వివాదం నెలకొంది. సినిమా పరిశ్రమలో మాదిరిగానే కాంగ్రెస్‌లోనూ 'క్యాస్టింగ్ కౌచ్' బెడద ఉందని ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకురాలు సిమీ రోస్‌బెల్ జాన్ ఆరోపించారు. పార్టీలో మహిళలు లైంగిక దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆమెను బహిష్కరించింది. ఎర్నాకుళానికి చెందిన రోస్‌బెల్ శనివారం ఓ చానెల్‌తో మాట్లాడుతూ.. పార్టీలో మహిళలను లైంగికంగా వేధిస్తున్నారంటూ ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్ సహా పలువురిపై ఆరోపణలు చేశారు. నాయకుల మెప్పు పొందేవారికే ముఖ్యమైన పదవులు దక్కుతున్నాయని అన్నారు. రోస్‌బెల్ ఆరోపణలను సతీశన్ ఖండించారు. ఆమెకు ఏఐసీసీ పదవులు దక్కాయని గుర్తు చేశారు. మీడియా ముందు మహిళా నేతలను కించపరిచినందుకు రోస్‌బెల్‌ను ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్టు పార్టీ నాయకత్వం ప్రకటించింది.

హమాస్‌ను అంతమొందించాల్సిందే: కమలాహ్యారిస్

టెల్ అవీవ్, సెప్టెంబరు 1: గాజాలో ఆరుగురు ఇజ్రాయెలీ బందీల మృతదేహాలను గుర్తించినట్లు ఆ దేశ సైన్యం ఆదివారం ప్రకటించిన వెంటనే.. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ హమాస్ ఉగ్రవాద సంస్థపై కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను అంతమొందించాల్సిందేనన్నారు. గాజాను నియంత్రించే అధికారం హమాస్‌కు ఉండకూడదని తేల్చిచెప్పారు. మృతిచెందిన బందీల్లో ఇజ్రాయెల్ సంతతికి చెందిన అమెరికన్ గోల్డ్‌బెర్గ్ పోలిన్ ఒకరు. దీనిపై కమల సీరియస్ అయ్యారు. "అమెరికా పౌరులు ఎక్కడున్నా వారి భద్రత మాకు ముఖ్యం. హమాస్ ఉగ్రవాద సంస్థ. దాన్ని అంతం చేయాల్సిందే" అని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు నెతన్యాహు తీరువల్లే బందీల హత్యలు జరుగుతున్నాయన్న విమర్శలు ఇజ్రాయెల్‌లో వెల్లువెత్తుతున్నాయి.

లోకం తీరు



బెంగాల్‌లో మరో దారుణం.. నర్సుపై లైంగిక వేధింపులు

- రాత్రి విధుల్లో ఉన్న నర్సు.. సెలైన్ ఎక్కిస్తుండగా వేధించిన రోగి అబ్బాస్

కోల్‌కతా, సెప్టెంబరు 1: పశ్చిమబెంగాల్ రాష్ట్రం బీర్భం జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో విధుల్లో ఉన్న నర్సుతో ఓ రోగి అసభ్యంగా ప్రవర్తించడం కలకలం రేపుతోంది. అబ్బాస్ ఉద్దీన్ అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతుండడంతో శనివారం రాత్రి కుటుంబ సభ్యులు ఇలాంబజార్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతనికి సెలైన్ ఎక్కించడానికి వార్డుకు తరలించారు. అక్కడ నర్సు సెలైన్ ఎక్కిస్తుండగా అబ్బాస్ ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడు. తాకరాని చోట తాకడంతో పాటు అసభ్య పదజాలాన్ని ఉపయోగించాడు. "ఆ రోగి నన్ను లైంగికంగా వేధించాడు. దుర్భాషలాడాడు. చాలా భయమేసింది" అని నర్సు వాపోయారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అబ్బాస్‌ను అరెస్టు చేశారు. మరోవైపు, హౌరా జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో ఓ ల్యాబ్ టెక్నీషియన్ సిటీ స్కాన్ కోసం వచ్చిన 13 ఏళ్ల బాలికను వేధించాడు. పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకొన్నారు.

జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ వస్తున్న 'ఇండిగో'కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఇండిగో విమానం నెంబరు 6ఈ 7308కి ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో దాన్ని నాగ్‌పూర్ మళ్లించి అత్యవసరంగా అక్కడ కిందికి దించివేశారు. క్షుణ్ణంగా తనిఖీలు జరిపిన అనంతరం అది నకిలీ హెచ్చరిక అని తేలింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో సంస్థ క్షమాపణలు చెప్పింది. మరోవైపు, కోల్‌కతా నుంచి బెంగళూరుకు శుక్రవారం రాత్రి బయలుదేరిన మరో ఇండిగో విమానం ఇంజినులో సాంకేతిక లోపం తలెత్తడంతో వెంటనే దాన్ని దింపివేశారు.

ప్రముఖ పర్యావరణవేత్త అల్లాణి ఇకలేరు



పటాన్‌చెరు, సెప్టెంబరు 1: కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే పటాన్‌చెరులో తొలిసారిగా పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా గళం విప్పిన ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ అల్లాణి కిషన్‌రావు(86) కన్ను మూశారు. కొంతకాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం సాయంత్రం ఇంటివద్దే మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామలో జన్మించిన కిషన్‌రావు ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పటాన్‌చెరులోనే వైద్య వృత్తిని కొనసాగించారు. పటాన్‌చెరు, బొల్లారం తదితర ప్రాంతాల్లో 1980 ప్రాంతంలో రసాయన పరిశ్రమల కాలుష్యంపై ఆయన అలుపెరగని పోరాటం చేశారు. పటాన్‌చెరు, జిన్నారం మండలాల పరిధిలోని అనేక గ్రామాల్లో భూగర్భ జలవనరులు కలుషితమవడంపై ఆధారాలతో సహా సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆసానికుంట చెరువు కాలుష్య వ్యవహారం ఆ రోజుల్లో దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. సుప్రీంకోర్టులో ఆయన వేసిన పిల్ అప్పటి ప్రభుత్వాల్లో ప్రకంపనలు సృష్టించింది. నాటి జడ్జి జస్టిస్ జీవన్‌రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో కాలుష్యంతో దెబ్బతిన్న చెరువులు, గ్రామాలను పరిశీలించి చలించిపోయారు. పటాన్‌చెరు ప్రాంతాన్ని మరో చెర్నోబిల్‌గా అభివర్ణించారు. కాలుష్యానికి కారణమైన పరిశ్రమల యాజమాన్యాలు పటాన్‌చెరులో వంద పడకల ఆస్పత్రిని నిర్మించాలని నాడు సుప్రీంకోర్టు ఆదేశించింది. 1990 ప్రాంతంలో రుద్రారంలోని పశుమాంస ఎగుమతి పరిశ్రమ అల్‌కబీర్ లిమిటెడ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నిర్వహించిన ఆందోళనలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. 1992 సార్వత్రిక ఎన్నికల్లో మెదక్ లోక్‌సభకు బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. పటాన్‌చెరు కాలుష్యంపై ఆయన రచించిన 'ఏ హెల్ ఆన్ ది ఎర్త్' పుస్తకం సంచలనం సృష్టించింది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

భార్య, ఇద్దరు పిల్లలను చంపి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

- అప్పుల్లో కూరుకుపోయి తీవ్ర నిర్ణయం
- హైదరాబాద్‌లో దారుణ ఘటన

జీడిమెట్ల/హైదరాబాద్ సిటీ, మంచిర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, ట్రేడింగ్ వ్యసనం ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబాన్ని చిదిమేసింది. మూడేళ్ల, 11 ఏళ్ల వయస్సు ఉన్న అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును మింగేసింది. ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌కు బానిసై అప్పుల్లో కూరుకుపోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. తన భార్య, ఇద్దరు కుమారులను చంపి.. ఆ తర్వాత ఉరి వేసుకున్నాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్‌లోని గాజుల రామారం ప్రాంతంలో జరిగింది. మంచిర్యాలకు చెందిన ఇప్ప వెంకటేష్ (40)కు భార్య వర్షిణి(33), కుమారులు రిషికాంత్ (11), విహాంత్ (3) ఉన్నారు. కోకాపేట్‌లోని లెగోటో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న వెంకటేష్.. భార్యాపిల్లలతో కలిసి గాజుల రామారం, బాలాజీ లే అవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌తోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన వెంకటేష్.. తెలిసిన వారి దగ్గర మాత్రమే కాక లోన్ యాప్‌ల్లోనూ రుణాలు తీసుకున్నాడు. అన్నింటిలోనూ నష్టపోయి రూ.25లక్షలకు పైగా అప్పుల్లో కూరుకుపోయాడు. చేసిన అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని పోషించ లేక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు.

దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి?

తాను లేకపోతే భార్యాపిల్లలు రోడ్డున పడతారనే భావనతో ముందుగా వారిని హత్య చేసి ఆపై గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి వెంకటేష్ తన భార్య, ఇద్దర పిల్లలను హతమార్చినట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. కాగా, అప్పుల బాధ తాళలేక తామంతా ఆత్మహత్య చేసుకుంటున్నామని ఆదివారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వెంకటేష్ తన తండ్రి ఫోన్‌కి మెసేజ్ పెట్టాడు. ఉదయం 3.30 గంటల ప్రాంతంలో ఆ మెసేజ్ చూసిన వెంకటేష్ తండ్రి.. కుమారుడు నివసిస్తున్న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి అప్రమత్తం చేసినా ఫలితం లేకపోయింది. ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో ఇరుగుపొరుగు వారు తలుపులు పగలకొట్టి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి కుటుంబం అంతా విగతజీవులై పడి ఉన్నారు. విషయం తెలిసి ఘటనా స్థలికి చేరుకున్న జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకటేష్ తన భార్య ఇద్దర కుమారులకు విషం ఇచ్చి చంపాడా ? లేదా దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హతమార్చాడా ? అనేది తేలాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మృదుల

- బేగంపేట ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం



బేగంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.నందవరం మృదుల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అందజేసే ఈ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 16మందిని ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవార్డు దక్కించుకున్న ఏకైక ఉపాధ్యాయురాలుగా మృదుల నిలిచారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమె.. ఇటీవల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈనెల 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకోనున్నారు.

రాళ్లవాగులో కొట్టుకుపోయిన ట్రాన్స్‌పోర్ట్ డీసీఎం

- ఐదుగురిలో నలుగురు సురక్షితం.. ఒకరు గల్లంతు

మహబూబాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో.. ఓ ట్రాన్స్‌పోర్ట్ డీసీఎం బోల్తా పడి కొట్టుకుపోయింది. దాంట్లోని ఐదుగురిలో ఒకరు గల్లంతు కాగా.. నలుగురిని అధికారులు కాపాడారు. రంగారెడ్డి జిల్లా కొంపెల్లి నుంచి ఏపీలోని రాజమండ్రికి వెళ్తున్న డీసీఎం.. మహబూబాబాద్‌జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈదులపూసపల్లి రాళ్లవాగు వద్ద ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. అందులో రాజమండ్రికి చెందిన సునీల్, సంగారెడ్డికి చెందిన ప్రవీణ్ (డ్రైవర్), నాగభూషణం, గుంటూరుకు చెందిన వేణు, మహబూబాబాద్‌కు చెందిన దుర్గాప్రసాద్ ఉన్నారు. విషయం తెలియగానే కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలో దిగారు. నాగభూషణం మినహా మిగతా నలుగురినీ కాపాడారు. నాగభూషణం ఆచూకీ గల్లంతయ్యింది.



ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న నర్సింహులు

పాలనలో సంస్కరణలు తెచ్చింది చంద్రబాబే

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని

హైదరాబాద్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుదేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. ప్రజలవద్దకు పాలన, జన్మభూమి, శ్రమదానం వంటి వినూత్న కార్యక్రమాలతోపాటు పాలనలో ఎన్నో సంస్కరణలు తెచ్చారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు మూలం చంద్రబాబేనని తెలిపారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా (1995 సెప్టెంబరు1న) ప్రమాణస్వీకారం చేసి 30వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా టీటీడీపీ నేతలు ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకొన్నారు. పార్టీజాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సీనియర్ నేత సామ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

- గురుకులాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి
- 715 మంది అస్వస్థతకు గురైనా పట్టించుకోరా?
- హరీశ్, గంగుల, జగదీశ్‌రెడ్డి



కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

దేవరకొండ/శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 1: కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర వీడి గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్, జగదీశ్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలను ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌లతో కలిసి వారు సందర్శించారు. గురుకులంలో ఎలుకలు కరిచిన విద్యార్థులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గురుకులాల్లో 715 మంది విద్యార్థులను ఎలుకలు, కీటకాలు కరిచి ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దిన గురుకులాలను కాంగ్రెస్ సర్కారు విధ్వంసం చేసిందన్నారు. కనీస వసతులు, సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం హైడ్రా పేరిట డ్రామాలు చేస్తున్నారని, గురుకులాల స్థితిగతులను పట్టించుకోవడం లేదని వారు ధ్వజమెత్తారు.

బురద జల్లడమే బీఆర్ఎస్ పని: దుద్దిళ్ల

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాల్మాకుల కేజీబీవీలో పనిచేస్తున్న 9 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఉపాధ్యాయుల మధ్య విభేదాల కారణంగా విద్యాలయంలో సమస్యలు వచ్చాయని గుర్తించామని, అందుకే బదిలీ చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆదివారం విద్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై బురద జల్లడం కోసమే బీఆర్ఎస్ నాయకులు హరీశ్ రావు, సబితారెడ్డి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులతో ధర్నాలు రాస్తారోకోలు చేయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

హైడ్రా పేరిట హైడ్రామా

పేదల జోలికొస్తే ఖబడ్దార్.. సీఎం రేవంత్‌కు ఈటల హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హైడ్రా పేరిట హైడ్రామా నడుస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. కూల్చివేతల పేరుతో జరుగుతున్నదంతా డ్రామా తప్ప.. సమాజహితం కోసం కాదని అన్నారు. ఈ రాష్ట్రమేదో కొత్తగా ఏర్పడినట్టు, తానే మొదటి సీఎం అన్నట్లు రేవంత్ పోజులు కొడుతున్నారని విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. పేదల కాలనీలకు హైడ్రా నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక ప్రభుత్వం పోతే మరో ప్రభుత్వం వస్తుందన్న సోయి లేదా..? అని సీఎంను నిలదీశారు. పట్టాలు పొందిన పేదల ఇళ్లు కూల్చివేస్తున్నందుకుగాను.. గడచిన ఏడు దశాబ్దాలుగా పనిచేసిన ముఖ్యమంత్రులంతా తప్పు చేశారని చెంపలు వేసుకోవాలని రేవంత్‌ను డిమాండ్ చేశారు. ఏడు దశాబ్దాల్లో జరిగిన అక్రమాలు ఒక్క రోజులో ఎలా పోతాయని సీఎంను నిలదీశారు. పేదల ఇళ్లను కూలిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ప్రజలు తిరగబడితే ఏమవుతుందో బంగ్లాదేశ్, శ్రీలంకలను చూసి నేర్చుకోవాలన్నారు.

ఈటలకు అవగాహన లేదు: టీపీసీసీ

హైదరాబాద్ పరిసర ప్రాంతాలపై అవగాహన లేని ఈటల రాజేందర్ హైడ్రాపై విమర్శలు మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్‌గౌడ్ సూచించారు. ఆయన కబ్జాకోరులకు అండగా ఉంటారా.. లేక హైదరాబాద్ నగరవాసులకా అన్నది తేల్చుకోవాలన్నారు. హైడ్రా చర్యలతో రేవంత్‌కు ప్రశంసలు దక్కుతుంటే.. ఈటలకు కళ్లు మండుతున్నాయని ఓ ప్రకటనలో విరుచుకుపడ్డారు. ఆక్రమణల కూల్చివేతలను రాజకీయ కోణంలో కాకుండా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణగా చూడాలన్నారు.

చిన్నబోయిన పెద్ద చెరువు!

ద ప్రెస్టీజ్ నిర్మాణ సంస్థ 30 ఎకరాలు ఆక్రమించినట్లు ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గగన్‌పహాడ్ మొదలు.. ప్రేమావతిపేట్ వరకు 97.26 ఎకరాల్లో విస్తరించిన పెద్ద చెరువు ఇప్పుడు చిన్నబోయిందా? 30 ఎకరాల దాకా చెరువులోకి అక్రమ నిర్మాణాలు చొచ్చుకొచ్చాయా? ద ప్రెస్టీజ్ సిటీ పేరుతో నిర్మాణాలు చేపడుతున్న సంస్థ ఈ ఘాతుకానికి పాల్పడిందా? ఈ ప్రశ్నలకు స్థానికులు కొందరు అవునని స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో), హైడ్రాకు ఫిర్యాదులు చేశారు. 2017 నుంచి ఇప్పటి వరకు పెద్ద చెరువు కుంచించుకుపోతున్న తీరుపై గూగుల్‌ఎర్త్ ఉపగ్రహ చిత్రాల మ్యాప్‌లను తమ ఫిర్యాదులకు జత చేశారు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నామని, ఆక్రమణలు నిజమని నిర్ధారణ అయితే.. చర్యలు తప్పవని హైడ్రా అధికారులు చెబుతున్నారు. పెద్ద చెరువుగా పేరున్న మాల్గుడ్ చెరువు.. రాజేంద్రనగర్ మండలం ప్రేమావతిపేట్ గ్రామ పరిధిలోని 81 నుంచి 89 వరకు ఉన్న సర్వే నెంబర్లలో 97.26 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి.



నీట మునిగిన విజయవాడలోని వైఎస్‌ఆర్‌ కాలనీ



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

విలయవాడ!

బెజవాడను ముంచేసిన బుడమేరు.. జలావాసాలుగా మారిన విజయవాడ కాలనీలు

- ఐదు నుంచి 8 అడుగుల వరకు మునక
- కలవరపెడుతున్న మహోగ్ర కృష్ణమ్మ
- 2009 తర్వాత మరోసారి భారీ ప్రవాహం

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని విజయవాడ నగరంపై బుడమేరు దండెత్తింది. కనీవినీ ఎరుగని స్థాయిలో ముంచెత్తి బీభత్సం సృష్టించింది. పదులసంఖ్యలో కాలనీలను చుట్టుముట్టి విజయవాడను విలయవాడగా మార్చేసింది. అటు కృష్ణమ్మ ఉగ్ర రూపం... ఇటు బుడమేరు కన్నెర్రతో బెజవాడ బెంబేలెత్తింది. శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వాన శనివారం సాయంత్రానికి ఉపశమించంతో నగరం కాస్త ఊపిరి పీల్చుకుంది. కానీ, కృష్ణా పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు బుడమేరు పొంగి పొర్లింది. అప్పటికే కృష్ణమ్మ భారీగా ప్రవహిస్తుండటంతో.. బుడమేరు చానల్ నుంచి నదిలోకి నీరు కలిసే అవకాశం లేకపోయింది. పైగా... కృష్ణా నది నీరు కూడా ఎగదన్నింది. దీంతో బుడమేరు కట్టలు తెంచుకున్నట్లుగా చెలరేగిపోయింది. ఫలితంగా బుడమేరును ఆనుకుని ఉన్న జక్కంపూడి కాలనీ, అజిత్‌సింగ్ నగర్, పాత రాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేట, అయోధ్యనగర్, దేవీనగర్, రాజీవ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, వాంబే కాలనీ, చిట్టినగర్, పాల ఫ్యాక్టరీ, కబేళా, ఉర్మిళా నగర్, పాయకాపురం, భవానీపురం ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఐదు నుంచి ఎనిమిది అడుగుల మేరకు నీరు చేరడంతో ఆ ప్రాంతం జలసంద్రాన్ని తలపించింది. ఆదివారం ఉదయానికే అపార్టుమెంట్లు సెల్లార్‌లలోకి నీరు ప్రవేశించింది. తర్వాత కాసేపటికి అపార్టుమెంట్ల మొదటి అంతస్తు వరకు చేరింది. సుమారు 2 లక్షల మంది వరదనీటిలో చిక్కుకున్నారు. అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతాలను ఏకంగా 8 అడుగుల మేరకు ముంచెత్తింది. ఇతర ప్రాంతాల్లో ఐదు నుంచి ఎనిమిది అడుగుల మేర నీళ్లు నిలిచాయి. జక్కంపూడిలోని రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు మొదటి అంతస్తు వరకు మునిగిపోయాయి. ఇక, విజయవాడ సమీపంలోని గ్రామాలపైనా బుడమేరు ప్రభావం పడింది. ఇబ్రహీంపట్నం మండలం రాయనపాడు, కవులూరు, ఈలప్రోలు, పైడూరుపాడు, కొండపల్లి ఇందిరమ్మ కాలనీ, ఇబ్రహీంపట్నం ఖాజీ మాన్యంలోకి వరద నీరు వచ్చి చేరింది. వేలాది ఎకరాల భూములు నీటమునిగాయి. రాయనపాడు వద్ద రైల్వేట్రాక్‌పైకి వరద నీరు చేరడంతో తమిళనాడు, గోదావరి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. బుడమేరు ఈస్థాయిలో దండెత్తడం మాత్రం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి. మున్నేరు వాగు నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిని ముంచెత్తింది దీంతో హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను చిల్లకల్లు వద్ద, విజయవాడ వైపు నుంచి వెళ్లే వాహనాలను కీసర వద్ద నిలిపివేశారు. ఇక... 2009 తర్వాత కృష్ణమ్మ మరోసారి భీకరావతారం దాల్చింది. ఆదివారం రాత్రికే ప్రకాశం బ్యారేజీ నుంచి 9 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. తెల్లవారేసరికి ఇది పది లక్షల క్యూసెక్కులు దాటే అవకాశముంది. ప్రభుత్వ యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది.



వరద నీటి ముంపులో విజయవాడలోని రాజరాజేశ్వరిపేట

జలదిగ్బంధంలో ఏపీ జిల్లాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో మూడు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్థ మైంది. దీనికితోడు ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న వరద కారణంగా జిల్లాలు జలదిగ్బంధమయ్యాయి. దీంతో ఆయా జిల్లాల అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు వరద ప్రభావిత జిల్లాల్లో సోమవారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. గత 48 గంటల్లో కురిసిన భారీ వర్షాలతో ప్రకాశం జిల్లాలోని పలు దాదాపు అన్ని ప్రాంతాలూ నీట మునిగాయి. పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో జన జీవనం స్తంభించింది.

మునిగిన కృష్ణా మిల్క్... 70 కోట్ల నష్టం

భారీ వర్షాలు, వరదల కారణంగా కృష్ణా మిల్క్ యూనియన్‌కు రూ.70 కోట్ల నష్టం వాటిల్లింది. విజయవాడ కొత్తపేటలో కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఫ్యాక్టరీ ప్రధాన కార్యాలయం ఉంది. ఇక్కడ పాల సేకరణతోపాటు పాల పదార్థాలు తయారుచేసే ప్లాంట్లు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీకి కొంతదూరం నుంచి బుడమేరు కాల్వలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొత్తపేట, ఫ్యాక్టరీ ప్రాంతాలు నీట మునిగాయి. ఫ్యాక్టరీలోకి 5అడుగుల మేరకు నీరు చేరింది. ఫ్రిజ్‌లు మొత్తం ఆగిపోయి పదార్థాలు పాడైపోవడంతో రూ.70 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని ఎండీ కె.ఈశ్వరరావు, చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.

ప్రాణరక్షణే లక్ష్యం

- ఎవరికీ ఇబ్బంది రానివ్వం.. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం
- విపత్తు సహాయం 5 లక్షలకు పెంపు: ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడడం తమ ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం మంత్రులు, సీఎస్, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. అధికారులు ఎంత వద్దన్నా బుడమేరు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. సాయంత్రం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయానికి వచ్చారు. స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ఇది మీ ప్రభుత్వం. అన్ని విషయాల్లో శ్రద్ధ తీసుకుంటున్నాం. రెస్క్యూ ఆపరేషన్‌తో బాధితులకు పునరావాసం కల్పించడం ద్వారా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. సహాయ చర్యల్లో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలి' అని కోరారు. విపత్తు సాయాన్ని రూ.5 లక్షలకు పెంచామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 'వరద బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో చొప్పున ఐదు రకాల నిత్యావసర సరుకులు ఇస్తున్నాం. ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 28.5 సెంటీమీటర్ల అదనపు వాన పడింది. 3 జిల్లాల్లో 60%పైన, 19 జిల్లాల్లో 20-50% దాకా ఎక్కువ వర్షపాతం నమోదైంది. విజయవాడ-గుంటూరు హైవేపై కాజ వద్ద, విజయవాడ-హైదరాబాద్ మధ్య హైవేపై చెరువుల్ని తలపించేలా వరద వచ్చింది. ఇది చాలా బాధాకరం. దురదృష్టవశాత్తూ కొండచరియలు పడి ఐదుగురు, గుంటూరు జిల్లాలో కారు కొట్టుకుపోయి ముగ్గురు, మంగళగిరిలో ఒక మహిళ మృతి చెందారు. 9 మంది చనిపోయారు' అని ఆవేదన వ్యక్తంచేశారు.



వరద ప్రభావిత ప్రాంతాలను బోటులో పరిశీలిస్తున్న చంద్రబాబు

పై నుంచి వరద..

ఎన్టీఆర్ జిల్లాలో బుడమేరుతో పాటు ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి వాగుల నుంచి వరద వస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి 8.90 లక్షల క్యూసెక్కుల నీరు రానుంది. సోమవారానికి 10లక్షలకుపైగా క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉంది. 10-12 లక్షల క్యూసెక్కుల వరద వస్తే తక్షణం ఎలా స్పందించాలన్నదానిపై దృష్టి పెట్టాం. బ్యారేజీ దిగువ ప్రాంతాల గ్రామాలు ముంపు బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేశాం. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

బుడమేరు బాధితులకు అండగా ఉంటా!

విజయవాడ: 'బుడమేరు వరద ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు బాధితుల చెంతనే బస చేస్తా. వరద పరిస్థితిపై గంట గంటకు సమీక్షిస్తా' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలోని బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలని ఆదేశించారు. చంద్రబాబు ఆదివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

దెంగీతో ఇద్దరు యువకుల మృతి

కామారెడ్డి టౌన్, మల్లాపూర్, సెప్టెంబరు 1 : డెంగీతో కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఓ యువకుడు, జగిత్యాల జిల్లాలో మరో యువకుడు ఆదివారం మృతి చెందారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ గ్రామానికి చెందిన సుజిత్(16) అనే యువకుడు డెంగీతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పది రోజుల క్రితం తీవ్ర జ్వరానికి గురైన సుజిత్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో మైలారపు సందీప్(24) డెంగీతో మృతి చెందాడు. చిట్టాపూర్ గ్రామానికి చెందిన సందీప్ వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

- రంగారెడ్డి జిల్లా లింగారెడ్డిగూడలో ఘటన



యాదయ్య(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొలంలో విద్యుదాఘాతానికి గురై ఓ రైతు చనిపోయాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రైతు వట్టెల యాదయ్య(47) శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తూ తోటి రైతు పొలం వద్ద పాలు తీసుకురావడానికి వెళ్లాడు. పాలు పోసుకునేందుకు అక్కడ ఉన్న గదిలో డబ్బా వెతుకుతుండగా వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

పీఆర్‌టీయూ కార్యదర్శిగా గుండు లక్ష్మణ్

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నాడు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రత్యేకంగా సమావేశమై ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రస్తుతం లక్ష్మణ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. అక్టోబరు 7న రాష్ట్ర శాఖకు ఎన్నికలు జరుగుతాయని, అప్పటి వరకు లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారని పీఆర్‌టీయూ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

హింసకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి

- పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభల్లో ప్రొఫెసర్ శాంతా సిన్హా

రాంనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తమపై జరుగుతున్న దారుణాలు, హింసపై మహిళలు గొంతు విప్పాలని, పోరాటాలు చేయాలని పీవోడబ్ల్యూ ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు ప్రొఫెసర్ శాంతాసిన్హా పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర మహాసభలు జరిగాయి. మహిళలు గౌరవంగా జీవించే పరిస్థితులు క్షీణించాయని, పాలకులు మహిళలను పట్టించుకునే స్థితిలో లేరని ప్రొఫెసర్ రమా మేల్కొటే అన్నారు. అంతకుముందు పీవోడబ్ల్యూ జెండాను రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవిష్కరించారు.

హైడ్రా పనులు భేష్.. రేవంత్‌కు మా మద్దతు

- ఎక్స్ వేదికగా అభినందించిన నాగబాబు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): "వర్షాలు పడి తూములు తెగిపోయి.. చెరువులు నాలాలు ఉప్పొంగి అపార్ట్‌మెంట్లలోకి నీళ్లు రావడం.. సామాన్యుల ప్రాణాలు కూడా బలికావడం బాధాకరం. వీటికి ముఖ్య కారణం చెరువుల్ని, నాలాలను అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేయడమే. ఇప్పటికైనా అర్థమైందా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన హైడ్రా కాన్సెప్ట్. ఇందుకు సీఎంను అభినందించాలి" అని సినీ నటుడు, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

వరదలను అదుపు చేయడంలో సర్కారు విఫలం

- ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరదల పరిస్థితిని అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఖమ్మంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఖమ్మంలోని త్రీటౌన్ వీధుల్లో నిరసనకు దిగారని, వరదల సమయంలో కనీస సాయం కోసం ప్రజలు ఆందోళన చేయడం ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా.. అక్కడి ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయిందన్నారు. మరోవైపు.. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అండగాఉండాలని, సాయం అందించాలని కేటీఆర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీజేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి

సీఎం రేవంత్‌కు డీజేహెచ్‌ఎస్ కృతజ్ఞతలు

- ఇళ్ల స్థలాలపై ప్రకటన చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్/పంజాగుట్ట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇంటి స్థలాలను అందించే విషయంలో సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) కృతజ్ఞతలు తెలిపింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జేఎన్‌జే సొసైటీకి సంబంధించిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించిన నేపథ్యంలో.. తమ సొసైటీలోని సభ్యులకు ఇంటి స్థలాలను అందించే అంశంపై ప్రకటన చేయాలని కోరింది. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం చేసింది. అధ్యక్షుడు బొల్లోజు రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారులో జర్నలిస్టులకు ఇంటి స్థలాల సమస్య పరిష్కారమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి అయ్యప్ప, డైరెక్టర్లు రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అరుదైన వ్యాధుల జాబితాలో

8వ స్థానంలో తెలంగాణ

- దేశవ్యాప్తంగా 13,479 కేసులు
- మన రాష్ట్రంలో 661 గుర్తింపు.. వివరాలు వెల్లడించిన కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో అరుదైన వ్యాధులున్న టాప్ టెన్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ (8వ స్థానం) కూడా ఉంది. ఈ వ్యాధులతో బాధపడుతున్న వారు దేశవ్యాప్తంగా 13,479 మంది ఉండగా.. తెలంగాణలో 661 మంది ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ వివరాలను ఇటీవలే కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పార్లమెంటుకు నివేదించింది. మొదటి స్థానంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 1,976 మంది, మహారాష్ట్రలో 1,387, కర్ణాటకలో 1,275, తమిళనాడులో 1,201, అసోంలో 898, ఢిల్లీలో 879, ఆంధ్రప్రదేశ్‌లో 684, తెలంగాణలో 661, పశ్చిమ బెంగాల్‌లో 642, బిహార్‌లో 608 మంది ఉన్నారు. మొత్తం కేసుల్లో 75 శాతం (10,211 మంది) ఈ పది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. టాప్ టెన్‌లో 4దక్షిణాది రాష్ట్రాలు ఉండగా.. అక్కడ 28 శాతం కేసులు ఉన్నాయి. కాగా, 63 రకాల వ్యాధులను అరుదైనవి కేంద్రం గుర్తించింది. చికిత్స అందించేందుకు 12 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపింది. అందులో తెలంగాణలోని నిమ్స్ కూడా ఉంది. ఈ వ్యాధులను గుర్తించడం ఎంతో కష్టతరం. దీనికి అమెరికాలో సగటున 7.6, బ్రిటన్‌లో ఐదున్నరేళ్ల సమయం పడుతోందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కనీసం 8 మంది ఫిజీషియన్లు చూసి, పలు రకాల పరీక్షలు జరిపిన తర్వాత కానీ గుర్తించలేకపోతున్నారు. రోగ నిరోధక శక్తి లోపాలు, గౌచర్స్ వ్యాధి, మ్యూకోపాలిసాకరిడోసెస్, పాంపే, ఫాబ్రీ, మాపుల్ సిరప్ యూరిన్ వ్యాధులు, ఆర్గానిక్ అసిడెమియాస్, సిస్టిక్ ఫైబ్రోసిస్, ఆస్టియోజెనిసిస్, కొన్ని రకాల కండరాల క్షీణత లాంటివి అరుదైన వ్యాధుల జాబితాలో ఉన్నాయి. కాగా, అరుదైన వ్యాధులతో బాధపడుతున్నవారి చికిత్సకు రూ.50 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. 2021 వరకు ఇది రూ.20 లక్షల వరకే ఉండగా దాన్ని రూ.50 లక్షలకు పెంచామని కేంద్రం పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.24.20 కోట్లు, గత నాలుగేళ్లలో రూ.136.34 కోట్లు కేటాయించామని తెలిపింది.

కాదంబరి బ్యాంకు ఖాతాలు అన్‌ఫ్రీజ్!

- తమ ఖాతాలు వాడుకునే వెసులుబాటు ఇవ్వాలన్న నటి
- ఆ మేరకు బ్యాంకులకు లేఖ ఇవ్వనున్న పోలీసులు

విజయవాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడ పోలీసుల వేధింపులకు గురైన ముంబై నటి కాదంబరి జెత్వానీకి స్వల్ప ఊరట లభించనుంది. పోలీసులు ఫ్రీజ్ చేసిన ఆమె బ్యాంకు ఖాతాల వినియోగానికి అనుమతిచ్చే అవకాశం కనిపిస్తోంది. అప్పట్లో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో భాగంగా ఆమెకు ముంబైలో ఉన్న 18 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ ఖాతాల్లో రూ.80 లక్షల వరకూ ఉన్నట్లు కాదంబరి చెబుతున్న విషయం తెలిసిందే. ఆమెను అరెస్టు చేసిన అప్పటి పోలీసులు ఈ ఖాతాల నుంచి ఎలాంటి లావాదేవీలూ జరుగనివ్వకుండా నిలుపుదల చేశారు. వీటికి సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లను ఇప్పటికే పోలీసులు సేకరించి కోర్టుకు అందజేశారు. రెండు రోజులపాటు కాదంబరి జెత్వానీతోపాటు ఆమె తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలం నమోదు చేసిన విచారణాధికారి స్రవంతి రాయ్... ఆ బ్యాంకు స్టేట్‌మెంట్లను వారికి చూపించారు. ఇవన్నీ తమ ఖాతాలకు చెందిన స్టేట్‌మెంట్లేనని వారు నిర్ధారించారు. ఈ ఖాతాల్లో లావాదేవీలు చేసుకునేందుకు వాటిని అన్‌ఫ్రీజ్ చేయాలని వారు పోలీసులను కోరారు. ఫ్రీజ్ చేసిన ఖాతాలను బ్యాంకర్లు అన్‌ఫ్రీజ్ చేయాలంటే పోలీసులు అధికారికంగా లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. రెండు, మూడు రోజుల్లో పోలీసు కమిషనర్ ఈ లేఖను ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

సైన్యం, హెలికాప్టర్లను అందుబాటులోకి తేవాలి

- మాజీ మంత్రి హరీశ్ రావు

దేవరకొండ/హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నుంచి ప్రజలను కాపాడేందుకు అప్రమత్తంగా ఉండాలని, సైన్యాన్ని, హెలికాప్టర్లను అందుబాటులోకి తేవాలని మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్నందున అత్యవసర సేవలు అందించేందుకు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, కాల్వలు తెగకుండా నీటి పారుదల శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న బాధితులకు బీఆర్‌ఎస్ శ్రేణులు సహాయక చర్యలు అందించాలని పిలుపునిచ్చారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు సెలవులు రద్దు చేసి 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లకు నిధులు కేటాయించి సహాయక చర్యలు చేపట్టాలని విన్నవించారు. అలాగే ఇలాంటి ఆపత్కాలంలో ఒకరికొకరు భాసటగా నిలవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముగ్గురు పిల్లలకు విషమిచ్చి..

ఉరేసుకున్న తల్లి

(మొదటి పేజీ తరువాయి)




సువర్ణ, ఆంజనేయులు, పిల్లలు(ఫైల్)

చేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో ఆదివారం ఈ దారుణం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు బతుకుదెరువు కోసం 2017 నుంచి రుద్రారం గ్రామంలో ఉంటూ ఇస్నాపూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసైన ఆంజనేయులు ఆరోగ్యం క్షీణించి ఇటీవల కిడ్నీలు పాడయ్యాయి. దీంతో హైదరాబాద్‌లోని ఓ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. భర్త ఆరోగ్యం క్షీణించటం కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా తీవ్ర మనస్తాపానికి గురైన ఆంజనేయులు భార్య సువర్ణ(28) తన ముగ్గురు పిల్లలతో ఆదివారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది. ముందుగా పెద్ద కుమారుడు జశ్వంత్(5), కవలలు చిన్మయి(3), చిత్ర(3)లకు విషం ఇచ్చింది. అనంతరం సువర్ణ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఉదయం నుంచి ఇంటి తలుపులు తెరవకపోవడంతో సమీపంలోనే ఉన్న దూరపు బంధువులు కిటికీ అద్దాలు పగలగొట్టి చూడగా ముగ్గురు పిల్లలు చనిపోయి ఉండటం గమనించారు. చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగలగొట్టి.. లోనికి వెళ్లగా సువర్ణ ఉరేసుకుని కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సువర్ణ చనిపోయే ముందు సూసైడ్ నోట్ రాసిందని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతో ఆమె చనిపోయిందని ప్రాథమికంగా తేలిందని చెప్పారు.

హిడెన్ కెమెరాల నాటకం నీలి మీడియా పనే

- ప్రజల దృష్టి మళ్లించేందుకే డ్రామా
- గుడ్లవల్లేరు ఘటనపై మంత్రి లోకేశ్



మంగళగిరి సిటీ, సెప్టెంబరు 1: సినీనటిపై వైసీపీ నేతల వేధింపులు, మద్యం కుంభకోణం, భూ అక్రమాలు వరుసగా బయట పడుతుండడంతో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిడెన్ కెమెరాల నాటకానికి తెరలేపారని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థినీల బాత్రూముల్లో కెమెరాలు ఉన్నట్టు ఎలాంటి ఆధారాలూ లభించలేదన్నారు. హిడెన్ కెమెరాల ఆరోపణలు కేవలం నీలి మీడియా సృష్టేనని తెలిపారు. విద్యా శాఖ మంత్రిగా రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులంతా తన సొంత బిడ్డల్లాంటి వారని, వారిని క్షేమంగా చూసుకునే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. గుడ్లవల్లేరులో నలుగురు విద్యార్థుల మధ్య జరిగిన వ్యక్తిగత అంశం ఈ గొడవకు కారణమైందని, సంబంధిత విద్యార్థిని డీటెయిన్ చేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆహారం కలుషితమైందని తెలిసిన వెంటనే డైరెక్టర్‌ను విధుల నుంచి తొలగించామని, పర్యవేక్షక కమిటీని కూడా నియమించామని లోకేశ్ చెప్పారు. జగన్ మాదిరిగా తాను తల్లినీ, చెల్లినీ రోడ్లపైకి గెంటేసే రకం కాదని, విద్యార్థినులను సొంత తోబుట్టువులుగా భావించి కంటికి రెప్పలా కాపాడతానని లోకేశ్ అన్నారు. నాడు-నేడు పేరుతో జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేసినట్టు తప్పుడు లెక్కలు చెబుతోందని, అదే నిజమైతే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో గత ఐదేళ్లలో పది లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, రంగులు వేసి రూ. వందల కోట్లు దిగమింగారని ఆరోపించారు. విద్యార్థులకు సరఫరా చేసే గుడ్లు, చిక్కీలు, ఆయాల జీతాలు కూడా బకాయి పెట్టి వెళ్లారని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా తాము విడుదల చేస్తున్నామని చెప్పారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
A Government of India Undertaking
Support Services Department, Pattabhi Bhavan, CO Annexe- Hyderabad.
Telephone no: 040-23252439/2444 email: gad@unionbankofindia.bank

టెండర్ నోటీసు

Tender Ref No. SSD/ANNEX-HYD/14/2024
సికింద్రాబాద్‌లోని ఎస్‌డి రోడ్డు భవనంలో - ఇంటీరియర్స్ పునరుద్ధరణ పనుల ఆర్కిటెక్ట్ / కన్సల్టెంట్ ఎంపిక కొరకు.
(అంచనా వ్యయం- రూ. 110.00 లక్షలు)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సికింద్రాబాద్‌లోని ఎస్‌డి రోడ్ బిల్డింగ్‌లో ప్రతిపాదిత పనుల కోసం స్థాపించబడిన ఆర్కిటెక్ట్/కన్సల్టెంట్ ల నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రెండు బిడ్ల విధానంలో) సీల్డ్ బిడ్ లను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ఫారాలు **www.unionbankofindia.co.in** మరియు **www.eprocure.gov.in** వెబ్ సైట్ లలో అందుబాటులో ఉన్నాయి. టెండర్ సమర్పణకు చివరి తేదీ **23.09.2024 మధ్యాహ్నం 3.00 గంటల** వరకు. ఎలాంటి కారణాలను పేర్కొనకుండానే ఏదైనా లేదా అన్ని దరఖాస్తు లను తిరస్కరించే హక్కు బ్యాంకుకు ఉంటుంది.
02.09.2024 చీఫ్ మేనేజర్

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

14 మరియు 22 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ₹ **2,500 కోట్ల (ముఖ విలువ)** మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ఆఫర్ చేసింది.

మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం, భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ **(E-Kuber)** మీద **03 సెప్టెంబర్ 2024 (మంగళవారం)**న నిర్వహించబడుతుంది. పోటీ లేని స్కీమ్ ప్రకారం రిటైల్ డైరెక్ట్ పోర్టల్ **(https://rbiretaildirect.org.in)** ద్వారా కూడా వ్యక్తిగత ఇన్వెస్టర్‌లు బిడ్‌లు దాఖలు చేయవచ్చు.

మరింత సమాచారం కొరకు **30 ఆగస్టు 2024 (శుక్రవారం)** తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ **(www.rbi.org.in)**ను చూడండి.

"మీకు డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఈ-మెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



చలం తన గురువు రఘుపతి వెంకటరత్నం నాయుడి గారి గురించి రాసిన నివాళి ఇది. 1962లో వెంకటరత్నం నాయుడి గారిపై విడుదలైన సూవెనీర్‌లో మొదటిసారి వచ్చిన ఈ వ్యాసం ఆ తర్వాత ఎక్కడా మరలా రాలేదు, చలం సాహిత్య సంపుటాల్లో కూడా భాగం కాలేదు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇప్పుడు దీన్ని ప్రచురిస్తున్నాం.

గురువర్యుడు

– చలం

మంగళూరు నుంచి వొచ్చిన రామారావు గారు అన్నారు, "మద్రాసులో నేను చదువుకునేప్పుడు, కాకినాడ కాలేజీ ప్రిన్సిపాలు వెంకటరత్నం గారిని నేనే చూడలేదు. కాని ఆయన శిష్యుల్లో ప్రతివారిలో ఆయన్ని చూస్తున్నాను. నాలుగు నిమిషాల్లో తెలుస్తుంది ఇతడు వెంకటరత్నంగారి శిష్యుడని."

అంతకన్న గొప్ప పొగడ్త అధ్యాపకుడికి ఎక్కడా వుండదు. సమాజంపైన తమ ప్రభావాన్ని ముద్రించి పోయేవారు రెండు విధాలైనవాళ్ళు. చాలామంది తాము చేసిన రాజకీయ, సాంఘిక, కళా రంగాలలో తాము తెచ్చిన మార్పుల వల్లా, పనుల వల్లా, విప్లవం వల్లా, నూతన శకారంభకులై చిరస్మరణీయులవుతారు. రెండో తరగతివారు ప్రత్యేక వ్యక్తుల స్వభావాలపై ఉద్దేశ్య పూర్వకంగా గానీ, రహితంగా గానీ, తాము తెచ్చిన ఔన్నత్యం వల్ల జ్ఞాపకముంటారు. ఈ రెండు విధాల ప్రతిభలు కలిసివుండే గాంధీగారి వంటి మహాత్ములు అరుదుగా జన్మిస్తారు.

ఓ పాతికేళ్ళు తెలుగుదేశం అమితంగా ద్వేషించినవారు – సంఘ పారిశుద్ధ్యంకి పోరాడిన వీరేశలింగంగారూ, వెంకటరత్నంగారూ. వీరేశలింగంగారెంత కర్మవీరుడో నాయుడుగారంత నిష్కర్మవీరుడు. విద్యార్థులూ, ప్రజలూ వీరేశలింగం గారి ఉద్యమాన్నీ, సాహసాన్నీ, చూసి ఆయన్ని అనుకరించారు. విద్యార్థులూ, ప్రజలూ ముందు వెంకటరత్నం నాయుడుగార్ని చూసి ప్రేమించి, తరువాత ఆయన ఉద్యమంలో విశ్వసించేవారు. మనసులో నిష్కారణ ద్వేషాలూ, వైషమ్యాలూ భయాలూ పూని, అహంకారపూరితులైన వారికి తప్ప తక్కినవారికి నాయుడుగారి ఆత్మమాధుర్యాన్నించి తప్పుకోవడం దుర్ఘటమయ్యేది.

To meet him was to be impressed with him and to be impressed was to adore him.

ఏ అరమరికలూ లేకుండా లేత హృదయాన్ని ఆయన పాదాక్రాంతం చేసి ఆరాధించి ప్రేమించినవారిలో నేనొకణ్ణి.

అయన మూలాన (ఆయన నాతో ఏమీ ఆ విధంగా ప్రస్తావించకుండానే) చదువూ, పెళ్ళీ, ఉద్యోగం, పిల్లలూ, అనే ఆత్మవినాశకరమైన గాడి నించి నా జీవితం పూర్తిగా పట్టాలు తప్పింది. అవన్నీ జరగలేదని కాదు. కాని వాటిలో వొక్కటీ నన్ను బంధించి వుంచలేకపోయింది. వాటికన్న భిన్నమైన విలువలకి నా కళ్ళు తెరుచుకున్నాయి, నాయుడుగారి సామీప్యం వల్ల. సజీవమైన ఈశ్వరునిలో సజీవమైన విశ్వాసమంటే ఏమిటో నాకు మొదట నేర్పింది నాయుడుగారు. భగవాన్ రమణని దర్శించిన నిమిషాన ఆయన నాకు ఆధ్యాత్మిక గురువని నాకు తెలీకుండానే గుర్తించ గలిగానంటే దాంట్లో చిన్నతనపు ఆరాధనా ప్రభావం తప్పకుండా వుంది. నా జీవితంలో సత్యదీక్ష, సాహసం, ప్రజల అభిప్రాయాల పట్ల నిర్లక్ష్యతా, నమ్మినదాని కోసం కష్టాలకీ అపవాదులకీ జంకక నిలబడడం, దుమ్ము నించీ, డబ్బు నించీ ఎత్తయిన దృష్టీ ఇవన్నీ నాలో కలిగినా, అవి నాయుడుగారు నాకు ప్రసాదించిన వరాలు. నాలో ఒక అంతరాత్మ వుందని తెలుసుకున్నాను ఆయన దయ వల్ల.

జీవితంలో ఆత్మవికాసం పొందినవారు తక్కినవారి మల్లేనే జీవిస్తారు. చరిస్తారు. కాని –

చూడ చూడ వారి
రుచుల జాడ వేరు.

నాయుడుగారు టెన్నిసన్, మిల్టన్, షేక్స్‌పియర్ పాఠాలు చెపుతూ వుంటే ప్రసిద్ధికెక్కిన తక్కిన లెక్చరర్ల కన్న అధికృత ప్రత్యేకంగా కనపడకపోతే పోవొచ్చు. కాని ఆయన మాట్లాడే విధం, ఆయన చూపు, గంభీరమైన కంఠధ్వని, కొన్ని పాయింట్స్ మీద ఆయన ఇచ్చే స్ట్రెసెస్, అందానికి ముఖ్యం, నీతిలోని, భక్తిలోని అందాలకి ఆయన యిచ్చే ప్రాధాన్యం, ఇవన్నీ మా అంతరాంతరాల్లో తెలీకండా మార్పును తెచ్చి, జీవితానికే కొత్త విలువల్ని చూపి మా దృష్టిని మార్చేవి. నాయుడుగారు ఆనాడు యిచ్చిన sermons ఈనాడు అచ్చులో చదివితే ఆ మాటల్లో ఏ విశేషమూ కనపడదు. కాని ఆ మాటల్నే ఆయన పెదవుల నించి విన్న రోజుల్లో అవి ఎంతగా మమ్మల్ని ఉజ్వలపరిచేవో యెట్లా తెలుస్తుంది? గొప్ప పర్సనాలిటీ లక్షణమే అది. నొబిలిటీ, హృదయవైశాల్యమూ, ప్రతివారినీ ప్రేమాలింగనంలోకి తీసుకునే లోతూ, కలుషానీ, లోపాన్ని, దీనత్వాన్నీ, నిస్సహాయత్వాన్నీ అర్థం చేసుకుని ఆదరించే ఆర్ద్రత్వమూ, ఒకరిలో కలిగాయంటే అవి ఏవో పుటక వల్లనో, యాక్సిడెంట్ వల్లనో, ఓ ట్రిక్ వల్లనో, డెలిబరేట్ విల్ వల్లనో కలిగేవి కావు. ధనానికీ పదవులకీ ఆశించకపోవడం, కీర్తి సుఖాలకై దేవులాడకపోవడం, అధికారధూర్తుల ముందు తల వంచకపోవడం, కీర్తి అపకీర్తులకి లక్ష్యం లేకపోవడం, ముందు కాలంలో తన గతి ఏం కాబోతోంది అనే యోచన లేకపోవడం, ఇలాంటి గుణాలు తలుచుకున్నంత మాత్రాన ఒక్క రోజులో తెచ్చుకునేవి కావు. నితంతరనిర్నిద్ర, ఇంద్రియ నిగ్రహం, శమదమ నియమ తీవ్ర కృషి ఫలితంగా ఈశ్వరానుగ్రహం తోడుకావడం చేత పరిణమించే వరాలవి. సైనిక విజయాన్ని సాధించడం, దుర్గమ పర్వతాల నెక్కడం, ధ్రువాల అంతు కనుక్కోడం, ఇవన్నీ గొప్ప సాహసకృత్యాలే. కాని ఎవరి కంటికీ తెలియకుండా దినదినమూ నిమిష నిమిషమూ, తమ అహాన్ని కోసుకుని నిత్యాగ్నిహోత్రంలో ఆహుతి చేసుకునే ఈ మహాయోగుల తీవ్ర త్యాగం ఎవరూ ఎరగనిది. పర్యవసానం వారి ముఖాల వర్చస్సులో వారి పెదవులమీది కరుణలో, ప్రేమాశ్రువులు చిందే వారి నేత్రాలలో గోచరమౌతుంది. వారి చుట్టూ ఓ నిర్మల తేజోవంతమైన 'ఆరా' వెలుగుతో వుంటుంది. అదే ఉత్తములకి ప్రేమాస్పదమైనదీ, దుష్టులకీ, కుచ్ఛితులకీ ద్వేష కారణమౌతుంది. ఈ భూత ప్రేత పిశాచ రాబందు గణాలకింక శాంతి వుండదు. మాటలో, అచ్చులో, పనులలో ఆ జ్యోతి నార్పిందాకా. ఈ ఉదాత్తులు బ్రతికివున్నంత కాలమూ వారిపైన అసహ్యమైన అపవాదులు రేగుతూనే వుంటాయి. వారు చచ్చిపోయ్యాక ఒక నిట్టూర్పు విడిచి వారిని మరచిపోయి సుఖంగా నిద్రిస్తుంది లోకం. వారు చేసే సంస్కారమంతా వారి స్వభావంలోనే కాని బైట మెటీరియల్‌గా కనబడకపోవడం చాత వారిని జ్ఞాపకం చేసేందుకు ఏదీ మిగలదు. మిగిలేదల్లా వారిని ప్రేమించి అనుసరించిన శిష్యుల లోని శాశ్వత పరివర్తన. ఆ విధంగా ఈ నాటికీ జీవించివున్నారు, రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు.



మొదట విద్యార్థిగా, తరువాత కాలేజీ ట్యూటరుగా నాయుడుగారితో సన్నిహితత్వం నాకు అయిదేళ్ళపాటు లభించింది. అంతే కాదు, బ్రహ్మసమాజానికి ఆయన అధ్యక్షుడూ, నేను (అ)కార్యదర్శినీ. ఈ బైట సంబంధం కాక మా ఇద్దరి మధ్య అంతరంగికమైన గురుశిష్య సంబంధం వుండనే వుంది.

నేను విద్యార్థిగా చేరేటప్పటికే నాయుడుగారు మనుష్యుల నుంచి దూరమౌతున్నారు. ఆయన హృదయం అతి మార్దవం కాబట్టే ఆయన ప్రేమించిన వారి నించి గాయాలూ, డిసప్పాయింట్‌మెంట్ సహించలేక ఆయన క్రమంగా ఓ షెల్ లోకి వెళ్ళారనిపిస్తుంది. త్వరలోనే నా ప్రవర్తన వల్ల, నాలో రేగుతున్న నైతిక సందేహాల వల్ల, సంఘంపై తిరగబాటు ప్రోద్బలం వల్ల నేను అన్నేళ్ళు నా కాలాన్నంతా అర్పించిన బ్రహ్మసమాజం నుంచి దూరం కావడంతో నాయుడు గారి నుంచీ దూరమైనాను. ఆయన తన ప్రాణమంతటి లోనూ విశ్వసించి బోధించిన నీతి నిర్మలత్వాల అనుష్ఠానంపైనే, దాంపత్య సంబంధంలోని పవిత్రతమీదే నాకు సందేహాలు రేగాయి. వాటికి నాలోని బలహీనాలూ బలాలూ తోడ్పడ్డాయి. నా గురువుని చాలా లోతుగా గాయం చేసాను. మా యిద్దరి మధ్యా అనుల్లంఘనీయ అఘాతం ఏర్పడింది. నాయుడుగారి ప్రేమను పోగొట్టుకున్నందుకు నేనెంతో బాధ పడ్డాను. నాకు ఆయన ప్రేమ లేకుండాపోయింది అనేదానికన్న నా తిరగబాటువల్ల ఆయనెంత బాధపడ్డారో అని నాకు ఎంతో తపన కలిగేది. నేనెరుగుదును ఆయన నన్ను ప్రేమించారనీ, ఆయన వెలుగును నిలుపుకుని ప్రచారం చేయగల శిష్యుల్లో నేనొకడనని ఆయన ఆశించారనీ. కాని తిరిగి ఆయనను సమీపించడం వల్ల ప్రయోజనం లేదనీ, నా నూతన దృక్పథాన్ని ఆయనకి విశదీకరించి, నా సిన్సియారిటీలో ఆయనకి నమ్మకం కలిగించగలననే ఆశ పోయింది నాకు.

ఓసారి నాయుడుగారన్నారు "ఏ పబ్లిసిటీ లేకుండా నేనొకసారి కలకత్తా వెళ్ళి శివనాథ శాస్త్రి గారి ముందు 'వీడు రఘుపతి వెంకటరత్నం' అని చెప్పి నమస్కరించి వొచ్చెయ్యగలిగితే బావుండుననిపిస్తుంది" నాకు.

నాయుడుగారి చివరి కాలంలో ఆయన చూపు బలం తగ్గి నన్ను చూడడం వల్ల ఆయనకి బాధ కలగదు గనక ఆయన ముందు చేతులు జోడించి నిలబడి "నేను వెంకటాచలాన్ని, నా సిన్సియర్ కన్విక్షన్స్ వల్ల నేను మీ నుంచి యెంత దూరమైనా, నా ఆరాధన మిమ్మల్ని వీడదు. నేను చీకట్లో ఐతే, నేను కాంతిని చూడాలని ఆశీర్వదించండి" అని అడగాలన్పించేది.

కాని మనసులో ఆ కల్పనా దృశ్యాన్ని భావించుకున్నంత మాత్రాన నా ఎమోషన్స్ నన్ను వుక్కిరిబిక్కిరి చేసేవి. తీరా వెళ్ళి చూస్తే ఏం ప్రయోజనం వుండదనే నా భయం వల్ల అది జరగలేదనే చింత ఏనాటికీ నన్ను విడువదు.

(సేకరణ బి.ఆర్. బాపూజీ)

నాయుడుగారి చివరి కాలంలో ఆయన చూపు బలం తగ్గి నన్ను చూడడం వల్ల ఆయనకి బాధ కలగదు గనక ఆయన ముందు చేతులు జోడించి నిలబడి "నేను వెంకటాచలాన్ని, నా సిన్సియర్ కన్విక్షన్స్ వల్ల నేను మీ నుంచి యెంత దూరమైనా, నా ఆరాధన మిమ్మల్ని వీడదు. నేను చీకట్లో ఐతే, నేను కాంతిని చూడాలని ఆశీర్వదించండి" అని అడగాలన్పించేది.

'పంపాతీరం' నవల

ఓల్గా రాసిన 'పంపాతీరం' పుస్తకం పరిచయ సభ సెప్టెంబర్ 8 ఉదయం 10 గంటలకు కరీంనగర్ లోని ఫిలిం భవన్‌లో తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో జరగనుంది. సి.వి. కుమార్ అధ్యక్షతన జరిగే సభలో నలిమెల భాస్కర్, ఓల్గా, బి.వి.ఎన్. స్వామి, పుప్పాల శ్రీరామ్, కందుకూరి అంజయ్య, గాజోజు నాగ భూషణం, తోట నిర్మల రాణి, దామరకుంట శంకరయ్య తదితరులు పాల్గొంటారు.

తెరవే, కరీంనగర్

చిల్లర భావనారాయణరావు శతజయంతి

చిల్లర భావ నారాయణ రావు శత జయంతి ప్రారంభోత్సవ సభ సెప్టెంబర్ 8 ఉదయం 10.30 గంటలకు భారతీయ విద్యాభవన్, 18, 20 & 22 మూడవ వీధి, మైలాపూర్, చెన్నైలో జరుగుతుంది. సభలో కిడాంబి లక్ష్మీకాంత్, చిల్లర భవానీదేవి, కమలాకర ఆనంద శివరామ్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 98844 46208.

తూమాటి సంజీవరావు

కవి సంధ్య స్వర్ణోత్సవ సంచిక

సెప్టెంబర్ 14 ఉదయం 10గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో 'కవి సంధ్య' 50వ సంచిక ఆవిష్కరణ సభ జరుగుతుంది. శివారెడ్డి, రమణాచారి, కె. శ్రీనివాస్, వాడ్రేవు చినవీరభద్రుడు, మామిడి హరికృష్ణ, దాట్ల దేవదానం రాజు, ఏనుగు నరసింహా రెడ్డి, కోయి కోటేశ్వరరావు, గూటం స్వామి పాల్గొంటారు. ఇదే సభలో నాగరాజు రామస్వామి 'కవన కోకిలలు' పుస్తకం ఆవిష్కరణ ఉంటుంది.

శిఖామణి

సముద్రమ్మపై ప్రత్యేక సంచిక


తొలితరం దళిత మహాసభ ఉద్యమంలో పాల్గొన్న బహుజన సాంస్కృతిక యోధురాలు, గాయకురాలు ఆతవ సముద్రమ్మపై ప్రత్యేక సంచిక తీసుకొస్తున్నాం. ఆమెపై మీ వ్యాసాలను, కవితలను సెప్టెంబరు 10లోగా యూనీకోడ్ ఫాంట్‌లో గానీ డీటీపీ చేసిన ఓపెన్ ఫైలు గానీ పంపగలరు. వివరాలకు: 96766 09234.

తంగిరాల సోని

ఉదారి నాగదాసు కవితా అవార్డు

ఉదారి నాగదాసు స్మారక కవితా అవార్డును ఈ ఏడాది బెల్లి యాదయ్య స్వీకరిస్తారు. ఈ అవార్డు ప్రదానం సెప్టెంబర్ 15న ఆదిలాబాద్‌లో జరుగుతుంది. అవార్డు కింద రూ.5వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇస్తారు. వివరాలకు: 94414 13666.

ఉదారి నారాయణ



ఏనుగమ్మో ఏనుగు!

అటునుంచి మనవడు
ఇటునుంచి నేను
గట్టిగా కావలించుకున్నాం ఏనుగుని

వాడి కేరింతల్ని అది చెవులాడిస్తూ వింది
ఒక్కసారి తల విదిలించి ఘీంకరించింది
చక్కెర రెక్కల ఏనుగుతోసహా మేం మాయం

వంటిమీద చక్కెర చల్లుకున్న హిమ పర్వతాల్లోకి
పాలధారల పంచధారల జలపాతాల మధ్యకి
తేనె రశ్మి కురిసే లోయల్లోకి
సీతాకోకలు ఉన్మత్తంగా తిరిగే వనాల్లోకి
పూలగానాల మాధుర్యాలమై
తెల్లమబ్బులు తేలే
నిశ్చల సరస్సుల మధుపాత్రల్లోకి
సూరీడు ఆరేసిన బంగారు రంగు
ఉల్లిపొర వస్త్రాల కెరటాల్లోకి

నేనూ.. ఏనుగూ.. మనవడూ
తీయని కాలం అరమోడ్పు రెప్పల మాటున
ఆకాశాల్లోకి... ఉన్మత్త కాంతి సంవత్సరాల్లోకి

గ్రహాల మధ్య శూన్యంలో
మహాజనని విరబోసుకున్న
ధూళికేశాలు దులిపినపుడు
విశ్వగర్భంలో ఆకృతులు దాలుస్తున్న
సృష్టి రహస్యాల్లోకి నేనూ మనవడూ
చక్కెర రెక్కల ఏనుగునెక్కి

పరిభ్రమించే మహాగోళాల చుట్టూ తిరుగుతూ
స్వప్నగోళాల నారింజపళ్ల తొనలు వలుస్తూ
మెలకువల అంచులు దాటి
ఆకలి తెలియని గ్రహాంతరాల సంచరిస్తూండగా

మెరుపుల్ని దాటుకుని
ఉరుముల్ని చీల్చుకుని
నల్లమబ్బులకు ఆవలి నుండి
వాయు సముద్రం అలల
తెలతెల్లని మబ్బు నురుగులు దాటుకుని
ఏడురంగుల పొరల్లోంచి దూసుకుని
విన్పిస్తుంది కన్నా అనే పిలుపు
చేతిలో బువ్వతో పాలిండ్ల అమృతంతో
పెదవుల మీద తేనె చిరుహాసంతో
ఎదురుచూసే తల్లి నుండి
విన్పిస్తుంది నిశ్శబ్దంగా ఒరే కన్నా అనే పిలుపు

అంతే... వచ్చేస్తాం.. ముగ్గురం
బొమ్మలోకి ఏనుగు
నేను తాత లోకి
మనవడు అమ్మచంక లోకి

ముగ్గురం అమ్మ ఒడిలోంచి అమ్మ ఒడిలోకి
అమ్మ ఒడిలో అటునుంచి ఇటువైపుకి

■ వసీరా

✆ 91777 27076



పాపులర్ నవల పునర్జన్మ?

వివిధలో 'మూడు ప్రశ్నలు' అనే శీర్షికలో రైటర్, పబ్లిషర్ మల్లికార్జున్ ఇంటర్వ్యూ చదివాక (19 ఆగస్ట్ 2024), వారు తమ అజు పబ్లికేషన్స్ తరఫున వేసిన ఒక పుస్తకాన్ని ముప్పై మూడు వేల కాపీలు అమ్మారని తెలిసాక, కుతూహలంతో ఆ పుస్తకాన్ని కొని చదివాను. 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' కవితాత్మక శైలిలో ఒక నాటకీయమైన కథని కళ్ళ ముందు జరుగుతున్నట్టు చెప్పే నవల. ఈనాటి కాలం లోంచి ఒకనాటి ప్రేమల్ని చూపిస్తుంది. అలా తరాల్ని దాటి చెప్పటం కూడా ఈ నవల అప్పీల్‌ని పెంచింది కావొచ్చు. ఈ నవల చదివితే ఒకప్పటి మాదిరెడ్డి సులోచన, కొమ్మనాపల్లి గణపతిరావు వంటి రచయితల శైలి గుర్తుకు వచ్చింది. వీరిని అప్పట్లో పాపులర్ రచయితలు అని పిలిచేవారు.

పాపులర్ రచయితలు తెలుగులో కొన్ని దశాబ్దాల పాటు రాజ్యమేలారు. ప్రధానంగా పంతొమ్మిది వందల డెబ్బై, ఎనభై, తొంభై దశకాల్లో ఒక వెలుగు వెలిగారు. కానీ తొంభైల తర్వాత, ఇక్కడ కేబుల్ టీవీ రావటం తోపాటే, వీరి నవలల పాపులారిటీ తగ్గిపోయింది (ఆ పాఠకులు టీవీ సీరియల్స్ వైపు మళ్ళటం చేత, ఆ రచయితలు కూడా చాలామంది టీవీ సీరియల్స్ రాయటం వైపే వెళ్ళిపోయారు). ఆ తర్వాత ముప్పై ఏళ్ళ పాటు తెలుగులో పాపులర్ సాహిత్యం అన్నది దాదాపు లేదు. ఇప్పుడు ఒక నవల ఇంత ప్రాచుర్యం పొంది ఇన్ని కాపీలు అమ్ముడుపోవడాన్ని బట్టి తెలుగులో పాపులర్ సాహిత్యం మళ్ళీ రంగ ప్రవేశం చేస్తున్నదా అన్న ఆలోచన కలిగింది. ఎందుకంటే ముప్పై వేల కాపీలంటే చిన్న విషయం కాదు. యండమూరి, మల్లాది వంటి పాపులర్ రచయితల ప్రభ దేదీప్యమానంగా వెలిగిన దశలో కూడా ఒక నవల ఇంత తక్కువ సమయంలో ఇన్ని కాపీలు అమ్ముడుపోవటం అరుదైన విషయమే.

పాపులర్ సాహిత్యం బాగా చేయగలిగేదీ, సీరియస్ సాహిత్యం చేయలేనిదీ ఒకటుంది. అది కొత్త పాఠకుల్ని సాహిత్యం వైపు రప్పించడం. ఇప్పుడు యాభైల అరవైల వయసులో ఉన్న చాలామంది పాఠకులని "మీకు సాహిత్య అభిరుచి ఎలా కలిగిందీ, మీరు చదివిన మొదటి పుస్తకాలు ఏమిటీ" అని అడిగితే వారిలో ఎక్కువమంది ఆనాటి పాపులర్ సాహిత్యం వైపే వేలెత్తి చూపిస్తారు. ఆనాటి పాపులర్ రచయితలే చాలామంది పాఠకుల్ని "చదవడం" వైపు ఆకర్షితుల్ని చేశారన్నది చాలావరకు నిజం. అలా చదవటం మొదలుపెట్టిన పాఠకుల్లో కొంతమంది అక్కడితో ఆగిపోకుండా సీరియస్ సాహిత్యం వైపు వెళ్ళారు. అయితే సీరియస్ సాహిత్యానికీ పాపులర్ సాహిత్యానికీ మన సాహిత్య వాతావరణంలో కొన్ని చిత్రమైన పేచీలు ఉన్నాయి.

అవేమిటో చెప్పుకునే ముందు– అసలు పాపులర్ సాహిత్య ప్రభ వెలిగిపోతున్న ఆ రోజుల్లో వచ్చిన సీరియస్ సాహిత్యం ఏమిటీ అన్నది ఒకసారి చూడాలి. ఆ రోజుల్లో సీరియస్ సాహిత్యం అంటే కమ్యూనిస్ట్ భావజాలంతో ఏదో రకంగా ముడిపడి ఉన్నదే. ఈ కమ్యూనిస్ట్ భావజాలం గల రచయితలు పాపులర్ సాహిత్యాన్ని ఈసడించుకున్నారు. ఆనాడు వార పత్రికల ద్వారా ఎక్కువ ప్రచారం పొందిన పాపులర్ సాహిత్యాన్ని బూతు సాహిత్యం అన్నంతగా విమర్శించారు. 1953లో శ్రీశ్రీ "వార పత్రికలంటే పెట్టుబడికీ కట్టుకథకీ పుట్టిన విషపుత్రికలు" అన్నారు. ఇది చాలావరకు నిజమే కూడా. హీరోయిన్ల జాకెట్ కొలతల్ని ఊహించమని పాఠకులకి క్విజ్‌లు పెట్టిన దశ ఒకటి పత్రికల్లో నడిచిందనీ, ఇప్పటి యూట్యూబ్ థంబ్‌నైల్స్‌కి మించిన దిగజారుడుతనం ఆనాటి కొన్ని వార పత్రికల్లో కనిపించేదనీ మరిచిపోలేం. అయితే అది ఎంత నిజమో, పాపులర్ సాహిత్యం పట్ల లెఫ్ట్ భావజాల రచయితల స్పందనలో కొంచెం అతి ఉన్నదన్నదీ అంతే నిజం.

ఉదాహరణకి, అమెరికాలో స్టీఫెన్ కింగ్ ఏదో హారర్ నవల రాశాడని టోనీ మారిసన్ విరుచుకుపడలేదు. సిడ్నీ షెల్డన్ నవలల పాపులారిటీ చూసి ఏ సాల్మన్ రష్దీనో పబ్లిక్‌గా ఉడుక్కోలేదు. కానీ ఇక్కడ యండమూరి 'తులసీదళం' నవలకి వస్తున్న పాపులారిటీ చూసి రంగనాయకమ్మ స్థాయి రచయితలు కూడా విరుచుకుపడ్డారు. 'తులసీదళం కాదు, గంజాయి దమ్ము' అనీ, క్షుద్ర సాహిత్యమనీ చాలామంది కఠిన విమర్శలు ఎక్కుపెట్టారు. విమర్శ లేకపోతే అలాంటి సాహిత్యం పెరిగిపోతుందన్నది వాళ్ళ వాదన. వేరే దేశాల్లో పాపులర్ సాహిత్యాన్నీ ఆయా సాహిత్య వాతావరణాలు అంగీకరించాయి. మొత్తం సాహిత్య వాతావరణంలో పాపులర్ సాహిత్యానికీ స్థానం ఉన్నదని ఒప్పుకున్నాయి. తెలుగులో మటుకు దాన్ని కుష్టురోగిని దూరం పెట్టినట్టు దూరం పెట్టడానికి ప్రయత్నించారు. మొత్తానికి తొంభైల తర్వాత పాపులర్ సాహిత్యానికి రకరకాల కారణాలతో సహజ మరణం ప్రాప్తించింది.

ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ సాయం తోనో, మీమ్ పేజీస్ సాయం తోనో ఎలాగైతేనేం ఒక నవల ముప్పై వేల కాపీలు దాటి అమ్ముడుపోయిందన్న విషయం చూస్తే తెలుగులో పాపులర్ నవల మరోసారి పునర్జన్మ ఎత్తనున్నదా అన్న ఆలోచన కలుగుతున్నది. మరి ఇప్పుడు లెఫ్ట్ భావజాలం అంత తీవ్రంగా లేదు. ఈ వాతావరణంలో పాపులర్ సాహిత్యం మళ్ళీ రంగప్రవేశం చేస్తే, మన ప్రస్తుత సాహిత్య వాతావరణం దానికి ఎలా స్పందిస్తుందీ అన్నది ఆసక్తికరమైన విషయం. దాన్నీ సాహిత్యంలో ఒక భాగంగా ఆహ్వానిస్తుందా, లేక ఇదివరకట్లాగే వెలేయటానికి ప్రయత్నిస్తుందా? అలాగే ఒకప్పటి పాపులర్ సాహిత్యం లాగే ఇప్పటి పాపులర్ సాహిత్యమూ పాఠకుల బలహీనతల మీద ఆధారపడే మనుగడ కొనసాగిస్తుందా? లేక వేరే కొత్త దారేదైనా కనుక్కుంటుందా? లేక రెండూ కలిసి ఉంటూనే విడివిడిగా ఎలాగోలా కొనసాగుతాయా? అసలు అవి ఒక గీత గీసి విడదీయగలిగేంత వేర్వేరు విషయాలేనా? ఇవన్నీ ఆసక్తికరమైన ప్రశ్నలు. వీటి జవాబులెలా ఉన్నా తెలుగు అక్షరం వైపు కొత్త పాఠకులు రావటం మంచి విషయమే అంటే ఎవరికీ పేచీ ఉండకపోవచ్చు.

ఒక నవల ముప్పై వేల కాపీలు దాటి అమ్ముడుపోయిందన్న విషయం చూస్తే తెలుగులో పాపులర్ నవల మరోసారి పునర్జన్మ ఎత్తనున్నదా అన్న ఆలోచన కలుగుతున్నది. మరి ఇప్పుడు లెఫ్ట్ భావజాలం అంత తీవ్రంగా లేదు. ఈ వాతావరణంలో పాపులర్ సాహిత్యం మళ్ళీ రంగప్రవేశం చేస్తే, మన ప్రస్తుత సాహిత్య వాతావరణం దానికి ఎలా స్పందిస్తుందీ అన్నది ఆసక్తికరమైన విషయం.

■ కావేరి గోపాల్

kaveripedapudi67@yahoo.com

చదువు ముచ్చట

దళితవాద సాహిత్యమన్నా, కవిత్వమన్నా ఇష్టం

నరేష్కుమార్ సూఫీ



ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

వసుదేంద్ర తేజోతుంగభద్ర (తెలుగు అనువాదం). దాని తరువాత కూడా చదివిన పుస్తకాలు ఉన్నాయిగానీ, ఈ మధ్య కాలంలో అంతగా ఆకట్టుకున్న పుస్తకం మరొకటి ఇంకా తగల్లేదు.

బాల్యంలో/ యవ్వనంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

బాల్యంలో అంటే చెప్పలేను గానీ, నా పంతొమ్మిదేళ్ల వయసులో ఎక్కువసార్లు, ఎక్కువరోజులు చదివిన పుస్తకం చెలం 'శశిరేఖ'. చెలం ఆడవాళ్ల వైపు నుంచి రాశాడూ అంటారు గానీ నాకెందుకో పురుషుల గురించి, పురుషుల స్వభావాలను ఎత్తిచూపుతూ రాశాడనిపిస్తుంది.

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే తీరు ఎలా మారింది?

నాన్న పరిచయం చేసిన రామాయణ, మహా భారతాలతో మొదలై స్కూల్ డేస్‌లో మధుబాబు, తరవాతి కాలంలో యండమూరి, యద్దనపూడి సులోచనారాణి, సూర్యదేవర రామ్మోహనరావు లాంటి రచయితలని చదివేవాడ్ని. ఏకైక కారణం– అవి మాత్రమే అందుబాటులో ఉండటం. ఆ తరువాత ఎంపిక మారింది. ఇప్పుడు ఫిక్షన్‌కి పూర్తిగా దూరం కాలేదు గానీ చరిత్ర, మైథాలజీల ఆధారంగా వచ్చే రచనలన్నా, భారతదేశ సామాజిక అంశాల మీద వచ్చే రచనలన్నా ఇష్టంగా ఉంటుంది. ఇక కవిత్వం విషయంలో దళితవాద సాహిత్యమన్నా, కవిత్వమన్నా ఇష్టం. మద్దూరినో, కలేకూరినో, ఎండ్లూరి సుధాకర్‌నో చదివినంత ఉద్వేగంగా మిగతా కవిత్వాన్ని చదవలేను. మన చరిత్రని, సమకాలీన సమాజాన్ని సులభంగా అర్థం చేసుకోవటానికి ఈ రకం సాహిత్యం ఉపయోగపడుతుంది అనిపిస్తుంది. ఒక సినిమా కథ లాంటి నవలని/ అందాన్ని వర్ణించే కవిత్వాన్ని మాత్రమే చదివి 'నేను చదువరిని' అనుకోవటం ఇప్పుడు ఇబ్బందిగా ఉంటుంది.

మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?

ఇద్దరున్నారు.. కళ్యాణరావు, కాశీభట్ల వేణుగోపాల్. ఈ ఇద్దరూ నాలో ఉన్న చిన్నప్పటి నమ్మకాలనీ, నా ఆలోచనా తీరునీ మార్చుకునేందుకు ఉపయోగపడ్డారు. ఒకరు నా చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకోవటానికి, మరొకరు నన్ను నేనే చెక్ చేసుకోవటానికి. అయితే ఈ ఇద్దరిలోనూ ఒకరే అంటే మాత్రం కళ్యాణ రావుగారి వైపే మొగ్గుతాను. నా చుట్టూ ఉన్న సమాజాన్ని ఎన్ని పొరలుగా విడదీసి చూస్తే అర్థం చేసుకోగలమో తెలుసుకోవటానికి ఆయన చాలా ఉపయోగపడ్డారు.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది, ఎందుకు?

కాశీభట్ల వేణుగోపాల్ 'నేనూ చీకటి' నవల లోని ప్రధాన పాత్ర. అత్యంత నిర్లక్ష్యంగా ఉంటూనే విపరీతమైన ప్రేమలో మనుషులని చూసే మనిషిలా ఉండగలగటం అంత ఈజీ కాదనిపిస్తుంది. ఎవ్వరి మీదా వ్యతిరేకత లేని మనిషి అందరినీ వ్యతిరేకించే వ్యక్తిగా మారాలని, అతనిలా ఉండాలనీ అనిపిస్తూ ఉంటుంది.


అందరూ గొప్పదని చెప్పినా మీకు అంతగా నచ్చని పుస్తకం?

వడ్డెర చండీదాస్ గారి 'హిమజ్వాల' ఎందుకో మరీ సాగదీసినట్టుగా అనిపించింది. అన్ని పేజీలని వాడకుండా కూడా కథ చెప్పొచ్చన్నది నా అభిప్రాయం. ఇక్కడ ఆయనని ఏమాత్రం కించపరచటం లేదు గానీ నా వరకూ ఆ పుస్తకమ్మీద ఉన్న ఉద్దేశం మాత్రం అంతే.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

త్రిపుర. "ఇంత రిచ్ ఫెల్లోవి కదా. హాయిగా బతికేయకుండా ఇలాంటి కథలని రాసేంత విషాదం నీ జీవితంలో ఎక్కడ ఉంది? అంతటి బాధని దాచుకున్నావా? రాయటం కోసం తెచ్చిపెట్టుకున్నావా?" అని అడగాలని ఉంది.

ఏదైనా పుస్తకం నుంచి మీకు తరచుగా గుర్తొచ్చే వాక్యం/ కవితా పంక్తి?




"...ఈ ఇద్దరిలోనూ ఒకరే అంటే మాత్రం కళ్యాణ రావుగారి వైపే మొగ్గుతాను. నా చుట్టూ ఉన్న సమాజాన్ని ఎన్ని పొరలుగా విడదీసి చూస్తే అర్థం చేసుకోగలమో తెలుసుకోవటానికి ఆయన చాలా ఉపయోగపడ్డారు."

అనామధేయుడు అనబడు కవి రాసిన ఈ వాక్యాలు దాదాపుగా ఏదో ఒక సందర్భంలో తలుచుకునే మాటలు:

"కవిత్వమంటే కమ్యూనిస్టు మేనిఫెస్టో కాదేమో గానీ
గ్రీన్‌హంట్‌లో చెదిరిపడిన దేహాల ధిక్కారనయనాలు మాత్రం
కచ్చితంగా కవిత్వమే..."

(నరేష్కుమార్ సూఫీ కవి, కథకుడు. అతని కవిత్వ సంపుటి 'నిశ్శబ్ద', కథల సంపుటి 'పేరులేని వెన్నెల'.)



ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 24.6 కనిష్ఠం 22.3

వాన.. హైరానా!



నీటమునిగిన విజయవాడ జాతీయ రహదారి (హయత్‌నగర్ వద్ద)

- ఎడతెరిపిలేని వర్షంతో ఇబ్బందులు
- జనజీవనం అస్తవ్యస్తం
- పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- జలాశయాలకు పోటెత్తిన వరద నీరు
- మరో రెండు రోజులపాటు వర్షాలు
- నేడు హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరికి ఎల్లో అలర్ట్.. రంగారెడ్డి జిల్లాకు ఆరెంజ్ హెచ్చరికలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి భాగ్యనగరం తడిసి ముద్దయింది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. మరో రెండు రోజులు అతిభారీ వర్షాలు ఉండటంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. ఇప్పటికే పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. కాగా, ఆదివారం రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా మలక్‌పేటలో 4.6, బతుకమ్మకుంటలో 4.4, సెం.మీ వర్షం కురిసింది.

నిండుకుండలా హుస్సేన్‌సాగర్

కవాడిగూడ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. సాధారణంగా రెండు తూములనుంచి పారే మత్తడి భారీ వర్షాల వల్ల 17 తూముల నుంచి పారుతోంది. దీంతో సాగర్ నాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు హోటల్ మారియట్ నుంచి ఎరుకల బస్తీ, లోయర్ ట్యాంక్‌బండ్, గోశాల, డీబీఆర్‌మిల్, మారుతీనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, గాంధీనగర్ లింక్ బ్రిడ్జి, సబర్మతీనగర్, అరుంధతిగర్, దోభీగల్లీ, అశోక్‌నగర్, అరవింద్‌నగర్ కాలనీ, సూరజ్‌నగర్ మీదుగా బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, గోల్నాక మీదుగా ముసారాంబాగ్ వద్ద మూసీలో కలుస్తోంది.



హోటల్ మారియట్ వద్ద సాగర్ తూముల నుంచి బయటకు పారుతున్న వర్షం నీరు

అత్యవసర ఫోన్ నంబర్లు

జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ :	040-21111111
డీఆర్ఎఫ్ :	9000113667
విద్యుత్‌శాఖ టోల్ ఫ్రీ నంబర్ :	1912
కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ :	040-23202813 /9063423979

రైళ్లు రద్దు - ప్రయాణికుల పాట్లు



- రైళ్లరద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు సికింద్రాబాద్ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు 60 శాతం రద్దు కావడంతో వారం రోజుల ముందే టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొందరు రైల్వేస్టేషన్‌లోనే ఉండిపోయారు. మరుసటి రోజు వెళ్లాలని అనుకున్నవారు బంధువులు, స్నేహితుల ఇళ్లలో తలదాచుకున్నారు. వేరే అవకాశం లేని ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న చిన్న చిన్న లాడ్జిలు, డార్మిటరీలలో బస చేస్తున్నారు. దీంతో స్టేషన్ పరిసరాల్లో ఉన్న లాడ్జిలు హౌస్‌ఫుల్ అయ్యాయి. కాగా, రైల్వేస్టేషన్‌లో రైళ్ల రద్దు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

గుండు జారింది.. గుండె జల్లుమంది..

బంజారాహిల్స్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లోని అనేక బస్తీల్లో ఇప్పటికీ కొండలు, గుట్టలు కనిపిస్తుంటాయి. భారీగా కురుస్తున్న వర్షానికి మహాత్మాగాంధీనగర్‌లో ఓ గుట్ట మీద మట్టి పలుచబడి కొండ రాయి జారి బస్తీలోని ఓ ఇంటి ఆవరణలో పడింది. ఒక్కసారిగా ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులు ఉలిక్కిపడ్డారు. అయితే, రాయి ఏ మాత్రం దొర్లినా ఇల్లు పూర్తిగా ధ్వంసమయ్యేది. ఈ విషయం తెలిసిన బస్తీ ఉలిక్కి పడింది. వర్షం కారణంగా ఎటు నుంచి ఏ ప్రమాదం వస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. షేక్‌పేట రెవెన్యూ అధికారులు బండరాయి ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంటికి ఎటువంటి ప్రమాదం లేదని నిర్ధారించారు. అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



ఫిలింనగర్ మహాత్మాగాంధీనగర్‌లో జారిపడ్డ బండరాయి



ఖాళీగా ఉన్న ఉప్పల్ రహదారి

ఇంటికే పరిమితం!

- వెలవెలబోయిన మాల్స్, షాపింగ్ సెంటర్లు
- 60 శాతానికి పైగా తగ్గిన వ్యాపారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): దంచికొట్టిన వాన, ఈదురుగాలులతో నగరవాసులు అధికంగా ఇంటికే పరిమితమయ్యారు. అసలే ఆదివారం, కాస్త బద్దకంగా నిద్ర లేద్దాం. బయట టిఫిన్ తెచ్చుకుందామనుకున్నవారు కూడా మధ్యాహ్న భోజనానికే పరిమితమయ్యారు. ముక్కలేనిదే ముద్ద దిగదనుకునే వారు కూడా ఈ వర్షంలో బయటకు ఏం వెళ్తాం.. అని ఆన్‌లైన్ డెలివరీల వైపు చూసినా మధ్యాహ్న వానకు అదనపు చార్జీల బాదుడుకు తోడు డెలివరీకి అధిక సమయం తీసుకుంటుండటంతో చాలామంది ఇంటి వంటకే పరిమితమయ్యారు. నగరంలోని వ్యాపార సంస్థలు కూడా సెప్టెంబర్ నెల తొలి రోజు, అదీ జీతాలు వచ్చిన తరువాత వచ్చిన తొలి వారాంతం అయినా వ్యాపారాలు జరగలేదని

మిగతా 8వ పేజీలో..

జీహెచ్ఎంసీకి 139 ఫిర్యాదులు

భారీ వర్షాలతో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు 139 ఫిర్యాదులు అందాయి. 115 ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయని, 24 ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయిందని ఫిర్యాదులు రావడంతో డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగాయి. లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద వాటర్ హోల్డింగ్ సంపు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పరిశీలించారు. ఈ ఏడాది 141 వాటర్ లాగింగ్ పాయింట్లను వచ్చే ఏడాదికి 50కి తగ్గేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలు, కాంపౌండ్ వాల్స్, భవన నిర్మాణ ప్రదేశాలను డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు సందర్శించి ప్రమాద అవకాశాలు గుర్తించి చర్యలు తీసుకుంటున్నారన్నారు. అధికారుల సెలవులు రద్దు చేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణ పనులను నిలిపివేయాలి

- బిల్డర్లకు దానకిషోర్ ఆదేశాలు



భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భవన నిర్మాణ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పనులను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ బిల్డర్లను ఆదేశించారు. అలాగే వర్క్‌సైట్‌లో ఉన్న కార్మికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కూలిపోయేందుకు అవకాశమున్న పాత, శిథిలావస్థకు చేరిన భవనాలను పరిశీలించి, నివాసముంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. నాలాల వద్దకు ఎవరూ వెళ్లకుండా లౌడ్ స్పీకర్ల ద్వారా అప్రమత్తం చేయాలని సూచించారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ. రంగనాథ్ ఆదివారం కూల్చివేతలకు విరామం ఇచ్చి.. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో పర్యటించి రక్షణ చర్యలకు ఉపక్రమించారు. డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి అమీర్‌పేట, బేగంపేట, షేక్‌పేట, టోలిచౌకి, గచ్చిబౌలి, కొండాపూర్, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పలుచోట్ల ఇళ్లల్లోకి నీరు చేరడం, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడం వంటివి గుర్తించి, తక్షణం తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై సిబ్బందికి సూచించారు.

కలుషిత నీరు, సివరేజీ సమస్యలపై దృష్టి
8
సమన్వయంతో పనిచేయండి
- సీపీలకు ఉన్నతస్థాయి ఆదేశాలు

రేయింబవళ్లు మరమ్మతులు

జీటీఎస్ కాలనీలోని ఎలక్ట్రిసిటీ స్కాడా కంట్రోల్ రూంను టీజీట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సందర్శించారు. భారీవర్షాలు, ఈదురుగాలులతో 24 గంటలూ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌స్తంభాలు విరిగిపడినట్లు 400కు పైగా ఫిర్యాదులు వచ్చాయని, రాత్రింబవళ్లు సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారని అధికారులు వెల్లడించారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న సీఎండీ రోనాల్డ్ రోస్



ఖైరతాబాద్ న్యూ సీజీ క్వార్టర్స్ వద్ద నడుస్తున్న కారుపై పడ్డ భారీ వృక్షం



కూలిన నాంపల్లిలోని గాంధీభవన్ గోడ



వరద ప్రభావిత ప్రాంతంలో ఆమ్రపాలి

లోతట్టు ప్రాంతాల్లో జాగ్రత్త

- ప్రజలను అప్రమత్తం చేయాలి : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టుప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. పాత ఇళ్లలో నివాసముంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం జియగూడ మండి పక్కన మూసీ వరద నీటి ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లోతట్టు ప్రాంత ప్రజలతో మాట్లాడి వరదతీవ్రత పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున చెరువులు, కుంటలతోపాటు మూసీ వరద నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్లలో వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి మూసీలోకి వదులుతామన్నారు. వరద తీవ్రతను గమనించి ముంపు ప్రాంతాల్లో నివాసముంటున్న వారిని రెండు గంటల ముందే సహాయ శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నంబర్: 040-23202813 /9063423979కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జియాగూడలో మూసీ వరదను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

WANTED

H డ్రైవర్ అవసరం! హైదరాబాద్‌లో ఎవరెస్ట్ ఫ్లీట్ CNG కార్ డ్రైవ్ చేయండి. నెలకు రూ.25,000- సంపాదించండి!! +91 9324912075 AJH>0101

PLOT FOR SALE

H VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర.93985 76997. AJB -61

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

ఆ బిల్డర్లు ఎక్కడ?

- ఆచూకీ కోసం ఆరా తీస్తున్న హైడ్రా
- ఇప్పటికే కొందరిపై కేసులు
- ఈ వారంలో మరిన్ని కేసుల నమోదుకు సిద్ధం



హైడ్రా కూల్చివేసిన ఓ నిర్మాణం (ఫైల్)



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాల బాధ్యులపై చర్యలకు హైడ్రా మరింత వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కేసుల నమోదుతో పాటు, నిర్మాణ యజమానులపైనా కేసులు నమోదు చేయటం తెలిసిందే. ఈ వారంలో మరికొందరిపై కేసులు నమోదు చేసేలా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఆక్రమణలు.. కబ్జాలకు సంబంధించి వెయ్యికి పైగా ఫిర్యాదులు హైడ్రా వద్ద ఉన్నాయి. తీవ్రత ఎక్కువగా ఉన్న వాటిపై తొలుత దృష్టి సారించనుంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో భవనాలు నిర్మించిన నిర్మాణదారులపైనే హైడ్రా చూపంతా ఉంది. వారిలో కొందరు బిల్డర్లు అందుబాటులో లేకుండా పోయారు. ఇంకొందరు వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో వారి విషయంలో ఏం చేయాలన్నది ప్రశ్నగా మారింది. ఇప్పటికే ముగ్గురు బిల్డర్లపై కేసులు నమోదు చేసిన నేపథ్యంలో.. మిగిలిన వారిపైనా అదే తరహా చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే.. కొందరికి సంబంధించిన సమాచారం లభించకపోవటం అధికారులకు సమస్యగా మారింది. వీరిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

సమాధానాన్ని బట్టి చర్యలు

చందానగర్ సర్కిల్ మదీనాగూడ గ్రామంలోని ఈర్ల చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లు కృష్ణ కిశోర్, స్వర్ణలతలకు మియాపూర్ పోలీసులు నోటీసులు అందజేశారు. వారంలో వారి వాదనలు తెలిపేందుకు గడువు ఇచ్చారు. వారి నుంచి వచ్చే సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ఇద్దరు బిల్డర్లపై పీడీపీపీ (ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ) యాక్టులోని సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ సెక్షన్లు బెయిలబుల్ కావడం గమనార్హం. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్వే నంబరు 134లోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో మూడు బ్లాకుల్లో భవనాలు నిర్మించిన మ్యాప్స్ ఇన్ ఫ్రా సంస్థకు చెందిన సుధాకర్‌రెడ్డి మీద బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హైడ్రాకు పెద్ద ఎత్తున వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వేగంగా చర్యలు తీసుకోవటం తలకు మించిన భారంగా మారుతోంది. పలు విభాగాలతో సమన్వయం చేసుకోవటం.. వారి నుంచి సమాచారం తెప్పించుకోవటానికి ఎక్కువ సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే గుర్తించి నిర్ధారించిన నిర్మాణాలపైన చర్యలకు హైడ్రా ప్రాధాన్యం ఇస్తోంది. ఈర్ల చెరువుపై ఇరిగేషన్ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించిన హైడ్రా వెంటనే చర్యల కత్తి దూసింది. నిర్మాణాలను కూల్చేయటంతో పాటు.. అందుకు బాధ్యులైన వారిపైనా కేసులు నమోదు చేసింది. ఈ తరహాలోనే ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ తదితర విభాగాలు గుర్తించిన అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. అంతకంతకూ పెరిగిపోతున్న ఫిర్యాదులతో ప్రాంతాలవారీగా విభజన చేస్తున్నారు.

అప్ప చెరువు ఎఫ్‌టీఎల్‌లో..

14 షెడ్లు కూల్చివేత

రాజేంద్రనగర్, సెప్టెంబర్1(ఆంధ్రజ్యోతి): గగన్‌పహడ్ అప్ప చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన 14 షెడ్లను హైడ్రా అధికారులు శనివారం రాత్రి వరకు నేలమట్టం చేశారు. సర్వే నంబర్ 89, 90లో విస్తరించి ఉన్న చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలు ఉన్నాయని స్థానికులు హైడ్రా అధికారుల దృష్టికి తీసుకురావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం 14 పరిశ్రమల షెడ్లను కూల్చేశారు. ఒక్కో షెడ్డు వెయ్యి గజాల చొప్పున ఉండటంతో కూల్చడానికి చాలా సమయం పట్టింది. ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న పెద్ద నిర్మాణాన్ని కూడా నేలమట్టం చేశారు.



అప్ప చెరువులో షెడ్ల కూల్చివేతలు

అంతా మా ఇష్టం
- దక్షిణ డిస్కంలో ఇన్‌చార్జి డైరెక్టర్ల ఇష్టారాజ్యం
- కొంతమందిపై అవినీతి ఆరోపణలు
- కమర్షియల్ వింగ్‌లో నిబంధనల పేరుతో వసూళ్లు
8







1, 2, 3 : రోడ్డు ప్రమాద దృశ్యాలు

కారుతో యువతిని ఢీకొట్టిన మైనర్..

వనస్థలిపురం, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న యువతిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. హయత్‌నగర్‌కు చెందిన సోని(25) వనస్థలిపురంలోని పలు ఇండ్లు, షాపుల్లో పనిచేస్తుంటుంది. ఆదివారం ఉదయం వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని స్వామి వివేకానంద పార్కు వద్ద టిఫిన్ తీసుకుని నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో డ్రైవింగ్ నేర్చుకుంటున్న ఓ మైనర్ ఆమెను కారుతో ఢీకొట్టాడు. దీంతో సోని ఆరు మీటర్ల మేర గాల్లోకి ఎగిరి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణమైన బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్జీవోస్ కాలనీ నుంచి బీఎన్‌రెడ్డినగర్ వెళ్లే ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

టానిక్ లిక్కర్ మార్ట్‌ను మూయించిన ఎక్సైజ్ శాఖ



టానిక్ లిక్కర్ మార్ట్‌ను మూయించి వేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు


బంజారాహిల్స్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ గడువు ముగియడంతో జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో కార్పొరేట్ మద్యం దుకాణం టానిక్ లిక్కర్ మార్ట్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం మూయించేశారు. 2016లో ఎలైట్ పేరిట ప్రత్యేక జీవో ద్వారా అనిత్‌రాజ్ లక్ష్మారెడ్డి మద్యం విక్రయ లైసెన్స్ తీసుకున్నారు. విదేశీతోపాటు స్వదేశీ మద్యం సూపర్‌మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. యేడాదికోసం లైసెన్స్ రెన్యూవల్ చేసుకునేలా అప్పట్లో నిబంధనలు పెట్టారు. తాజాగా వీరి లైసెన్స్ ఆగస్టు 31న ముగిసింది. లైసెన్స్ పునరుద్ధరణ కోసం నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆదివారం ఉదయమే ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు సిబ్బందితో 'టానిక్'కు చేరుకుని షాపును మూసివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా కేబీ శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రెండు సంవత్సరాలకోసారి మద్యం లైసెన్స్‌లను పునరుద్ధరణ చేస్తున్నట్టు చెప్పారు. మద్యం పాలసీకి విరుద్ధంగా గతంలో ఎలైట్ లైసెన్స్‌ను ఇచ్చినట్టు చెప్పారు. ప్రస్తుతం ఎలైట్ లైసెన్స్ విధానంపై ఆలోచించనున్నట్టు తెలిపారు.













తగ్గని వర్షం

● కూలిన ఇళ్లు, జలమయమైన రోడ్లు ● సహాయక చర్యల్లో యంత్రాంగం

రెండు రోజుల నుంచి భారీ వర్షం తగ్గడం లేదు. దీంతో రాజేంద్రనగర్, చాంద్రాయణ గుట్ట, అఫ్జల్‌గంజ్, చార్మినార్, నార్సింగ్, మదీన, నాంపల్లి, పాతబస్తీ ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. హైకోర్టు రోడ్డులో చెట్టు ఒరిగింది. మొఘల్‌పురా సుల్తాన్ షాహీలో ఓ పురాతన ఇల్లు, గాంధీభవన్ వెనుకాల ఉన్న ఇందిరాభవన్ వద్ద గోడ కూలిపోయాయి. రోడ్లపై వరద నీరు నిలువ కుండా వర్షంలోనే యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టారు. వర్షపునీరు రోడ్లపై నిలువకుండా చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో చార్మినార్ జోన్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ టి.వెంకన్న, చార్మినార్ డీఎంసీ సరిత సిబ్బందితో కలిసి పర్యటించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ డి.శ్రీరాంమోహన్ తెలిపారు.


శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ రోడ్డులో డ్రైనేజీ నీరు వెళ్లే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్


దారుల్ షిఫా వద్ద వర్షం ఇబ్బందులను పరిశీలిస్తున్న చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ తదితరులు

చార్మినార్/మదీన, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. రోజువారీ కూలీలు సైతం పనులు దొరకకపోవడంతో అడ్డాల నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డుపై పారుతున్న వరద నీరు పోయేలా చార్మినార్ డీఎంసీ సరిత తమ సిబ్బందితో కలిసి చర్యలు తీసుకున్నారు. కొన్ని చోట్ల చెట్లు, మొఘల్‌పురాలో ఒక పురాతన ఇల్లు కూలిపోయాయి. హైకోర్టు రోడ్డులో చెట్టు ఒరిగింది. దీంతో చార్మినార్ డీఎంసీ సరిత సిబ్బందితో అక్కడికి వెళ్లి ఒరిగిన చెట్టును తొలగించారు. మొఘల్‌పురా సుల్తాన్ షాహీలో ఓ పురాతన ఇల్లు కూలిపోగా డీఎంసీ సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. సమాచారమందుకన్న తహసీల్దార్ కె.చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాక్షికంగా ఇల్లు ధ్వంసం కావడంతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఇంట్లో ఉంటున్న మహిళ ముందే ఇంటి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. దారుల్‌షిఫా వద్ద ప్రమాదంగా ఉన్న ఓ కరెంటు స్తంభాన్ని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నయీమ్, విద్యుత్ అధికారులతో కలిసి తొలగించారు. దారుల్ షిఫా అలవా సర్ తుక్‌లో ఓ పురాతన చెట్టు రేకులషెడ్డుపై కూలిపోయింది. చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేకర్‌అలీ, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ ఆఫంది, కార్పొరేటర్లు దారుల్ షిఫా తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇబ్బందుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు బయటకు రావద్దని ఏవైనా సంఘటన జరిగితే స్థానిక కార్పొరేటర్లకు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నగర శివారులోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని, శ్రీరామ్ కాలనీ, పహాడి షరీఫ్, వాదీ ఏ ముస్తఫా, ఎర్రకుంట ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.


హిమాయత్‌నగర్‌లో వర్షంలోనే గొడుగు పట్టుకుని బైక్‌పై వెళ్తున్న వాహనదారులు

వరదనీరు నిలవకుండా చర్యలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులూ పడకుండా జీహెచ్ఎంసీ అధికారులు ఆదివారం ఉదయం నుంచే రోడ్లపై తిరుగుతూ పరిస్థితులను సమీక్షించారు. రోడ్లపై నీరునిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, ఈఈ నరేందర్‌గౌడ్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ తదితరులు వివిధ బస్తీలు, రహదారుల్లో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. హసన్‌నగర్ ఖయ్యాం నగర్‌లో ఓ ఇల్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ ఇంట్లో ఉన్న వారిని అధికారులు బంధువుల ఇంటికి పంపించారు. ఏ క్షణమైనా హిమాయత్‌సాగర్ జలాశయం నించి గేట్లు ఎత్తే అవకాశం ఉందని, మూసీ పరీవాహక ప్రాంతంలోని హైదరీ ఎన్‌క్లేవ్ ప్రాంతంలో నివాసం ఉండే వారికి అధికారులు, సిబ్బంది సూచించారు. మూసీకి మరీ దగ్గరగా ఉండే నివాసాల వారు ఖాళీచేసి బంధువుల ఇళ్లలోకి వెళ్లాలని సూచనలు చేశారు. ఉప్పర్‌పల్లి 191, శివరాంపల్లి బెస్ట్‌ప్రైజ్, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి, శివరాంపల్లి రాందేవ్‌బాబా దేవాయలం సమీపంలో రోడ్లపై నీరునిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన జెడ్సీ

మదీన: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో చార్మినార్ జోన్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అధికారులతో కలిసి పర్యటించారు. చాంద్రాయణగుట్ట బాబానగర్‌లో కొనసాగుతున్న ప్రాజెక్ట్ నిర్మాణ పనులను, చాంద్రాయణగుట్ట, హాషామాబాద్, తలాబ్‌కట్ట, మౌలా కా చిల్లా, జహంగీర్‌నగర్, అమాన్ నగర్, ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలోని మక్కా కాలనీ, ఫలక్‌నుమా, బహదూర్‌పురాలతోపాటు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. వరద నీటి సమస్యలపై అధికారులతో ఆరాతీశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని చెప్పారు. పురాతన, కూలడానికి సిద్ధంగా ఉన్న నివాసాలను గుర్తించి నోటీసులు జారీ చేయనున్నామన్నారు.

ముసురుతో ప్రజల ఇబ్బందులు

చాంద్రాయణగుట్ట: ముసురు వాన... మధ్యమధ్యలో జోరువాన రెండురోజుల నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు రావడంతో ప్రజలు, వాహనదారులు తిప్పలు పడ్డారు. ఛత్రినాక ప్రధాన రహదారిపై వర్షపు నీరు భారీగా చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్లపై వరద నీరు నిల్వడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

ఆహార పదార్థాల పంపిణీ

అఫ్జల్‌గంజ్: రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న గుడిసెవాసులకు జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్‌జైస్వాల్ ఆహారపదార్థాలను అందజేశారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని మాలాకుంటలో వర్షాల కారణంగా ఉపాధి లేక ఇంట్లోనే కాలం వెళ్లదీస్తున్న సుమారు 100 కుటుంబాలకు ఆహార పదార్థాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్‌సింగ్, శ్రీనివాస్ యాదవ్, జగపతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి వాహనాలు ధ్వంసం

అఫ్జల్‌గంజ్: నగరంలో కురుస్తున్న భారీ వర్షానికి నాంపల్లి గాంధీభవన్ వెనుకాల ఉన్న ఇందిరాభవన్ వద్ద పార్కు చేసిన వాహనాలపై గోడ కూలింది. ఈ ప్రమాదంలో అక్కడ పార్కుచేసిన వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న గాంధీభవన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసమైన వాహనాలను తొలగించారు. అయితే పురాతన గోడ కావడంతో వర్షాలకు నాని కూలిపోయిందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగిపోవడం, విద్యుత్ వైర్లలో చిన్నచిన్న సమస్యలు వచ్చినప్పటికీ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ డి.శ్రీరాంమోహన్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి వాంబేకాలనీలో డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్‌రావు, ఏడీఈ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ హతీరామ్‌తో కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, వర్షాలు, గాలులు వచ్చినప్పుడు ప్రజలు చెట్ల పక్కన ఉన్న స్తంభాల వద్ద ఉండకూడదన్నారు.


ఉప్పర్‌పల్లి వాంబే కాలనీలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ఎస్ఈ డి.శ్రీరాంమోహన్

అప్పచెరువు కింది భాగంలో కట్టిన ప్రహరీని కూల్చివేయాలి : బీజేవైఎం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : అప్పచెరువు కింది భాగంలో నీరు పెద్ద చెరువుకు వెళ్లకుండా అడ్డుగా కట్టిన ప్రహరీని కూల్చివేయాలని బీజేవైఎం రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ నూరెడ్డి వినయ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడుతూ, అప్పచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పరిశ్రమల షెడ్లను కూల్చివేయడం సంతోషకరమన్నారు. అయితే అప్పచెరువు తూములు గతంలో ఫకీర్‌గుట్ట వైపు ఉండేవని, వాటిని కొందరు మూసి వేశారన్నారు. ఆ తూములను తిరిగి తెరిపించాలని కోరారు. పాత తూములవైపు కింది భాగంలో ప్రైవేట్ వ్యక్తులు చెరువు నీరు కిందకు వెళ్లకుండా ప్రహరీ నిర్మించారని గుర్తు చేశారు. అప్పచెరువు నిండినప్పుడు వరదనీరు చెరువు కింది నుంచి పెద్దచెరువులోకి వెళుతుందని, అలా వెళ్లకుండా నిర్మించిన ప్రహరీని తొలగించాలన్నారు. 2020 అక్టోబర్ 12వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షానికి అప్ప చెరువు పూర్తిగా నిండిపోయి ప్రస్తుతం కట్టిన ప్రహరీవైపు నుంచే ఓ ఫంక్షన్‌హాల్ నుంచి ప్రవహించిందన్నారు. దీంతో ఫంక్షన్‌హాల్ బయట పడుకున్న నలుగురు వరదకు కొట్టుకుపోయి మరణించారన్నారు. అదేప్రాంతం గూండా వరద నీరు ప్రవహించి జాతీయ రహదారి పాడైందని, రోడ్డుపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని గుర్తుచేశారు. అలాంటి చోట ప్రహరీని నిర్మించారని దానిని తొలగించాలని కోరారు. అప్ప చెరువుకు పాతతూములు ఉన్న చోట కాకుండా నూతనంగా కట్టిన నాలా చెరువులో ఒక చుక్క నీరు లేకుండా చేస్తుందన్నారు. దీంతో చెరువు ఆనవాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. చెరువు రైలు పట్టాల అవతలి వైపు, ఇవతలివైపు విస్తరించి ఉంటుందన్నారు. రైల్వే పట్టాల కింది భాగంలో చెరువులోని నీరు అవతలి నుంచి ఇవతలకి ప్రవహించడానికి నాలా ఉందని తెలిపారు. దానికి అడ్డంగా పోసిన మట్టిని, కట్టిన గోడను కూడా తొలగించాలన్నారు. అప్పచెరువులో పోసిన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలన్నారు.


అప్ప చెరువు పాత తూము కింది భాగంలో నీరు రాకుండా కట్టిన ప్రహరీ

ఆకట్టుకున్న 'రైతురాయల స్వర్ణచరితం' నృత్యరూపకం


నృత్యరూపకంలో కళాకారులు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జీవిత విశేషాలతో రూపొందించిన రైతు రాయల స్వర్ణ చరితం నృత్యరూపకాన్ని ఆదివారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. భారత రంగస్థల అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నృత్యరూపకం ప్రేక్షకుల్ని రంజింపజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వకార్యదర్శి ఐఏఎస్ బుర్రా వెంకటేశం హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగనభట్ల నర్సయ్య, డా.ఏబీకే.ప్రసాద్, మామిడి హరికృష్ణ, భాగవతుల సేతూరాం, గుడివాడ నాగరత్నం నాయుడు, ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.


కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

పహాడిషరీఫ్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం జలపల్లి మున్సిపాలిటీ 19వ వార్డు సాదత్ నగర్‌కి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు జలపల్లి మున్సిపాలిటీ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్, సయ్యద్ బదర్ ఆధ్వర్యంలో మీర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వారికి బీఆర్ఎస్ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్‌పల్లిలో మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ 9 నెలల పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఫైసల్ ఖాన్, ఎండీ సలీం, అజీమ్‌ఖాన్, అదర్‌మోహివుద్దీన్, సైఫ్‌ఖాన్ ముజమ్మిల్, ఫైసల్‌ఖాన్ శేరియర్‌అలీ, సల్మాన్ ఖాన్ మజీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఎఫ్ రన్నరప్ కార్తీక్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): థాయ్‌లాండ్‌లో జరిగిన ఐటీఎఫ్ వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ యువ టెన్నిస్ ప్లేయర్ గంట సాయికార్తీక్ జోడీ త్రుటిలో టైటిల్ చేజార్చుకుంది. డబుల్స్ ఫైనల్లో కార్తీక్-విశయ ద్వయం 7-6, 4-6, 7-10తో ఆస్ట్రేలియాకు చెందిన డెల్ని జెక్-జెస్సీ చేతిలో పోరాడి ఓడాడు. కార్తీక్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి.



కార్తీక్-విశయ జోడీ


నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

గణేశ్ ఉత్సవాలు సమీపిస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే..

చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి కౌడి మహేందర్ ఆరోపించారు. ఆదివారం ఛత్రినాక రాజన్నబావి నిమజ్జన ఊరేగింపు మార్గంలో ఆయన పర్యటించారు. ఛత్రినాక వద్ద నిలిచిన వర్షపు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొన్న శ్రీనివాస్, ఉదయ్ కిరణ్‌రెడ్డి, రాజేశ్వర్, విజయ్‌కుమార్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

గన్‌పార్క్ వద్ద ఉద్యోగ సంఘాల జేఏసీ నిరసన



గన్‌పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కుండపోత వర్షం కురుస్తున్నా పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర జేఏసీ పెద్దలు మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమర వీరుల స్తూపం దగ్గర నిర్వహించిన సభలో పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు. సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు అని నినదించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి, స్థితాప్రజ్ఞ, గజిటెడ్ అధికారుల సంఘ ప్రధానకార్యదర్శి ఎ.సత్యనారాయణ, కేంద్ర సంఘ ప్రధానకార్యదర్శి డా.ఎస్ఎం.హుస్సేని(ముజీబ్), అధికారుల సంఘ ప్రతినిధులు వెంకట్, కృష్ణయాదవ్, కేంద్ర సంఘ సభ్యులు కస్తూరి వేంకటేశ్వర్లు, ఉమాదేవి, శైలజ, బొల్లిగిద శంకర్, నాలుగో తరగతి కేంద్ర సంఘ అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్ బిన్ హసన్, జిల్లా సభ్యులు విక్రంకుమార్, కేఆర్.రాజ్‌కుమార్, ఉమర్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, ముఖీమ్ ఖురేషి, శ్రీధర్, రాజు, కృష్ణ ఇతర యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. కుండపోతవర్షం పడుతున్నా సీపీఎస్, యూపీఎస్ వద్దురా.. ఓపీఎస్ ముద్దు రా.. అని ముక్తకంఠంతో ఉద్యోగులు నినదించారు.

పాతపెన్షన్ స్కీమ్‌నే అమలు చేయాలి


ఏఆర్ఐ గేటు ఎదుట గల ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు ఆదివారం రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగుల జేఏసీ ఇన్‌చార్జి చైర్మన్ ఎం.శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించారు. రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఏఆర్ఐ) గేటు ముందు గల ధర్నాచౌక్ వద్ద కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దుచేసి పాతపెన్షన్ స్కీమ్‌ను ఉద్యోగులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ప్లకార్డులు చేతపట్టుకుని వర్షంలో సైతం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాల ఉద్యోగులతోపాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు సీపీఎస్‌ను రద్దుచేసి ప్రతి ఉద్యోగికీ పాతపెన్షన్‌ను అమలుచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు డీఏలను వెంటనే ఇవ్వాలన్నారు. అందుకోసం పీఆర్సీ కమిటీని వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఎంఏ.నయీమ్, ఎస్.యాదయ్య ముదిరాజ్, సామ అమృత్‌రెడ్డి, మహ్మద్ షర్ఫుద్దీన్, డాక్టర్ జె.సురేశ్, బిక్షపతి, రమేశ్, జ్ఞానేశ్వర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.అంజయ్యగౌడ్, ఎం.నాగులు యాదవ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఫుడ్ అండ్ డెయిరీ'

మదీన, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుసేనిఆలంలో మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు ఎం.రజనీ ఆధ్వర్యంలో ఆదివారం 'ఫుడ్ అండ్ డెయిరీ' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పులియబెట్టిన ఆహారం, ప్రిసర్వేటివ్ ఫుడ్ (సంరక్షక రసాయనాల ఆహారం) అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్, ఆహారాన్ని పులియబెడితే వాటిలో జరిగే మార్పుల గురించి వివరించారు. ఇందులో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ, వివిధ విభాగాల అధ్యాపకులు రజనీ, పి.మంజుల, శ్రీదేవి, సునీత, పి.లత, శోభారాణి, జెస్సీ, ఎం.ప్రణీత, ఎస్.అనిత, అరుణ, విద్యాధరి, అస్మా, జుల్ఫేకర్, ప్రసన్న ఖడ్కికర్ పాల్గొన్నారు.


ఆహారం గురించి సందర్శకులకు వివరిస్తున్న విద్యార్థినులు

కాలుష్యంతో శ్వాస వ్యాధుల విజృంభణ

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గాలి కాలుష్యం, మరోవైపు రసాయనాలతో ఉత్పత్తిచేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఉబ్బాసం, శ్వాసకోశవ్యాధులు విస్తరిస్తున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే మానవ మనుగడే ప్రమాదంలో పడుతుందని ప్రముఖ వైద్య నిపుణుడు, శ్వాస హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వీరపనేని విష్ణున్‌రావు పేర్కొన్నారు. శ్వాస సంబంధమైన వ్యాధులపై ఆయన కొన్ని దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు, సైనస్, ఉబ్బాసం వ్యాధులపై కూడా పరిశోధన సంస్థలు ఇచ్చే నివేదికలను కూడా అధ్యయనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. నగరంలో నివసించేవారికి వాహన, పరిశ్రమల వల్ల వెలువడే కాలుష్యం గాలి ద్వారా ఊపిరితిత్తులకు ప్రవేశిస్తుందన్నారు. వర్షం నీటి తడివల్ల నేల, చెట్లు, భవనాలు, చెత్తాచెదారం ఒకవిధమైన బ్యాక్టీరియాను కలిగి ఉంటాయని, గాలి కలుషితం ఎక్కువగా ఉంటుందని అన్నారు. వాతావరణం చల్లగా ఉందని రసాయనాలతో కూడిన పదార్థాలను ఫ్రై చేసి తీసుకోవడం ఎక్కువగా ఉంటుందని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. హోటళ్లు, ఆరుబయట రోడ్ల పక్కన విక్రయించే ఆహార పదార్థాలు సాధారణంగానే తినకూడదని, వర్షాకాలంలో గాలి వల్ల అవి మరింత కలుషితం అవుతుంటాయని, కొన్ని నియమాలను తప్పనిసరిగా పాటించాలని విష్ణున్‌రావు సూచించారు. రోజువారీ వ్యాయామం ఇతరత్రా జాగ్రత్తల వల్ల వ్యాధులను అదుపులో ఉంచవచ్చని, సమాచారం కోసం ఎప్పుడైనా తనను నారాయణగూడలోని శ్వాస హాస్పిటల్‌లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.


వీరపనేని విష్ణున్‌రావు

ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభం

నార్సింగ్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ ఇన్‌ఫ్రా హైట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని సన్‌సిటీలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ సీఈవో డాక్టర్ స్రవంతి ఎల్లసిరి హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యూహాలలో నైపుణ్యంతో, రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త వెంచర్లను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎస్ ఇన్‌ఫ్రా ఒకే హబ్‌లో ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు, వాణిజ్య ఆస్తులతో సహా సమగ్రమైన రియల్ ఎస్టేట్ ఎంపికలను అందించడానికి కట్టుబడి ఉంటుందని ఆమె తెలిపారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సంబంధించిన సమాచారంతో నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.


ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తున్న స్రవంతి తదితరులు

ఇళ్ల మధ్యలోకి కొండచిలువ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హసన్‌నగర్ పాత ఐస్ ఫ్యాక్టరీ సమీపంలోని ఇళ్ల వద్దకు శనివారం రాత్రి ఓ కొండ చిలువ రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మీరాలం చెరువును ఆనుకుని ఉన్న నూరాని మజీద్ ఐస్‌ఫ్యాక్టరీ ప్రాంతంలో కొండచిలువ రావడాన్ని గమనించిన స్థానికులు పాములను పట్టుకునే వ్యక్తిని పిలిపించారు. ఆయన వచ్చి కొండచిలువను పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో వదిలిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


కొండచిలువను పట్టుకున్న స్నేక్ ఫ్రెండ్



తెలంగాణ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో సత్య చాంపియన్‌గా నిలిచారు. ఎల్బీ స్టేడియంలో ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో ఒలింపియన్ ఆకుల శ్రీజ చేతుల మీదుగా సత్య ట్రోఫీ అందుకున్నారు.

పూజగదిలో బంగారు ఆభరణాల చోరీ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో పూజగదిలో నుంచి బంగారు ఆభరణాలు చోరీచేసిన వ్యక్తులను పట్టుకుని, పోయిన బంగారాన్ని ఇప్పించాలని పూలు అమ్ముకుని జీవనం సాగించే ఓ మహిళ వేడుకుంటోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. హైదర్‌గూడ గుమ్మకొండకాలనీకి చెందిన ఎల్.ధనుంజయ్‌గౌడ్, సులోచన భార్యాభర్తలు. 10 సంవత్సరాలుగా సులోచన దంపతులు స్థానిక జనప్రియ చౌరస్తాలో పూలమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. కూతురు పెళ్లి కోసం కూడబెట్టిన డబ్బుతో చేయించిన బంగారు ఆభరణాలను ఆగస్టు 28న చోరీకి గురయ్యాయి. ఆగస్టు 19న బంగారు, వెండిఆభరణాలను టిఫిన్ బాక్సులో పెట్టి, తన ఇంట్లో పూజ గదిలో ఉంచింది. గత నెల 28న టిఫిన్ బాక్సు తెరిచిచూడగా అందులో వెండి ఆభరణాలు మాత్రమే కనిపించాయి. బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న క్రైం పోలీసులు సులోచన ఇంటికి వచ్చి వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628

నగరంలో నేడు

- కోటి మహిళా యూనివర్సిటీలో ఉదయం 10:15 గంటలకు న్యూట్రియస్ డైట్ ఫర్ ఆల్ (పోషణ్ అభియాన్) ఎగ్జిబిషన్ జరగనుంది. ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరవుతారు.
- గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ హిమాలయ 105 బిల్డింగ్‌లో సాయంత్రం 6 గంటలకు 27వ ఫౌండేషన్ డే వేడుకలు జరగనున్నాయి. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరవుతారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్


కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మరో రెండు రోజుల పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఆదివారం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలకు 24 గంటల పాటు పనిచేసేలా కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, వర్షాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఫోన్ నంబరు 9492409781లో తెలియజేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ, ఎండీఓ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కలెక్టర్ సూచించారు.

ప్రజావాణి రద్దు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నందున జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

నగరంలో వరద బాధితులకు భోజనం

- పలుహోటళ్లతో కలిసి ఏర్పాటు చేసిన యూత్‌ఫీడ్ ఇండియా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో వరద నీరు చేరింది. వరద బాధితులకు ఎన్‌ఆర్ఏఐ సహకారంతో యూత్ ఫీడ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ నిర్వాహకులు భోజనాలు, నీరు, అత్యవసరాలను అందించారు. మహంకాళి, క్లాక్‌టవర్, గౌలిగూడ, వట్టేపల్లి, బండ్లగూడ, సాబర్‌నగర్, మురాద్‌నగర్, డబీర్‌పురా, షాహీన్‌నగర్‌లో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరిన వారికి భోజనం, నీరు అందజేశారు. దీనికి వయోలా ఫ్యూజన్ 9, ది స్పైసీ వెన్యూ, పిస్తా హౌస్, ఆలివ్ బ్రిస్ట్రో, నాటు, జల్‌పాన్, ఆగ్రాస్వీట్స్, పీకాక్ ప్రైమ్, సొరైల్, పీనట్, శ్రీకన్య, రాయలసీమ రుచులు, ఎయిర్‌లైవ్ హోటళ్లు సహకారం అందించాయని యూత్‌ఫీడ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ షాజ్ మహమూద్ తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

ఘనంగా 'నార్మ్' వ్యవస్థాపక దినోత్సవం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను గ్రామీణ యువతకు చేరువయ్యేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్(విద్య) డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) 49వ వ్యవస్థాపక దినోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అగర్వాల్ మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన విద్య ఉపాధి కోర్సులను గ్రామీణ యువతకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. శిక్షణ ఇవ్వడంతో పాటు గ్రామీణ యువత వ్యాపార రంగంలో రాణించేలా ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా యువతకు వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గౌరవ అతిథిగా హాజరైన వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఎ.పద్మరాజు మాట్లాడుతూ.. వ్యవసాయ డిప్లొమా కోర్సుల వల్ల విద్యార్థులు, యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందన్నారు. రైతులకు సైతం వీరి ద్వారా మేలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, సిబ్బందితో పాటు ఉత్తమ స్టార్టప్‌లు, ఉత్తమ పీపీఓలకు అవార్డులను అందజేశారు. నార్మ్ ఇంచార్జి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.రమాసుబ్రమణ్యం, జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నీరజాప్రభాకర్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీపీలు, సుధీర్‌బాబు, అవినాష్ మహంతి

సమన్వయంతో పనిచేయండి

- సీపీలకు ఉన్నతస్థాయి ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో చేపట్టిన సహాయ పునరావాస కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో సచివాలయం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ డా.జితేందర్‌లతో కలిసి కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నేరేడ్‌మెట్ కమిషనరేట్ నుంచి సీపీలు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన చోట్ల ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలని అధికారులకు సూచించారు. రోడ్ల మీద తెరిచి ఉంచిన మ్యాన్ హోల్స్ పక్కన సూచిక బోర్డులు పెట్టాలని సూచించారు. వర్షం పడే సమయంలో, అవసరం అయితేనే ప్రజలు రోడ్ల మీదకు రావాలని సూచించారు.

ప్రియురాలి మోజులో పడి భార్యను హత్య చేసిన భర్త


దస్లీ(ఫైల్)

సైదాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలి మోజులో పడిన ఓ భర్త పథకం ప్రకారం భార్యను హత్యచేసిన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం ఘాసీరాం తండాకు చెందిన రమావత్ కిషన్(47), దస్లీ(40) దంపతులు నగరానికి వలసొచ్చి సింగరేణి కాలనీలో నివాసముంటున్నారు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కిషన్ స్థానికంగా ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో దస్లీ కొంతకాలంగా కొడుకు రాకేష్(21)తో కలిసి ఘాసీరాం తండాలో ఉంటున్నది. గురువారం బ్యాంకు రుణం కోసం చింతపల్లికి రావాలని భార్యకు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె వెళ్లింది. అనంతరం బ్యాంకు రుణం డబ్బులు తీసుకుని భార్యాభర్తలు ఇద్దరు కలిసి సింగరేణి కాలనీలోని ఇంటికి వచ్చారు. మార్వాడీ దుకాణంలో కుదువపెట్టిన బంగారం విడిపించి ఇవ్వాలని భార్య అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం కిషన్ పోలీసులకు ఫోన్ చేసి తన భార్య మృతి చెందిందని తెలిపాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునే సమయంలో స్థానికులు దాడికి యత్నించారు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. తన తల్లిని తండ్రి, అతడి ప్రియురాలు, ఆమె కూతురు కలిసి హత్య చేశారని కుమారుడు రాకేష్ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతా మా ఇష్టం

దక్షిణ డిస్కంలో ఇన్‌చార్జి డైరెక్టర్ల ఇష్టారాజ్యం

కొంతమందిపై అవినీతి ఆరోపణలు ● కమర్షియల్ వింగ్‌లో నిబంధనల పేరుతో వసూళ్లు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో కొంతమంది ఇన్‌చార్జి డైరెక్టర్లు నిబంధనల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దక్షిణ డిస్కంలో పాత డైరెక్టర్లను తొలగించింది. ఒకటి, రెండు నెలల్లో రెగ్యులర్ డైరెక్టర్ల నియామకాలు పూర్తిచేయాలనే ఉద్దేశంతో ఆయా విభాగాల్లోని అధికారులనే ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమించింది. వారి నియామకం జరిగి ఆరునెలలు పూర్తవడం... కొత్త డైరెక్టర్ల నియామకంలో జాప్యం కారణంగా కొంతకాలంగా ఇన్‌చార్జి డైరెక్టర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. నెలల కొద్దీ ఫైళ్లను పెండింగ్‌లో పెడుతుండటంతో పరిపాలనా విభాగంపై ప్రభావం పడుతోంది.

నిబంధనల పేరుతో..

కమర్షియల్ వింగ్‌లో నిబంధనల పేరుతో కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నా వాటిపై ఎలాంటి విచారణ చేపట్టడం లేదు. ఇన్‌చార్జి డైరెక్టర్లున్నా ఆయా విభాగాలపై వారికి పూర్తిస్థాయిలో పట్టు లేకపోవడంతో కొంతమంది కిందిస్థాయి అధికారులు డైరెక్టర్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించిన దక్షిణ డిస్కం సీఎండీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. వారం రోజుల క్రితం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో డీఈటీ రూ.18 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. గ్రేటర్‌జోన్ పరిధిలోని పలు సర్కిళ్లలో కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులున్నా వాటిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు ప్రైవేట్ కాంట్రాక్టర్లతో కలిసి పనులు చేయకుండానే బిల్లులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా వేస్తున్న ప్రైవేట్ వెంచర్లలో విద్యుత్‌లైన్లకు ఎస్టిమేషన్లు వేసేందుకు లక్షల్లో డిమాండు చేస్తున్నారు.

హెచ్‌ఆర్‌లో 10 - 12 ఏళ్లుగా..

దక్షిణ డిస్కంలో అతి కీలకమైన హెచ్‌ఆర్ విభాగంలో కొంతమంది అధికారులు 10-12 ఏళ్లుగా ఒకేచోట పని చేస్తూ చక్రం తిప్పుతున్నారనే విమర్శలున్నాయి. పదోన్నతులు, బదిలీల అంశంపై యూనియన్లు, అసోసియేషన్ల నేతలకు ఎప్పటికప్పుడు సమాచారమిస్తూ విద్యుత్‌సంస్థల్లో గందరగోళ పరిస్థితులకు కారణమవుతున్నారు. విద్యుత్‌శాఖలో ఇంజనీర్ల బదిలీల గైడ్‌లైన్స్ రావడానికి ముందే హెచ్‌ఆర్ వింగ్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలనే డిమాండ్లు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

రెగ్యులర్ డైరెక్టర్ల నియామకంపై..

దక్షిణ డిస్కంలో పాలన గాడిలో పెట్టాలంటే రెగ్యులర్ డైరెక్టర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యుత్ సంస్థల్లో కొంతమందే పదేళ్లకాలం పాటు డైరెక్టర్లుగా కొనసాగారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు తలెత్తకుండా విద్యుత్‌సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ సీఈలను రెగ్యులర్ డైరెక్టర్లుగా నియమిస్తే వారు సర్వీసులో ఉన్నకారణంగా డిస్కంపై ఆర్థిక భారం తగ్గే అవకాశాలుంటాయని ఓ అధికారి తెలిపారు. డిస్కంలో రెండేళ్లకోసారి కొత్త డైరెక్టర్ల నియామకాలు విధిగా చేపడితే సీనియర్ సీఈలు 30 ఏళ్లపాటు పనిచేసిన సంస్థ నుంచి ఉన్నత స్థానంలో ఉద్యోగ విరమణ పొందే అవకాశాలుంటాయని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

● అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య ● గాంధీ ఆస్పత్రిలో సిద్దేశ్వర్‌ను పరామర్శించిన పలువురు నేతలు


సిద్దేశ్వర్‌ను పరామర్శిస్తున్న ఆర్.కృష్ణయ్య, కూనంనేని సాంబశివరావు తదితరులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కులగణన చేసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయడంతో పాటు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఎనిమిది రోజులుగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ మహాసభ అధ్యక్షుడు సిద్దేశ్వర్‌ను ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ హన్మంత్ రావు, బీసీ నాయకులు మల్లేశం, రవియాదవ్ తదితరులు ఆదివారం పరామర్శించి, దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ రిజర్వేషన్ పెంపు విషయంలో స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళా బిల్లులో బీసీ సబ్ కోటా ఇవ్వాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా జేఏసీ చైర్మన్ మట్టా జయంతిగౌడ్ అధ్యక్షతన ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. మహిళా బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్య, ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం మరిన్ని కఠినమైన చట్టాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, నందగోపాల్, ఉదయ్, మంజు, సుజాత, వరలక్ష్మి, శ్యామల, సుజాత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్రం

- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూకృష్ణన్
- నవంబర్ 15 నుంచి 25 వరకు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు



మాట్లాడుతున్న విజ్జూకృష్ణన్

ఆదిభట్ల, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దివాలా తీయించే ప్రయత్నం చేస్తున్నదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూకృష్ణన్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి పరిధిలోని శుభం కన్వెన్షన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 1.12 లక్షల మంది రైతులు, 3.20లక్షల మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. నవంబర్ 15 నుంచి 25 వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు, పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు అం దజేయాలని, నవంబర్ 26న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, సీనియర్ నాయకులు జంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంచందర్, మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు ముసిలయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిన శ్రీకాకుళం గిరిజన పోరాట సిద్ధాంత గ్రంథం

ముత్యం సంస్మరణ సభలో వక్తలు


డాక్టర్ కె.ముత్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంపై రాసిన సిద్ధాంత గ్రంథం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం నారాయణగూడలోని భారత్ విద్యా సంస్థల ఆడిటోరియంలో తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం సంస్మరణసభలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముత్యంపై రాసిన 'పరిశోధనా ముత్యం', 'మట్టి మనసుల కుంచె' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సంస్మరణ సభలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, ప్రముఖ సాహితీవేత్త నాళేశ్వరం శంకరం, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల పూర్వ అధ్యక్షులు తులా రాజేందర్ పాల్గొని మాట్లాడారు. మరుగున పడిన చరిత్రను ముత్యం వెలుగులోకి తెచ్చి అనేక పుస్తకాలు ప్రచురించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లింబాద్రి, భారత్ విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్. వేణుగోపాల్‌రెడ్డి, సూర ప్రభాకర్‌రెడ్డి, బండ్ల మాధవరావు, సీపీఐఎంఎల్ నాయకులు గోవర్ధన్, సాధినేని వెంకటేశ్వరరావు, మాస్‌లైన్ నాయకుడు పోటు రంగారావు, డాక్టర్ కె.ముత్యం కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటా : ఎమ్మెల్సీ కోదండరాం

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ జూనియర్ కాలేజీలలో మౌలిక సదుపాయాల కల్పన, లెక్చరర్ల వృత్తిపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ కనకచంద్రం మాట్లాడుతూ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినానికి మద్దతు ప్రకటిస్తూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శేఖర్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగదీశ్వర్, ముజీబ్, టీజీవో సత్యనారాయణ, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకమండపంలో వేదపండితులు జస్టిస్‌కు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.


కంగనా రనౌత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిక్కులు

'ఎమర్జెన్సీ' సినిమాను నిలిపివేయాలి

- సిక్కు సంఘం ప్రతినిధుల డిమాండ్

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీజేపీ ఎంపీ, సినీనటి కంగనారనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' సినిమాను నిలిపివేయాలని సిక్కు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం గౌలిగూడ గురుద్వారా వద్ద సిక్కు సంఘం ప్రతినిధులు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు కంగనారనౌత్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కంగనారనౌత్ 'ఎమర్జెన్సీ' సినిమాలో సిక్కులను తీవ్రవాదులతో పోల్చారని ఆమె వెంటనే సిక్కులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ జోక్యం చేసుకుని కంగనాను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో గౌలిగూడ గురుద్వారా అధ్యక్షుడు ఇందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి జోగిందర్‌సింగ్ బిట్టు, సిక్కు వెల్ఫేర్ అధ్యక్షుడు ఇక్బాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట గురుద్వారా ఎదుట..

అమీర్‌పేట, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): 'ఎమర్జెన్సీ' చిత్ర ప్రదర్శనను తెలంగాణలో నిషేధించేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని గురుద్వారా ప్రబంధక్ కమిటీ చైర్మన్ సర్దార్ అజిత్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిమాండ్ చేస్తూ సర్దార్ అజిత్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రబంధక్ కమిటీ మాజీ చైర్మన్ బాగీందర్ సింగ్, ప్రతినిధులు ఇందర్‌జిత్‌సింగ్ తదితరులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అమీర్‌పేట గురుద్వారా ఎదుట ఆదివారం నిరసన తెలిపారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు బస్తీలు, కాలనీలలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కొంతకాలంగా దోమలు విపరీతంగా పెరిగిపోయి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని ఆస్పత్రుల వార్డులన్నీ విషజ్వరాలతో బాధపడుతున్న వారితో కిటకిటలాడుతున్నాయి. రెండు రోజుల క్రితం గాజులరామారం సర్కిల్ సూరారం విశ్వకర్మకాలనీకి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని డెంగీకి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్‌లో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. పలు బస్తీలు, కాలనీలలో విషజ్వరాల బారినపడుతున్నా అధికారులు ధ్రువీకరించడం లేదు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. నామమాత్రంగా చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పిస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కుత్బుల్లాపూర్ ప్రాంతంలో విజృంభిస్తున్న విషజ్వరాలను కట్టడిచేసి, మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దోమలు వృద్ధిచెందకుండా చర్యలు తీసుకుంటున్నాం



కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో దోమలు వృద్ధిచెందకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు మరణాల విషయం మాదృష్టికి రాలేదు.

- వి.నర్సింహ, కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

ఇంటికే పరిమితం!

(5వ పేజీ తరువాయి)

వెల్లడించారు. ఆదివారాలు సాయంత్రం పూట కిటకిటలాడే మాల్స్ కూడా వెలవెలబోతే, రెస్టారెంట్లు, హోటల్స్ పరిస్థితి కూడా అదే రీతిలో ఉంది. దీంతో ఆదివారం నగరంలో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

పవర్‌ఫుల్ వీకెండ్‌లో పవర్ పోయే..!

జీతాలు వచ్చిన తర్వాత వచ్చిన తొలి ఆదివారాన్ని సాధారణంగా మాల్స్ లాంటివి పవర్‌ఫుల్ వీకెండ్‌గా సంబోధిస్తుంటాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరవాసులు ఇళ్లకే పరిమితం కావడంతో పవర్‌ఫుల్ వీకెండ్‌లో పవర్ పోయిందని పలు మాల్స్ ప్రతినిధులు వాపోయారు. ఫుట్‌ఫాల్ (రద్దీ) గత వీకెండ్‌తో పోలిస్తే 50%కు పైగానే తగ్గిందని ఓ మాల్ ప్రతినిధి వెల్లడిస్తే, సాధారణంగా వీకెండ్‌లో కనిపించే రద్దీతో పోలిస్తే 60%కు పైగా ఫుట్‌ఫాల్ పడిందని, వ్యాపారపరంగా 50-60%కు పైగానే కోత పడిందని మరో మాల్ ప్రతినిధి చెప్పుకొచ్చారు. తమ మాల్‌లోని సూపర్ మార్కెట్‌లో నెలారంభంలో వచ్చే వారాంతంలో రూ.22 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుందని, ఈ వారాంతంలో రూ.11 లక్షలు కూడా దాటలేదని గచ్చిబౌలిలోని ఓ మాల్ ప్రతినిధి వెల్లడించారు. నగరంలోని ఓ పేరొందిన టిఫిన్ సెంటర్‌లోనే 20% కూడా వ్యాపారం కాలేదంటే, నగరవాసులు ఎంతగా ఇంటికి పరిమితం అయ్యారు. ఆదివారమైనా ఎవరూ చికెన్, మటన్‌కు పెద్దగా రాలేదని, ఆదివారాలు తమ కౌంటర్‌కు వచ్చేవారిలో 35% కూడా ఈ రోజు రాలేదని మోతీనగర్‌లోని ఓ మటన్‌షాప్ యజమాని చెప్పుకొచ్చారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను విక్రయించే ఓ మల్టీ సిటీ స్టోర్ ప్రతినిధి మాట్లాడుతూ సాధారణంగా పవర్ వీకెండ్‌లో 30 లక్షల రూపాయల వ్యాపారం జరిగితే ఈ వారం అది 9 లక్షల రూపాయలకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. వారాంతాలలో సినిమా లేకపోతే కష్టమే అనే సినీ ప్రేమికులు కూడా ఈ వారం ఇంటికే పరిమితం కావడంతో మల్టీప్లెక్స్‌లు వెలవెలబోయాయి. ఆదివారాలలో కనిపించే క్రౌడ్‌లో 40%కు పైగా అభిమానులు ఈ వారాంతంలో డ్రాప్ అయ్యారని పలు మల్టీప్లెక్స్‌ల ప్రతినిధులు తెలిపారు.

ఆన్‌లైన్ డెలి'వర్రీ'

సాధారణంగా జోరుగా వర్షం పడుతుంటే నగరంలో బిర్యానీల ఆర్డర్లు రయ్‌మంటూ దూసుకుపోతుంటాయి. అయితే ఈసారి తగ్గాయని వెల్లడించాయి పలు ఫుడ్ డెలివరీ యాప్ సంస్థలు. వర్షాల వేళ సాధారణంగా డెలివరీ ఫీజులలో రెయిన్ ఫీజు, సర్జ్ ప్రైస్ అంటూ మూడు కిలోమీటర్ల దూరానికి కూడా 30 నుంచి 60 రూపాయలు వసూలు చేసే కొన్ని డెలివరీ యాప్‌లు ఆర్డర్లు లేక ఈ ఆదివారం రెయిన్ సర్జ్ ప్రైస్‌ను 20 రూపాయలకే పరిమితం చేస్తే, కొన్ని యాప్‌లు మాత్రం ఆఫర్లతో ఊరించాయి. అయినా నగరవాసులు ఈసారి కాస్త సంయమనం పాటించారని చెప్పుకొచ్చాడు ఓ డెలివరీ ఏజెంట్. సాధారణంగా తాను రెగ్యులర్ రోజుల్లో 700-1000 రూపాయలు పట్టుకు వెళ్తానని, ఈ రోజు వర్షం కాబట్టి కాస్త ఎక్కువ అంచనా వేశాను కానీ, అనుకున్నంత మాత్రం రాలేదని చెప్పుకొచ్చాడు. అయితే ఇన్‌స్టెంట్ డెలివరీ యాప్‌లు మాత్రం రెయిన్ ఫీజు అంటూ 30 రూపాయల వరకూ వసూలు చేయడంతో పాటు సాధారణ డెలివరీ ఫీజులు కూడా వసూలు చేశాయి.

మరో రెండురోజులు వర్షాలు..

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలకు సోమవారం ఎల్లో హెచ్చరికలు, రంగారెడ్డి జిల్లాకు ఆరెంజ్ హెచ్చరికలను వాతావరణశాఖ జారీచేసింది.

జంట జలాశయాలకు వరదనీరు



నార్సింగ్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జంట జలాశయాలకు వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం నాటికి గండిపేటలో 1781.55 అడుగుల నీరు ఉండగా, ఇన్‌ఫ్లో 3వేల క్యూసెక్కులు ఉంది. ఈ జలాశయం నీటిమట్టం మొత్తం 1790 అడుగులు. ఇక హిమాయత్‌సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1755.45 అడుగులు ఉంది. 1400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

హిమాయత్‌సాగర్‌ను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జలమండలి ట్రాన్స్‌మిషన్ సీజీఎం రవీందర్‌రెడ్డి, హిమాయత్‌సాగర్ డీజీఎం గోవింద్‌గౌడ్, గండిపేట జలాశయం డీజీఎం నరహరి, అధికారులతో కలిసి పరిశీలించారు.

కలుషిత నీరు, సివరేజీ సమస్యలపై దృష్టి

నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాటర్ బోర్డు అప్రమత్తమైంది. ఈఆర్టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను ఆయన సందర్శించారు. డివిజన్-3 పరిధిలోని మెహిదీపట్నం ఎంఎన్‌డీసీ భవనం వద్ద సివరేజీ పూడికతీత పనులను పరిశీలించారు. కలుషిత నీరు, సివరేజీ సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. మణికొండ సెక్రటేరియట్ కాలనీలో నీటి సరఫరా జరుగుతున్న సమయంలో బస్తీలో పర్యటించారు. తాగునీటి నాణ్యతను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్లోరిన్ బిళ్లలను ఇంటింటికీ పంపిణీ చేసి, వాటిని వినియోగించి నీటిని శుద్ధి చేసుకునే తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్ సైతం బండ్లగూడ, హనుమాన్‌నగర్, గోడే కె ఖబర్ సెక్షన్ పరిధిలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. మంచినీరు, మురుగునీటికి సంబంధించి సమస్యలు ఉంటే వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఔటర్‌ను సందర్శించిన హెచ్‌ఎండీఏ కమిషనర్

భారీ వర్షాల నేపథ్యంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంట నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. హెచ్‌ఎండీఏ చేపడుతున్న పనులకు ఎలాంటి ఆటంకం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ అధికారులు బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల వద్ద భారీగా నిలిచిన వరద నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.


న్యూస్ మేకర్

హృతిక్‌ను చూసి నేర్చుకున్నా

వరుస కష్టాలను తట్టుకోగలిగే గుండె ధైర్యం, వాటికి ఎదురొడ్డి పోరాడగలిగే తెగింపు ఏ కొద్దిమందికో ఉంటుంది. కేన్సర్, మెదడు టిబి, ఫ్యాటీ లివర్... ప్రాణాంతకమైన వ్యాధులన్నీ ముప్పేట దాడి చేసినా, వాటితో పోరాడి విజేతగా బయటకొచ్చింది స్టార్ హీరో హృతిక్ రోషన్ సోదరి సునైనా రోషన్. ఆమె పంచుకున్న అనుభవాలివి...

"నాన్నతో ఒక ప్రాజెక్టుకు కొ-ప్రొడ్యూసర్‌గా పని చేస్తున్న రోజులవి. పీరియడ్స్‌లో రక్తపు గడ్డలు కనిపించడంతో, ఆ విషయాన్ని అమ్మతో పంచుకున్నాను. వెంటనే డాక్టరును కలవమని అమ్మ చెప్పడంతో అదే పని చేశాను. పరీక్షల్లో నాకు గర్భాశయ ముఖద్వార లింఫోమా సోకినట్టు తేలింది. లక్షల్లో ఒకరికి సోకే ఆ కేన్సర్ నాకెందుకు వచ్చిందో అర్థం కాలేదు. అమ్మతో విషయం చెప్పాను. నమ్మలేకపోయింది. దిగ్ర్భాంతికి గురైంది. కానీ బాధపడుతూ కూర్చుంటే ప్రయోజనం ఏముంది? నాకు నా కుటుంబం ఉంది. నా కుటుంబం కోసం దృఢంగా ఉండాలని నేను ఆ క్షణమే నిర్ణయించుకున్నాను.

కేన్సర్, క్షయ, ఫ్యాటీ లివర్...

కేన్సర్ చికిత్సతో వెంట్రుకలు ఊడిపోవడమనేది సర్వసాధారణం. నాకూ అదే జరిగింది. చికిత్స మొదలుపెట్టగానే వెంట్రుకలు కుచ్చులు కుచ్చులుగా రాలిపోవడం మొదలుపెట్టాయి. ఐసియులోకి అడుగు పెట్టిన మొదట్లో 'డాక్టర్! ప్రతి కీమోతో నా జుట్టు రాలుతూనే ఉంటుందా?' అంటూ అడగడం నాకిప్పటికీ గుర్తుంది. అందుకా డాక్టర్, జుట్టంతా రాలిపోయినా చికిత్స తర్వాత తిరిగి పూర్తిగా పెరిగిపోతుందని నాకు ప్రతిసారీ భరోసా ఇస్తూ ఉండేవారు. కేన్సర్‌ని తేలికగానే పసిగట్టి, చికిత్సతో దాని నుంచి బయటపడగలిగాను. కానీ మెదడు టిబిని మాత్రం ప్రారంభంలో కనిపెట్టలేకపోయాను. క్షయ ఊపిరితిత్తులకే పరిమితం అనే భ్రమలో ఉంటాం. కానీ అది శరీరంలోని వేర్వేరు అవయవాలకు కూడా సోకుతుందని ఆలస్యంగా తెలిసింది. తల తిరగడం, అయోమయం మొదలైన లక్షణాలను నేను టిబికి ఆపాదించుకోలేదు. దాంతో వ్యాధి నిర్ధారణ ఆలస్యమైంది. చివరకు మెదడుకు టిబి సోకిందని తేలడంతో షాక్‌కు గురయ్యాను. చికిత్స తీసుకుని ఈ వ్యాధిని కూడా అదుపులోకి తెచ్చుకున్నాను. అయితే చాలా మంది టిబిని అంటువ్యాధిగా పరిగణిస్తారు. దగ్గు, ఆయాసం, బరువు తగ్గడం లాంటి లక్షణాలను క్షయ లక్షణాలుగా భావిస్తారు. కానీ నా విషయంలో ఈ లక్షణాలేవీ లేవు. పైగా నాది అంటువ్యాధి కూడా కాదు.

> టిబి, కేన్సర్‌తో పోరాడుతూనే మధుమేహం, స్లీప్ ఆప్నియా, అధిక రక్తపోటులను కూడా అదుపులో ఉంచుకోవలసి వచ్చింది. బాగా బరువు కోల్పోయాను. చికిత్సల వల్లే బరువు కోల్పోతున్నానని అనుకున్నానే తప్ప, మరొక సమస్య కాలేయాన్ని ఛిద్రం చేస్తోందని తెలుసుకోలేకపోయాను.

మాది ఫైటర్ల కుటుంబం

టిబి, కేన్సర్ లాంటివి పెద్ద వ్యాధులు. వీటితో పోరాడుతూనే మధుమేహం, స్లీప్ ఆప్నియా, అధిక రక్తపోటులను కూడా అదుపులో ఉంచుకోవలసి వచ్చింది. బాగా బరువు కోల్పోయాను. తీసుకుంటున్న చికిత్సల వల్లే బరువు కోల్పోతున్నానని అనుకున్నానే తప్ప, మరొక సమస్య కాలేయాన్ని ఛిద్రం చేస్తోందని తెలుసుకోలేకపోయాను. 3వ గ్రేడ్ ఫ్యాటీ లివర్ హఠాత్తుగా బయల్పడింది. వ్యాధి ముదిరి సిర్రోసిస్‌కు చేరుకుంటే, కాలేయాన్ని ఆరోగ్యకరంగా మార్చడం చాలా కష్టం. ఎన్నో ప్రాణాంతక వ్యాధులతో పోరాడి గెలిచిన నాకు ఇదొక పెద్ద సమస్యలా అనిపించలేదు. పట్టుదలగా ఆహార నియమాలు పాటిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తూ మూడవ గ్రేడ్ ఫ్యాటీ లివర్‌ను మొదటి గ్రేడ్‌కు తీసుకొచ్చాను. ఇన్ని ఆరోగ్య సమస్యలున్న నా మీద ఎంతో మంది జాలి చూపిస్తూ ఉంటారు. నన్నొక బాధితురాలిగా పరిగణిస్తూ ఉంటారు. కానీ నన్ను నేను బాధితురాలిగా కాకుండా సర్వైవర్‌గా పరిగణిస్తాను. అమ్మ, నాన్న, తమ్ముడు హృతిక్ రోషన్‌ల నుంచే నేను ఫిట్‌నెస్ ప్రేరణ పొందుతూ ఉంటాను. మా కుటుంబ సభ్యులందరూ తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. నాన్న కూడా గొంతు కేన్సర్‌తో పోరాడారు. తమ్ముడు హృతిక్ ప్రమాదానికి గురై, సబ్‌డ్యురల్ హెమటోమాతో బాధపడి, చివరకు సర్జరీ చేయించుకున్నాడు. అయినా థెరపీలు, వ్యాయామాలతో తక్కువ సమయంలోనే పూర్తిగా కోలుకున్నాడు. తమ్ముడిని చూసి నేనెంతో నేర్చుకున్నాను. నేనిలా ఫిట్‌నెస్ జర్నీలోకి అడుగు పెడతానని ఎప్పుడూ అనుకోలేదు. వీల్‌చైర్‌లో కూర్చునే స్థితికి దిగజారకూడదని నేనెప్పుడూ కోరుకుంటూ ఉంటాను. వయసు పైబడిన తర్వాత ఇంకొకరి మీద ఆధారపడడం నాకిష్టం లేదు. కాబట్టే పట్టుదలగా ఆరోగ్య సమస్యన్నిటినీ పరిష్కరించుకుని, పూర్తి ఆరోగ్యవంతురాలినయ్యాను."

వైవిధ్యం వైపు పయనం

సుదీర్ఘ ప్రేమ ప్రయాణం తరువాత ప్రియుడు జహీర్ ఇక్బాల్‌ను పెళ్లాడిన సోనాక్షి సిన్హా... అటు జీవితంలోనే కాదు... ఇటు కెరీర్ పరంగానూ నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. మొన్నటివరకు కమర్షియల్ చిత్రాలతో అలరించిన ఆమె... ఇప్పుడు కంటెంట్ ఉన్న కథలకు కటౌట్ అయింది. సంజయ్‌లీలా బన్సాలీ 'హీరామండీ' వెబ్‌సిరీస్‌తో మరో విజయాన్ని అందుకున్న సోనాక్షి అనుభవాలివి.

చాలా నేర్చుకున్నా...

'హీరామండీ' షూటింగ్ నాకు మధుర జ్ఞాపకాలు ఎన్నింటినో మిగిల్చింది. ముఖ్యంగా దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఆయన ఒక ఎన్‌సైక్లోపీడియా. సెట్‌లో ఉన్నంతసేపూ తన పనితనాన్ని చూస్తూ ఉండిపోయా. గతంతో పోలిస్తే ఒక నటిగా ఇప్పుడు నేను మరింత సహనంగా, నిలకడగా, మానసికంగా దృఢంగా మారాను. సంజయ్‌తో కలిసి పని చేయడం ఒక అద్భుతమైన అనుభవం. అలాగే 'హీరామండీ' ప్రతిష్టాత్మక 'బూసన్ ఫిలిమ్ ఫెస్టివల్‌'కు నామినేట్ అవ్వడం నాకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది.





దేనికదే వైవిధ్యం...

నా కెరీర్ మొదలైంది కమర్షియల్ చిత్రాలతో. కానీ ఇప్పుడు 'దహాడ్, హీరామండీ' లాంటి కంటెంట్ ప్రాధాన్యంగల పాత్రలనే ఒప్పుకొంటున్నా. వీటిల్లో నేను పోషించిన రోల్స్ దేనికదే ప్రత్యేకం, విభిన్నం. ఒక నటిగా ఇలాంటి ప్రాజెక్టులు నాకు ఉత్సాహాన్నిస్తాయి. 'అకీరా' సినిమా నుంచి ఇలా ఒకదానితో ఒకటి సంబంధం లేని వైవిధ్యమైన పాత్రలు ఎంచుకొంటూ వస్తున్నా. 'డబుల్ ఎక్స్‌ఎల్' కావచ్చు... లేదంటే 'హీరామండీ' కావచ్చు... అలాంటివే. ఈ వైవిధ్యమే ఒక విజయవంతమైన నటిగా నన్ను నడిపిస్తోంది.

> **అత్యంత చెత్త సలహా...**
>
> కెరీర్‌లో ఎవరికైనా ఎత్తుపల్లాలు ఉంటాయి. క్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయి. వాటి నుంచి బయటపడటానికి స్నేహితులు, సన్నిహితులు తోచిన సలహాలు ఇస్తుంటారు. అలా నాకు వచ్చిన వాటిల్లో అత్యంత చెత్త సలహా ఒకటుంది. అదేంటంటే... 'ఒకవేళ నీ సినిమాలు బాగా ఆడకపోతే ఇక నటించకుండా ఇంట్లో కూర్చో. సరైన ప్రాజెక్ట్ వచ్చేవరకు వేచివుండు' అని సహనటులు ఒకరు సూచించారు. నా దృష్టిలో అది పనికిమాలిన సలహా. నేను పాటించలేదనుకోండి. ఖాళీగా కూర్చుంటే దేనికీ పరిష్కారం లభించదు కదా!

ఆ ప్రోత్సాహమే...

నాడు కమర్షియల్ చిత్రాల్లో నటించిన అనుభవమే నేడు వైవిధ్యభరిత పాత్రలు పోషించడానికి కావల్సిన ప్రోత్సాహాన్ని, బలాన్ని ఇచ్చింది. 'రౌడీ రాథోడ్, సన్ ఆఫ్ సర్దార్' ప్రాజెక్టులు సగంలో ఉండగా... 'లుటేరా' షూటింగ్ పూర్తయింది. అది నా కెరీర్ ఆరంభంలో చేసిన సినిమా. ఇక అక్కడి నుంచీ ఏదైనా కొత్తగా చేయాలని అనుకున్నాను. ఒక దర్శకుడు నన్ను ఏ ప్రాజెక్ట్‌లో అయినా, ఏ జోనర్ రోల్‌కు అయినా తీసుకోగలగాలి. పాత్రల మధ్య అలాంటి వైవిధ్యాన్ని నేను కోరుకున్నాను. అప్పటి నుంచి ఆ దిశగా ప్రయత్నం చేస్తూ వస్తున్నాను. బహుశా ప్రేక్షకులు ఇప్పటికీ ఈ విషయాన్ని గ్రహించి ఉంటారు.

అవేవీ పట్టించుకోను...

పదిహేనేళ్ల కెరీర్‌లో నాకు నేను పెట్టుకున్న నియమం... నా చుట్టూ ఎవరేం మాట్లాడుకున్నా పట్టించుకోకూడదని. చేసే పని మీద మనసు లగ్నం చేయాలని. ఇదే అనుసరిస్తూ వస్తున్నా. తల ఎత్తకుండా మన పని మనం చేసుకొంటూ వెళితే... ఒక రోజు అదే మనల్ని లక్ష్యానికి చేరుస్తుందనేది నా నమ్మకం.



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
4. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
5. ఆయీ నై (స్త్రీ-2)
6. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
7. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
8. హీర్ ఆస్మానీ (ఫైటర్)
9. తేరీ బాతోమే (తేరీ బాతోమే ఐసా ఉల్ఝా జియా)
10. నైనా (క్రూ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

పిల్లల్ని కొడుతున్నారా?



క్రమశిక్షణ కోసం లేదా శిక్షించటం కోసం...దేనికోసమైనా పిల్లల్ని కొట్టడం అనేది పెంపకంలో భాగమైపోయింది. తక్షణ ఫలితం రాబట్టడం కోసం కొడుతున్నామని అంటున్నారా? అయితే వెంటనే ఆ పని మానుకోండి. దెబ్బ చిన్నదైనా, పెద్దదైనా అది పిల్లల మనసు మీద శాశ్వత ప్రభావం చూపిస్తుంది. కాబట్టి పిల్లల్ని కొట్టే ముందు ఈ కింది విషయాల గురించి ఆలోచించండి.

సంప్రదాయాల్ని పాటించడం: పిల్లల్ని కొట్టడం అనేది మీ ఇంట్లో సంప్రదాయంగా వస్తోందా? మీ నాన్నని మీ తాతయ్య, మిమ్మల్ని మీ నాన్న మందలించటానికి అదే పద్ధతిని అనుసరించారు కాబట్టి మీరూ దాన్నే ఫాలో అవుతున్నారా? అలాగైతే పెద్దయ్యాక మీ పిల్లలు కూడా తమ మాట వినేలా చేయటం కోసం వాళ్ల పిల్లల్ని ఇలానే దండిస్తారు.

వయసులో పెద్దవారైతే చాలా?: పిల్లలు విమ్మల్ని ఎదిరించలేరు, బలహీనులని వాళ్లని కొట్టడానికి మీరు వెనకాడటం లేదా? ఇదే మీ ఉద్దేశమైతే పెరిగి పెద్దయ్యాక మీ పిల్లలు కూడా తాము చెప్పిందే కరెక్టని ఒప్పించటం కోసం కొట్టడాన్నే సాధనంగా వాడతారు.

అనుబంధాలకు బీటలు: పిల్లలకు మీకు మధ్య ఎంతటి అనుబంధమున్నా కొట్టడంతో ఆ బంధం బీటలు బారుతుంది. ఆ దూరం శాశ్వతంగా ఉండిపోతుంది.

రిలేషన్‌షిప్ సమస్యలు: తల్లితండ్రుల చేతుల్లో దెబ్బలు తింటూ పెరిగిన పిల్లలు తమ జీవితాల్లో రిలేషన్‌షిప్ సమస్యల్ని ఎదుర్కొంటారు. తమను కొట్టే తల్లితండ్రుల్ని నమ్మనట్టే ఎవర్నీ వాళ్లు నమ్మలేరు.

ఏ విటమిన్ ఎందుకోసం?

అవగాహన

ఎటువంటి రోగకారక క్రిముల ప్రమేయం లేకుండా అనారోగ్యానికి గురయ్యామంటే అందుకు 'విటమిన్ డెఫిసియన్సీ' కారణం. ఈ లోపాన్ని పూరించాలంటే సమతులాహారం తీసుకోవటంతోపాటు విటమిన్ల లోపంతో తలెత్తే రుగ్మతల కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి.



విటమిన్ ఎ: ఎదుగుదల, రోగనిరోధక శక్తి, కంటిచూపుకు అవసరం. ఎ విటమిన్ లోపంవల్ల ఈ అంశాలకు సంబంధించిన బలహీనతలు తలెత్తుతాయి. మరిముఖ్యంగా కంటి చూపు మందగించటం, రేచీకటిలాంటి సమస్యలు బాధిస్తాయి.

విటమిన్ బి1: ఈ విటమిన్ డెఫిసియన్సీ వల్ల 'బెరిబెరి' రుగ్మత బాధిస్తుంది.

విటమిన్ బి5: పారాస్థీసియా అనే సమస్య తలెత్తుతుంది.

విటమిన్ బి7: పునరుత్పత్తి, వెంట్రుకలు, చర్మ సంబంధ సమస్యలు వేధిస్తాయి.

విటమిన్ బి12: అనీమియా బారిన పడే ప్రమాదం ఉంది.

విటమిన్ సి: బలహీనత, బరువు తగ్గటం, ఒళ్లు నొప్పులు, స్కర్వీ సమస్యలు వేధిస్తాయి.

విటమిన్ డి: రికెట్స్, ఎముకల సమస్యలు.

విటమిన్ ఇ: నరాల సమస్యలు

విటమిన్ కె: రక్తం గడ్డకట్టే సమస్యలు, ఎముకలు గుల్లబారటం.

దిక్సూచి
DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

విపత్తు నిర్వహణ చట్టం (2005) సవరణ బిల్లు 2024

భౌగోళికంగా ఎన్నో వైవిధ్యతలు కలిగి ఉంది భారతదేశం. ఈ వైవిధ్యతలపరంగా ఎన్ని అనుకూలతలున్నాయో, వైపరీత్యాల రూపంలో అన్ని ప్రతికూలతలూ పొంచి ఉన్నాయి. ప్రకృతి జనిత, మానవ కారకంగా విభజించే వైపరీత్యాలను పూర్తిగా అడ్డుకోలేకపోయినా ముందస్తు సంసిద్ధత, అంచనా, రక్షణ చర్యల ద్వారా చాలా వరకూ వాటి ప్రభావాలను తగ్గించవచ్చు.

ఈ లక్ష్యాలతోనే 2005లో విపత్తు నిర్వహణా చట్టం తీసుకువచ్చారు. అయితే ఆ చట్టాన్ని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందిన కొన్ని సిఫార్సుల మేరకు ఇటీవల లోక్‌సభలో విపత్తు నిర్వహణాచట్టం(2005) సవరణ బిల్లు-2024 ప్రవేశపెట్టింది.

చట్ట సవరణ ప్రతిపాదనలు

● **టాస్క్‌ఫోర్స్ ఆన్ ది రివ్యూ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ప్రతిపాదనలు:** విపత్తు నిర్వహణ చట్టం 2005ను మూల్యాంకనం చేసి, మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే సిఫార్సుల కోసం 2010లో డాక్టర్ పి.కె.మిశ్రా అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ దేశ విదేశాల్లోని విపత్తు నిర్వహణ చట్టాల తీరుతెన్నులను పరిశీలించి, భారతదేశంలో గత విపత్తు అనుభవాలను విశ్లేషించింది. వీటి ఆధారంగా భారత విపత్తు నిర్వహణ చట్టంలో తీసుకురావాల్సిన సవరణలను సిఫార్సు చేస్తూ 2013లో తన నివేదికను సమర్పించింది. ప్రస్తుతం తీసుకువచ్చిన చట్ట సవరణ బిల్లుకు ఈ టాస్క్‌ఫోర్స్ నివేదికే చాలావరకూ మూలాధారం. టాస్క్‌ఫోర్స్ నివేదించిన కొన్ని కీలక సవరణలు కిందివిధంగా ఉన్నాయి.

1. విపత్తు ప్రతిస్పందన అనేది క్షేత్రస్థాయిలో మొట్టమొదటగా జరుగుతుంది. స్థానికులే తొలిగా స్పందిస్తారు. కాబట్టి విపత్తు నిర్వహణ బాధ్యతలు, అధికారాలు క్షేత్రస్థాయికి విస్తరించాలి. నిధుల కేటాయింపు వికేంద్రీకరించాలి. వాటిని వ్యయం చేసే విచక్షణ అధికారాలు సైతం బదిలీ చేయాలి.
2. అన్ని రాష్ట్రాల్లో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎస్‌డీఎంఏ)ల ఏర్పాటు జరగాలి. నేటి పట్టణీకరణ వేగవంతమైన నేపథ్యంలో పెరుగుతున్న పట్టణ ఉపద్రవాల దృష్ట్యా పట్టణస్థాయిల్లో కూడా విపత్తు నిర్వహణ అథారిటీల ఏర్పాటు జరగాలి.
3. గతంలో సంభవించిన విపత్తులు, కేంద్ర, రాష్ట్రస్థాయుల్లో ఉన్న సంసిద్ధత సంబంధిత సమస్త సమాచారం డేటా బేస్ రూపంలో నిర్వహించాలి.
4. కేంద్ర, రాష్ట్రస్థాయుల్లో విపత్తు నిర్వహణ ప్రణాళికలను రచించే అధికారం ఎగ్జిక్యూటివ్ కమిటీల నుంచి కేంద్ర-రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీల నుంచి కేంద్ర-రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీలకు(ఎన్‌డీహెచ్‌ఏ-ఎస్‌డీఎంఏలకు) బదిలీ చేయాలి.
5. టాస్క్‌ఫోర్స్ సంప్రతింపుల మేరకు లా కమిషన్ చేసిన సూచనలైన 'విపత్తు' నిర్వచనాన్ని పునఃసమీక్షించడం, మానవ కారక విపత్తులను విస్పష్టంగా వర్గీకరించడం, నిర్లక్ష్యంతో విపత్తుకు(మానవ జనిత) కారణమైన వారికి, విపత్తు నిర్వహణలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన వారికి పెనాల్టీలు విధించడం, విపత్తు నిర్వహణ చట్టం ద్వారా ఏర్పడ్డ సంస్థలకు రాజ్యాంగబద్ధత/ చట్టబద్ధత కల్పించడం వంటి అంశాలను కూడా ఈ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేకంగా సిఫార్సు చేసింది.
6. విపత్తుల సమయంలో పౌర బాధ్యతలు, విధులు, హక్కు ల గురించి స్పష్టంగా పేర్కొంటూ చట్టసవరణ జరగాలి.
7. గుజరాత్ విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 28 నుంచి 31 వరకూ ప్రైవేటురంగ బాధ్యత, విధుల గురించి పేర్కొన్నవిధంగా జాతీయ విపత్తు నిర్వహణ చట్టంలో కూడా ఆ అంశాలను చేర్చుతూ సవరణ జరగాలి.
8. విపత్తు సమయంలో వాలంటీర్ల సేవలు కీలకం. అటువంటి వాలంటీర్ల భాగస్వామ్యాన్ని పెంపొందింపచేసే ప్రోత్సాహకాలను చట్టంలో ప్రవేశపెట్టాలి.
9. విపత్తు నిర్వహణలో భాగస్వాములైన వివిధ సంస్థలు, కమిటీల విధులు, బాధ్యతలు స్పష్టంగా వర్గీకరించాలి.

15వ ఆర్థికసంఘం ప్రతిపాదనలు: విపత్తు నిర్వహణ చట్టం సమూలంగా సంస్కరించాలి. అభివృద్ధి పథకాలకు విపత్తు నిర్వహణ కార్యక్రమాలకు అనుసంధానత ఏర్పర్చాలి.

విపత్తు నిర్వహణ చట్టం(2005) సవరణ బిల్లులోని కీలకాంశాలు





● **విపత్తు నిర్వహణ నిర్వచన విస్తరణ:** విపత్తు ప్రమాద కుదింపు అనే పదాన్ని విపత్తు నిర్వహణ నిర్వచనంలోకి ఈ బిల్లును చేర్చారు. తద్వారా విపత్తుల కారకాలను విశ్లేషించడం, వాటిని ఒక క్రమపద్ధతిలో ఎదుర్కోడానికి, దుర్బలత్వాన్ని తగ్గించడానికి, ప్రమాద తీవ్రతను కుదించడానికి, సంసిద్ధతను పెంపొందించడానికి మరింత అవకాశం ఉంటుంది. అదేవిధంగా సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా విపత్తు ప్రమాదం, తరలింపు, పునరావాసం, పునర్నిర్మాణం వంటి వాటికి సరికొత్త నిర్వచనాలు ఇచ్చారు.

● **పట్టణ విపత్తు నిర్వహణపై ప్రత్యేక దృష్టి:** ప్రతి రాష్ట్ర రాజధానిలో, మున్సిపల్ కార్పొరేషన్లు గల పట్టణాల్లోనూ విపత్తు నిర్వహణకు 'అర్బన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(పట్టణ విపత్తు నిర్వహణా అథారిటీ)'ల ఏర్పాటును ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. ప్రణాళికా రహితంగా విస్తరించిన పట్టణాలు, తరచూ సంభవిస్తున్న పట్టణ విపత్తుల నేపథ్యంలో ఈ బిల్లులో ప్రధానంగా ఈ అంశాన్ని చేర్చారు.

● **జాతీయ, రాష్ట్రస్థాయి విపత్తు సమాచార డేటాబేస్ నిర్మాణం:** విపత్తుల అంచనా, నిధుల కేటాయింపు, వ్యయాలు, విపత్తు సంసిద్ధత, ఉపశమన వ్యూహాలు, విపత్తు రకాలు, తీవ్రతలను బట్టి వర్గీకరణ చేసిన రిస్క్ రిజిస్టర్‌లతో కూడిన ఒక డేటాబేస్‌ను కేంద్ర, రాష్ట్రస్థాయుల్లో నిర్వహించడాన్ని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఈ సమాచారం విపత్తు నిర్వహణ ప్రణాళికలు, కార్యక్రమాల రూపకల్పనకు ఆధారభూతంగా ఉంటుంది.

● **భవిష్యత్ ప్రమాదాల అంచనా:** ప్రస్తుతానికి సంభవించకపోయినా భవిష్యత్తులో సంభవించే అవకాశం గల విపత్తుల అంచనాలకు, తదనుగుణ సంసిద్ధతకు పూనుకొనేలా జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీకి ఈ బిల్లు అధికారాలు కల్పిస్తోంది. వాతావరణ మార్పులు పెచ్చుమీరుతున్న దరిమిలా పొంచి ఉన్న నూతన విపత్తుల దృష్ట్యా ఈ అంశాన్ని ప్రధానంగా చేర్చారు.

● **నిపుణుల, అనుభవజ్ఞుల సేవలు, సలహాలకు ఆస్కారం:** కాలానుగుణంగా విపత్తులకు సంబంధించిన వివిధ అంశాల అంచనాలకు, భవిష్యత్తు సంభావ్య విపత్తులను పసిగట్టడానికి ఆయా రంగాల్లో నిపుణులను, కన్సల్టెంట్‌లను నియమించుకునే అధికారాన్ని ఈ బిల్లు ఎన్‌డీఎంఏకు కల్పిస్తోంది. అదేవిధంగా నిర్దిష్ట కాల అవధుల్లో దేశవ్యాప్తంగా విపత్తు ప్రమాద అంచనాల తయారీ బాధ్యతను కూడా ఎన్‌డీఎంఏకు ఈ బిల్లు నిర్దేశిస్తోంది.

● 2005 నాటి విపత్తు నిర్వహణ చట్టానికన్నా ముందే ఏర్పడి క్రియాశీలంగా పనిచేస్తున్న 'నేషనల్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ కమిటీ', 'హై-లెవల్ కమిటీ'ల వంటి వాటికి చట్టబద్ధ సంస్థల గుర్తింపును ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

● **విపత్తు నిర్వహణ ప్రణాళికా బాధ్యతల బదలాయింపు:** జాతీయ, రాష్ట్రస్థాయుల్లో విపత్తు ప్రణాళికలను రచించే బాధ్యతలను ఇప్పటివరకూ జాతీయ కార్యనిర్వాహక కమిటీ, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీలు చేపడుతున్నాయి. ఈ బిల్లు ప్రకారం ఆ బాధ్యతలు జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీలకు బదలాయిస్తారు. తద్వారా విపత్తు నిర్వహణను మరింత వికేంద్రీకరించే అవకాశం ఉంది.

● **రాష్ట్రస్థాయి విపత్తు ప్రతిస్పందనా దళాల ఏర్పాటు:** ఈ బిల్లు ప్రకారం ప్రతి రాష్ట్రప్రభుత్వం రాష్ట్రస్థాయిల్లో విపత్తు ప్రతిస్పందన దళాలను ఏర్పాటు చేసి అన్ని అంశాల్లో కేంద్ర విపత్తు ప్రతిస్పందన దళాల వలే తర్ఫీదును అందించాల్సి ఉంటుంది. కేంద్ర విపత్తు ప్రతిస్పందన దళాల తోపాటూ స్థానికంగా ఇవి కూడా విపత్తు ప్రతిస్పందనలో పాల్గొంటాయి.

● **న్యాయవ్యవస్థ ప్రాధికార పరిధి కుదింపు:** విపత్తు నిర్వహణ చట్టంలోని అంశాలకు సంబంధించిన కార్యాచరణలపై వ్యాజ్యాలను స్వీకరించకుండా సుప్రీంకోర్టు హైకోర్టుల ప్రాధికార పరిధిని(విపత్తు నిర్వహణ చట్టానికి సంబంధించి) ఈ బిల్లు కుదిస్తోంది. అదేవిధంగా ప్రభుత్వ అధికారులకు విపత్తు నిర్వహణ చర్యల సందర్భంగా కొన్ని లీగల్ ప్రొసీడింగ్స్ నుంచి మినహాయింపును ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

● **జరిమానా విధింపు అధికారాలు:** విపత్తు ప్రభావాలను తగ్గించే దృష్ట్యా ప్రభుత్వం ఏదైనా పనిచేయమని గానీ, వద్దని గానీ నిర్దేశిస్తే అలాంటి సూచనలను పాటించని వ్యక్తులకు పదివేల రూపాయల వరకూ జరిమానా విధించే అధికారాన్ని ఈ బిల్లు సెక్షన్ 60(ఏ) ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తోంది.

● **మానవ జనిత విపత్తులపై స్పష్టత:** అల్లర్లు, హింస వంటి వాటి వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టాలను మానవ జనిత విపత్తుల నుంచి వినహాయించి శాంతిభద్రతల సమస్యలను విపత్తుల నుంచి వేరుచేసింది. అయితే ప్రతిపక్షాలు ఈ బిల్లు ప్రవేశపెట్టిన విధానం గురించి, స్పష్టత కొరవడిన అంశాల గురించి విమర్శలు లేవనెత్తుతున్నాయి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో)

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
సోమవారం • 2 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్‌లో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు, తెలుగు చలన చిత్రానికి సంబంధించిన వేడుక. కెరీర్ పరంగా అరుదైన రికార్డు బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్ గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. తండ్రి చేసిన పాత్రలు బాలయ్య వేస్తూ ప్రేక్షకులను మెప్పించడం మామూలు విషయం కాదు. తండ్రికి తగ్గ తనయుడిగా ఆయన తన ప్రత్యేకత చాటుకున్నారు. నేను 'ఇంద్ర'సినిమా చేయడానికి సమరసింహారెడ్డి చిత్రం కారణం. బాలయ్యతో కలిసి ఒక ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది. మా



బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

చిరంజీవి

కోసం అభిమానులు గొడవ పడుతుంటారు. అందుకే మా మధ్య ఎటువంటి మంచి బంధం ఉంటుందో అభిమానులకు తెలియడం కోసం కొన్ని వేడుకలు చేసుకునేవాళ్లం. అప్పటినుంచి మా అభిమానులు కూడా కలిసి కట్టుగా ఉంటున్నారు. మా ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా బాలయ్య తప్పకుండా వస్తారు. అందరం కలిసి డ్యాన్స్ కూడా చేస్తాం. 50 ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా హీరోగా నటిస్తున్న ఘనత బాలయ్యకే సొంతం. భగవంతుడు ఆయనకు ఇదే ఎనర్జీ ఇస్తూ వందేళ్లు చల్లగా చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు.

డాక్టర్ మోహన్‌బాబు మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి నటిస్తున్న విభిన్నమైన, విశిష్టమైన నటుడు బాలయ్య. 500 రోజులకు పైగా ఒక సినిమా ఆడటం అనే ఘనత బాలయ్యదే. మూడు సార్లు హిందూపూర్ ఎంఎల్‌ఏగా ఎన్నికవడం చాలా ఆనందకరం' అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తు పెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. తండ్రి ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే తత్వం ఉన్న వ్యక్తి' అని ప్రశంసించారు.

శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ 'మేమంతా కుటుంబ సభ్యులం. ఆయనకు తమ్ముడు లాంటి వాడిని. ఆయనతో కలిసి ఒక్క సినిమాలో నటించినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది' అన్నారు.

'ఎన్టీఆర్‌గారి కుటుంబం నుంచి వచ్చి తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు బాలయ్య. యాభై ఏళ్ల మీ ప్రయాణం ఎంతో మందికి ఆదర్శం' అన్నారు వెంకటేశ్.

చివరిగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఈ రోజు ఇంతమంది అభిమానులు, నా తోటి నటీనటులు ఇక్కడికి వచ్చినందుకు ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు. నాకు జన్మను ఇచ్చిన తల్లి తండ్రులకు కృతజ్ఞతలు. నాకు ఇంతటి అభిమానాన్ని ఇచ్చిన మీ అందరినీ గుండెల్లో పెట్టుకుంటాను. అలాగే నా కుటుంబ సభ్యులైన నిర్మాతలు, దర్శకులు, నటులు, సాంకేతిక నిపుణులు, నా ఆస్పత్రి సిబ్బంది, హిందూపూర్ ప్రజలు, నా అభిమానులు ఇంతమంది కలిసి ఈ వేడుకను ఇంత గొప్పగా చేసినందుకు పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. దీనికి వెనుక ఉండి నడిపించిన మా అసోసియేషన్, నిర్మాతల మండలి, ఛాంబర్ తదితర సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు. నేను నా తండ్రి నుండి నేర్చుకున్నది నటన మాత్రమే కాదు. క్రమశిక్షణ, సంస్కారం. అలాగే అక్కినేని నాగేశ్వరరావు గారి నుండి ఎంతో నేర్చుకున్నాను. మేము అందరం చలన చిత్ర పరిశ్రమలో పోటీగా నటిస్తూ ఉన్నప్పటికీ ఆరోగ్య పరమైన పోటీ మాత్రమే మా మధ్య ఉంటుంది. అలాగే నేను సినిమాలతో పాటు రాజకీయ, వైద్య సేవ రంగాలలో కూడా ఇలా ఉన్నాను అంటే దానికి కారణమైన ప్రతి ఒక్కరికీ రుణపడిఉంటాను. అలాగే నా భార్య వసుంధరకు ప్రత్యేక ధన్యవాదాలు' అన్నారు.

ఈ కార్యక్రమంలో నందమూరి కుటుంబ సభ్యులతోపాటు టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణంరాజు, కె. రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, విజయ్ దేవరకొండ, అడవి శేష్, మాలాశ్రీ, నవీన్, రవిశంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ, విశ్వక్ సేన్, ఉపేంద్ర, ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.



లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.



2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

● తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత ● మద్దతు పలికిన సినీ ప్రముఖులు

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుంద'ని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హార్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.



సున్నా నుంచి 35 మార్కులు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ 'తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

ఇన్ ప్రోగ్రెస్

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్సిక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





నిషద్‌కు రజతం

పారాలింపిక్స్

హైజంప్‌లో రెండోస్థానం

200 మీ. రేసులో ప్రీతికి కాంస్యం



షట్లర్లకు మూడు పతకాలు ఖరారు

ఫైనల్లో నితేశ్, సుహాస్

పారిస్: పారాలింపిక్స్‌లో నాలుగో రోజు పతకం లేకుండానే ముగుస్తుందనుకున్న వేళ.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మన అథ్లెట్లు రెండు మెడల్స్‌తో శభాష్ అనిపించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల హైజంప్ టీ47 ఈవెంట్‌లో స్టార్ అథ్లెట్ నిషద్ కుమార్ రజతంతో మురిపించాడు. నిషద్ 2.04 మీటర్ల ఎత్తులో జంప్ చేయడంతో పాటు సీజన్ బెస్ట్ మార్క్‌ను నమోదు చేశాడు. నిషద్‌కు ఇది రెండో పారాలింపిక్ పతకం. 2020 టోక్యో గేమ్స్‌లోనూ అతను రజతం అందుకున్నాడు. కాగా, ఓవరాల్‌గా పారాహైజంప్‌లో భారత్‌కిది ఏడో పతకం. ఇదే పోటీలో పాల్గొన్న రామ్ పాల్ మాత్రం 1.95మీ.తో ఏడో స్థానంలో నిలిచాడు. మరోవైపు మహిళల 200మీ. టీ35లో ప్రీతి పాల్ కాంస్యం సాధించింది. దీంతో ఈ క్రీడల్లో భారత్ ఖాతాలో ఓ స్వర్ణం, 2రజతాలు, 4 కాంస్యాలు చేరాయి.


నితేశ్


సుహాస్

రాకెట్ రయ్‌మంటూ..

పారాలింపిక్స్‌లో నాలుగో రోజు భారత షట్లర్ల హవా సాగింది. తమదైన ప్రదర్శనతో దేశానికి కనీసం మూడు రజత పతకాలు ఖాయం చేశారు. ఆదివారం జరిగిన పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో నితేశ్ కుమార్, సుహాస్ యతిరాజ్ తమ విభాగాల్లో తుది పోరుకు అర్హత సాధించారు. మొదట జపాన్ షట్లర్ డైసుకె ఫుజిహరతో జరిగిన ఎస్ఎల్3 కేటగిరీ సెమీస్‌లో నితేశ్ 21-16, 21-12 తేడాతో సునాయాసంగా గెలిచాడు. సోమవారం జరిగే ఫైనల్లో డానియెల్ బెథెల్ (గ్రేట్ బ్రిటన్)తో నితేశ్ తలపడతాడు. ఫైనల్లో ఓడినా అతనికి కనీసం రజతం దక్కుతుంది. ఐఐటీ మండి గ్రాడ్యుయేట్ అయిన 29 ఏళ్ల నితేశ్‌కు పారాలింపిక్స్‌లో ఇదే తొలి పతకం కానుంది. కాగా, టోక్యో పారాగేమ్స్‌లో ఇదే విభాగం నుంచి ప్రమోద్ భగత్ స్వర్ణం గెలిచాడు. అలాగే ఎస్ఎల్4 కేటగిరీలో జరిగిన మరో సెమీఫైనల్స్‌లో సుహాస్ యతిరాజ్ తన సహచర షట్లర్ సుకాంత్ కదమ్‌పై 21-17, 21-12 తేడాతో గెలిచాడు. యూపీ ఐఏఎస్ అధికారిగా ఉన్న సుహాస్ ఖాతాలో మరో పారాలింపిక్ మెడల్ చేరనుంది. టోక్యో గేమ్స్‌లో తను రజతం సాధించిన విషయం తెలిసిందే. ఇక, మహిళల సింగిల్స్ ఎస్‌యూ 5 విభాగంలోనూ ఇద్దరు భారత షట్లర్లు మనీషా రామదాసు, తులసిమతి మురుగేశన్ అమీతుమీ తేల్చుకోనున్నారు. తులసిమతి శనివారమే ఫైనల్ చేరగా.. ఆదివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 19 ఏళ్ల మనీషా 21-13, 21-16 తేడాతో మమికో టోయోడా (జపాన్)ను ఓడించింది. మనీషా, తులసిమతి సెమీస్ పోరుతో కనీసం మరో రజతం భారత్ ఖాతాలో పడనుంది. అలాగే మహిళల సింగిల్స్ వ్యక్తిగత విభాగం ఎస్‌హెచ్6 సెమీ ఫైనల్లో నిత్యశ్రీ సివాన్ 13-21, 19-21 తేడాతో లిన్ షువాంగ్‌బావో (చైనా) చేతిలో ఓటమిపాలైంది. ఇక, నిత్యశ్రీ కాంస్య కోసం పోరాడనుంది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 సెమీస్‌లో భారత జంట శివరాజన్-నిత్యశ్రీ 21-17, 14-21, 13-21 తేడాతో అమెరికా జోడీ చేతిలో ఓడింది. ఈ ద్వయం కాంస్య పతకం కోసం తలపడనుంది. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో మన్‌దీప్ కౌర్, ఎస్ఎల్ 4లో పాలక్ కోహ్లీ పోరు క్వార్టర్స్‌లోనే ముగిసింది.

షూటింగ్‌లో గురి తప్పింది: పారాగేమ్స్‌లో ఇప్పటికే నాలుగు పతకాలతో అదరగొట్టిన షూటర్లు ఆదివారం మాత్రం తమ లక్ష్యానికి దూరంగా ఉండిపోయారు. ఇదివరకే వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించిన అవనీ లేఖారా, మిక్స్‌డ్ ఈవెం ట్‌లో నిరాశపరిచింది. అవని, సిద్ధార్థ బాబు ద్వయం మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్1లో ఫైనల్ చేరడంలో విఫలమైంది. క్వాలిఫికేషన్‌లో అవని 632.8 పాయింట్లతో 11వ స్థానం, సిద్ధార్థ 628.3 పాయింట్లతో 28వ స్థానంలో నిలిచారు. అలాగే మిక్స్‌డ్ 10మీ. ఎయిర్ రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్2 క్వాలిఫికేషన్‌లో షూటర్ శ్రీహర్ష దేవరడ్డి 26వ స్థానంలో నిలవడంతో ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు.

పాయింట్ తేడాతో కాంస్యం చేజారె..



వరల్డ్ నెంబర్‌వన్, భారత ఆర్చర్ రాకేశ్ కుమార్ పారాలింపిక్స్‌లో తృటిలో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల కాంపౌండ్ ఓపెన్ కేటగిరీ కాంస్య పతక పోరులో రాకేశ్ 146-147 తేడాతో హి జిహావో (చైనా) చేతిలో ఓడాడు. అంతకుముందు సెమీస్‌లో రాకేశ్ 143-145తో చైనాకు చెందిన జిన్ లియాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. అయితే ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్‌లో స్కోర్లు సమమైనా షూటాఫ్‌లో గట్టెక్కాడు.

రవి రాణించినా..



అథ్లెటిక్స్, రోయింగ్, షూటింగ్‌లో భారత్‌కు చేదు ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల షాట్‌పుట్ ఎఫ్40 ఫైనల్స్‌లో తెలుగు అథ్లెట్ రవి రొంగలి ఇనుప గుండును 10.63 మీటర్ల దూరం విసిరి తన అత్యుత్తమ ప్రదర్శన చూపాడు. కానీ ఓవరాల్‌గా అతను ఐదో స్థానంలో నిలవడంతో పతకం దూరమైంది. గతేడాది ఆసియా పారాగేమ్స్‌లో రవి రజతం అందుకున్నాడు. ఇక రోయింగ్ పీఆర్3 మిక్స్‌డ్ డబుల్ స్కల్స్ ఫైనల్ బి రెపిచేజ్‌లో మరో తెలుగు అథ్లెట్ నారాయణ-అనిత జోడీ 8 నిమిషాల 16.96 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. అయితే ఈ పోటీ 7 నుంచి 12 స్థానాల కోసం కావడంతో వీరు మొత్తంగా ఎనిమిదో ప్లేస్‌తో తమ ప్రస్థానాన్ని ముగించారు. మహిళల 1500 మీటర్ల టీ11 హీట్3 తొలి రౌండ్‌లో రక్షిత రాజు 5 నిమిషాల 29.92 సెకన్ల టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచి వెనుదిరిగింది. ప్రతీ హీట్ నుంచి టాప్-2 ప్లేయర్స్ మాత్రమే ఫైనల్ వెళతారు.

ధనుష్‌కు రికార్డు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన ధనుష్ శ్రీకాంత్ వరల్డ్ రికార్డుతో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఆదివారం జర్మనీలోని హనోవర్‌లో జరిగిన ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల ఈవెంట్‌లో ధనుష్ 632.7 స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 625.1 స్కోరుతో ఉన్న ప్రపంచ రికార్డును ధనుష్ బద్దలుకొట్టాడు. సోమవారం జరిగే టీమ్, మిక్స్‌డ్ ఈవెంట్లలోనూ ధనుష్ తలపడనున్నాడు.

ఇంగ్లండ్ ఘన విజయం

లార్డ్స్: శ్రీలంకతో రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ 190 పరుగులతో ఘన విజయం సాధించింది. 483 పరుగుల భారీ ఛేదనలో 53/2తో ఆదివారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు 292 పరుగులకు ఆలౌటైంది. చాందిమల్ (58), కరుణరత్నే (55), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (50) అర్ధశతకాలు సాధించారు. పేసర్ అట్కిన్సన్ (5/62) ఐదు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 427, శ్రీలంక 196 రన్స్ చేయగా, ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 251 పరుగులు సాధించింది. అట్కిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఇక..మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-0 ఆధిక్యంతో కొనసాగుతోంది. మూడో, ఆఖరి టెస్ట్ ఈనెల 6 నుంచి జరగనుంది.

లిట్టన్ దాస్ శతకం

బంగ్లా 262

పాక్ 9/2

రావల్పిండి: సెంచరీ హీరో లిట్టన్ దాస్ (138), మెహ్దీ హసన్ మిరాజ్ (78) పోరాడడంతో.. పాకిస్థాన్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ దీటుగానే బదులిచ్చింది. ఆటకు మూడోరోజైన ఆదివారం 10/0తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 262 పరుగులకు ఆలౌటైంది. 26/6తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ తరుణంలో దాస్, హసన్ ఏడో వికెట్‌కు 165 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. పేసర్ ఖుర్రమ్ షెహజాద్ 6 వికెట్లు పడగొట్టాడు. 12 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాక్ ఆట ముగిసేసరికి 9/2 స్కోరు చేసింది. సలీమ్ అయూబ్ (6) క్రీజులో ఉన్నాడు. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274 పరుగులు చేసింది.

ప్రీతి చరిత్ర



పారిస్: పారాలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో యువ అథ్లెట్ ప్రీతి పాల్ సంచలన ప్రదర్శన నమోదుచేసింది. ఈ క్రీడల్లో రెండో పతకంతో చరిత్ర సృష్టించింది. రెండ్రోజుల క్రితమే మహిళల 100 మీటర్ల రేసులో కాంస్య పతకం సాధించిన 23 ఏళ్ల ప్రీతి.. 200 మీటర్ల టీ35 విభాగం రేసులోనూ సత్తా చాటుతూ కాంస్యం కొల్లగొట్టింది. ఈ విభాగంలో దేశానికిదే తొలి మెడల్ కావడం విశేషం. ఆదివారం జరిగిన ఫైనల్ రేసులో ప్రీతి 30.01 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి ఈ క్రీడల్లో డబుల్ సాధించింది. దీంతో పారాగేమ్స్ అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు అందుకున్న ఏకైక భారత అథ్లెట్‌గా ప్రీతి రికార్డులకెక్కింది. ఇక.. ఈ క్రీడల్లో ఓ స్వర్ణం, రజతం, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం ఆరు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి.

హర్మన్‌కు నో చాన్స్


బిగ్‌బాష్‌లో మంధాన సహా ఆరుగురు భారత క్రికెటర్లు

మెల్‌బోర్న్: టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఈసారి చాన్స్ దక్కలేదు. ఆదివారం నిర్వహించిన లీగ్ డ్రాఫ్ట్ (వేలం)లో హర్మన్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. గతంలో ఈ లీగ్‌లో అదరగొట్టిన హర్మన్‌పై ఏ ఫ్రాంచైజీ ఆసక్తిచూపకపోవడం గమనార్హం. ఇక, ఈసారి స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన సహా ఆరుగురు భారత ప్లేయర్లు బిగ్‌బాష్ లీగ్‌కు ఎంపికయ్యారు. కాగా, అడిలైడ్ స్ట్రయికర్స్ తరఫున ఆడేందుకు మంధాన ముందుగానే ఒప్పందం చేసుకోగా.. టాపార్డర్ బ్యాటర్ దయాళన్ హేమలతను పెర్త్ స్కార్చర్ దక్కించుకొంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మతోపాటు వికెట్ కీపర్ యాస్తిక భాటియాను మెల్‌బోర్న్ స్టార్స్ కొనుగోలు చేసింది. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శిఖా పాండేతోపాటు జెమీమా రోడ్రిగ్స్‌ను బ్రిస్బేన్ హీట్ ఖరీదు చేసింది. అక్టోబరు 27 నుంచి బిగ్‌బాష్ లీగ్ జరగనుంది.

స్వియటెక్, సిన్నర్ జోరు

ప్రీక్వార్టర్స్‌కు టాప్‌సీడ్లు

యూఎస్ ఓపెన్


స్వియటెక్

న్యూయార్క్: వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంకర్లు ఇగా స్వియటెక్, జానిక్ సిన్నర్ యూఎస్ ఓపెన్‌లో సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో టాప్‌సీడ్ స్వియటెక్ 6-4, 6-2తో అనస్తాసియా పల్యుచెన్కోవా (రష్యా)ను చిత్తు చేసింది. ఇతర మ్యాచ్‌ల్లో 22వ సీడ్ హదద్ మయా 6-3, 6-1తో 15వ సీడ్ కలిన్స్కయాకు షాకివ్వగా, వోజ్నియాకి 6-3, 6-2తో పోన్సెట్‌ని, బడోసా 6-1, 6-2తో వాంగ్‌ని ఓడించి నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో టాప్‌సీడ్ సిన్నర్ 6-1, 6-4, 6-2తో క్రిస్ ఓ కొనెల్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. ప్రీక్వార్టర్స్‌లో 14వ సీడ్ టామీ పాల్ (అమెరికా)తో సిన్నర్ తలపడతాడు. మూడో రౌండ్‌లో పాల్ 6-7 (7), 6-3, 6-1, 7-6 (3)తో గాబ్రియెల్ డియాలోపై, ఐదో సీడ్ మెద్వెదెవ్ 6-3, 6-4, 6-3తో కొబోలీపై, 10వ సీడ్ డిమినార్ 6-3, 6-7 (7), 6-0, 6-0తో ఇవాన్స్‌పై గెలుపొందారు.

మిక్స్‌డ్ క్వార్టర్స్‌లో బోపన్న జోడీ: మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత స్టార్ ఆటగాడు రోహన్ బోపన్న క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో 8వ సీడ్ బోపన్న/అల్దిలా సుజియాది (ఇండోనేసియా) ద్వయం 0-6, 7-6 (5), 10-7తో జాన్ పియర్స్ (ఆస్ట్రేలియా)/సినియకోవా (చెక్ రిపబ్లిక్) జోడీపై నెగ్గింది. ఇక, పురుషుల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రి/అల్బనో ఒలివేటి (ఫ్రాన్స్) జోడీ 2-6, 2-6తో గ్రానోలెర్స్ (స్పెయిన్)/జబలోస్ (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడింది.

ఆగస్టు జీఎస్‌టీ వసూళ్లు

రూ.1.75 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆగస్టు నెల జీఎస్‌టీ వసూళ్ల రూ.1,74,962 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.1,59,069 కోట్లతో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. అయితే ఈ ఏడాది జూలైతో పోలిస్తే మాత్రం ఇది తక్కువే. ఈ ఏడాది జూలైలో జీఎస్‌టీ వసూళ్ల రూ.1,82,075 కోట్లుగా ఉన్నాయి. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు జీఎస్‌టీ ద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాకు రూ.9.13 లక్షల కోట్లు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వసూలైన రూ.8.29 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 10.1 శాతం ఎక్కువ.

అన్నింటా పెరుగుదల: గత నెల సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ, ఐజీఎస్‌టీలతో పాటు సెస్సుల వసూళ్లలోనూ పెరుగుదల కనిపించింది. సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీల వసూళ్ల గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 9.2 శాతం పెరిగి రూ.1.25 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో దిగుమతి వస్తువులపై విధించే జీఎస్‌టీ వసూళ్ల 12.1 శాతం పెరిగి రూ.49,976 కోట్లకు చేరాయి. ఆగస్టు నెల రిఫండ్స్ కూడా గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38 శాతం పెరిగి రూ.24,460 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్స్ పోనూ ఆగస్టు నెల నికర జీఎస్‌టీ వసూళ్ల 6.5 శాతం పెరిగి రూ.1.5 లక్షల కోట్లకు చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్ల రూ.2.10 లక్షల కోట్లకు చేరి రికార్డు సృష్టించాయి.

9న జీఎస్‌టీ మండలి భేటీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్‌టీ మండలి ఈ నెల 9న భేటీ కానుంది. కొన్ని వస్తువులపై జీఎస్‌టీ హేతుబద్ధీకరణ, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించడం వంటి అంశాలపై ఈ సమావేశం స్పష్టత ఇస్తుందని భావిస్తున్నారు.

ఐఓసీ చైర్మన్‌గా సతీష్ కుమార్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని చమురు రిటైల్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చైర్మన్‌గా వీ సతీశ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఐఓసీ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం అదనపు బాధ్యతగా ఈ పదవి కట్టబెట్టింది. కంపెనీకి పూర్తి స్థాయి చైర్మన్‌ని నియమించే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. పెట్రో ఉత్పత్తుల మార్కెటింగ్‌లో విశేష అనుభవం ఉన్న సతీశ్ కుమార్ నేతృత్వంలో ఐఓసీ కొత్తపుంతలు తొక్కింది.

బిజినెస్

9న బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.6,560 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇష్యూలో భాగంగా రూ.3,560 కోట్లకు కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.3,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ తెలిపింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా ఈ వాటాల విక్రయం ఉంటుందని బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పేర్కొంది. ఐపీఓ ద్వారా సమీకరించిన మొత్తాలను భవిష్యత్ మూలధన అవసరాల కోసం వినియోగించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూకి కోటక్ మహీంద్రా క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	495
వరంగల్	462	గోదావరి	495
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	99	విజయవాడ	103
వరంగల్	99	గుంటూరు	103
కరీంనగర్	99	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	85
కర్నూలు	99	నెల్లూరు	85
విశాఖపట్నం	99	అనంతపురం	98
గోదావరి	103		

'ఆటో'కి అచ్చిరాని ఆగస్టు

గణనీయంగా తగ్గిన అమ్మకాలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ కంపెనీలకు ఆగస్టు నెల అంతగా కలిసి రాలేదు. ఈ నెలలో మారుతి సుజుకీ, హ్యూండయ్ మోటార్ సహా మరికొన్ని కార్ల విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఈ నెలలో మారుతి సుజుకీ విక్రయాలు 8 శాతం తగ్గుదలతో 1,43,075 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఆగస్టు నెలలో విక్రయాలు 1,56,114 యూనిట్లుగా ఉన్నాయి. మినీ సెగ్మెంట్ కార్లయిన ఆల్టో, ఎస్-ప్రెస్సో విక్రయాలు 12,209 యూనిట్ల నుంచి 10,648 యూనిట్లకు పడిపోయాయి. మరోవైపు ఎర్టిగా, బ్రెజ్జా, ఫ్రాంక్స్, ఎక్స్ఎల్ 6 విక్రయాలు మాత్రం 58,746 యూనిట్ల నుంచి 62,684 యూనిట్లకు పెరిగాయి. బాలెనో, సెలేరియో, డిజైర్, ఇగ్నిస్ విక్రయాలు ఏకంగా 20 శాతం తగ్గినట్లు మారుతి సుజుకీ పేర్కొంది. ఆగస్టు నెలలో డీలర్ల వద్ద నిల్వలు పేరుకుపోవడంతో సరఫరాలు తగ్గించినట్లు కంపెనీ తెలిపింది. కాగా హ్యూండయ్ మోటార్స్ విక్రయాలు 12% తగ్గుదలతో 49,525 యూనిట్లకు, టాటా మోటార్స్ విక్రయాలు 8% తగ్గుదలతో 78,010 యూనిట్లుగా నమోదయ్యాయి. కియా, టయోటా కిర్లోస్కర్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ వాహనాల విక్రయాలు మాత్రం 9 నుంచి 35% వరకు పెరిగాయి.

ఆశించిన స్థాయిలో ద్విచక్ర వాహన విక్రయాలు

ఆగస్టు నెల ద్విచక్ర వాహన కంపెనీలకు బాగానే కలిసొచ్చింది. మార్కెట్ లీడర్ హీరో మోటోకార్ప్ గత నెలలో 5,12,360 వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5 శాతం ఎక్కువ. రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయాలు 5 శాతం క్షీణించి 73,630 యూనిట్లుగా నమోదయ్యాయి. టీవీఎస్ మోటార్స్ విక్రయాలు మాత్రం 13 శాతం వృద్ధి చెంది 3,91,598 యూనిట్లకు చేరుకున్నాయి.

మరింత పటిష్ఠంగా పీఎస్‌యూలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ)లను మరింత పటిష్ఠం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా అవి చెల్లించే డివిడెండ్, బోనస్ షేర్ల జారీ, షేర్ల బైబ్యాక్‌కు సంబంధించి 2016లో జారీ చేసిన మార్గదర్శకాలను సవరించాలని యోచిస్తోంది. ఈ నెలాఖరులోగానే సవరణ మార్గదర్శకాలు వెలువడతాయని అధికార వర్గాలు చెప్పాయి. 2016తో పోలిస్తే సీపీఎస్‌యూల పనితీరు గణనీయంగా మెరుగుపడింది. గత మూడేళ్లలో వాటి మార్కెట్ క్యాప్ రూ.15 లక్షల కోట్ల నుంచి ఐదు రెట్లు పెరిగి రూ.58 లక్షల కోట్లకు చేరింది. ఇదే సమయంలో వీటి ఈక్విటీలో ప్రభుత్వ వాటా రూ.9.5 లక్షల కోట్ల నుంచి రూ.38 లక్షల కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఈ సంస్థల నుంచి రూ.50,000 కోట్లు డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని వాటి మూలధన పునర్ వ్యవస్థీకరణ మార్గదర్శకాలను మరోసారి సవరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

25,550 ఎగువన బుల్లిష్

(సెప్టెంబరు 2-6 తేదీల మధ్య వారానికి)

ట్రెండ్ గైడ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,874-25,264 పాయింట్ల మధ్యన కదలాడి 1.62 శాతం లాభంతో 25,236 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,550 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,550 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,000
నిరోధ స్థాయిలు: 25,440, 25540, 25,640 (25,340 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,030,24,930,24,830 (24,130 దిగువన బేరిష్)

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదిలే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గరిష్ఠాలకు చేరిన సూచీల్లో స్వల్ప దిద్దుబాటుకు ఆస్కారం ఉంది. మార్కెట్ బ్రెడ్త్.. బయ్యర్స్‌కు అనుకూలంగా లేకపోవటంతో ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లో మాత్రమే పెట్టుబడులు పెట్టడం మంచిది. నష్టాల విషయంలో అప్రమత్తత పాటించాలి. ఫార్మా, ఐటీ రంగాల్లో పటిష్ఠత కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరులో స్వల్ప దిద్దుబాటు జరిగింది. కీలక మద్దతు స్థాయి రూ.655 వద్ద మళ్లీ అప్‌ట్రెండ్ మొదలైంది. డివిడెండ్ ప్రకటించటంతో శుక్రవారం ఈ షేరు ఏకంగా 7.78 శాతం లాభంతో రూ.793 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.750/780 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.850/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.720 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏయూ బ్యాంక్: సుదీర్ఘకాలం నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం పుంజుకుంటోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. పైగా 200 రోజుల మూవింగ్ యావరేజీని క్రాస్ చేసింది. గత శుక్రవారం 7.55 శాతం లాభంతో రూ.688 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.660 శ్రేణిలో ఎంటరై రూ.770/819 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6440 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ధనూకా అగ్రిటెక్: అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు సైడ్‌వేస్‌లో కన్సాలిడేట్ అవుతోంది. ట్రెండ్‌లైన్ వద్ద మద్దతు తీసుకున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 4.50 శాతం లాభంతో రూ.1.825 వద్ద ముగిసింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.1,800 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,880/1,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,740 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లక్స్ ఇండస్ట్రీస్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ కౌంటర్‌లో ఈ ఏడాది మే నెలలో టర్న్ అరౌండ్ అయ్యింది. మంచి జోరును కనబరుస్తూ 52 వారాల గరిష్ఠాన్ని అందుకుంది. ఆ తర్వాత స్వల్ప పుల్‌బ్యాక్ కనిపించింది. గత శుక్రవారం ఈ షేరు 4.06 శాతం లాభంతో రూ.2,376 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,350 శ్రేణిలో ప్రవేశించి రూ.2,455/2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,130 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హోమ్‌ఫస్ట్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరులో స్వల్ప పుల్‌బ్యాక్ కనిపించింది. ఇన్వెస్టర్లు ఈ షేరును వదులుకునేందుకు ఆసక్తి చూపించకపోవటంతో కీలక మద్దతు స్థాయి రూ.1,000 వద్ద బలంగా పుంజుకుంది. గత శుక్రవారం 4 శాతం లాభంతో రూ.1,153 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,140/1,120 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,255/1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,090 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

గరిష్ఠ స్థాయిల్లో కరెక్షన్‌కు చాన్స్!

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం బలమైన ర్యాలీతో ప్రారంభమై 25,000 పాయింట్ల ఎగువన పటిష్ఠంగా క్లోజైంది. ఆ తర్వాత రెండు రోజులు మైనర్ కరెక్షన్‌ను చవిచూసినప్పటికీ 25,000 వద్ద కన్సాలిడేట్ అయ్యి సానుకూల ట్రెండ్‌ను వెలువరించింది. అనంతరం అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 25,230 స్థాయిలో ముగిసింది. నిఫ్టీ వరుసగా పన్నెండు ట్రేడింగ్ రోజులు రికార్డు ర్యాలీని కొనసాగిస్తూ వస్తుండటం గమనార్హం. అంతకు ముందు వారంతో పోలిస్తే గత వారం నిఫ్టీ 410 పాయింట్లకు పైగా లాభపడింది. అయితే నిఫ్టీ 25,000 మార్కును అధిగమించటంతో పుల్ బ్యాక్ రియాక్షన్‌కు అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. టెక్నికల్‌గా చూస్తే వచ్చే కొద్ది రోజులు ప్రధాన మానసిక నిరోధ స్థాయిలైన 25,000 ఎగువన నిలదొక్కుకుంటుందా లేదా అనేది చూడాలి. లేదంటే కరెక్షన్‌కు అవకాశం ఉంటుంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ సానుకూల ట్రెండ్ కోసం తదుపరి మైనర్ నిరోధ స్థాయిలైన 25,300 ఎగువన ట్రేడ్ కావాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 25,500. ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్ కనబరుస్తుంది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,200 కన్నా దిగజారితే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 25,000. ఇది గతంలో ఏర్పడిన నిరోధ స్థాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 417 పాయింట్ల లాభంతో 51,350 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 51,500. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 52,000. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడవచ్చు.

పాటర్న్: డైలీ చార్టుల ప్రకారం చూస్తే ఆర్ఎస్ఐ.. ఓవర్ బాట్ పొజిషన్‌ను సూచిస్తోంది. మంత్లీ చార్టులు కూడా గరిష్ఠ స్థాయిల వద్ద అప్రమత్తతను సూచిస్తున్నాయి. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన మద్దతు ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,300, 25,355
మద్దతు	25,180, 25,100

నాగర్‌కర్నూలు జిల్లాలో
ఆరుగురి ప్రాణాలు కాపాడిన అధికారులు

నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడు వేర్వేరు ఘటనల్లో వరదల్లో చిక్కుకున్న ఐదుగురి ప్రాణాలను పోలీసులు, అధికారులు కాపాడారు. జిల్లాలోని తాడూరు మండలంలో దుందుభీ నదిలో ఆంజనేయులు, చిన్నమల్లయ్య అనే ఇద్దరు గొర్రెల కాపరులు చిక్కుకుపోయారు. సోమశిల నుంచి గజ ఈతగాళ్లను, పుట్టిని తెప్పించి అధికారులు వారిని రక్షించారు. అలాగే.. పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురాంపల్లి శివారులోని నక్కల వాగు మధ్య ఓ పశువుల కాపరి, కుమారుడు, కుమార్తె చిక్కుకుపోతే.. అధికారులు చేపల పుట్టి సహాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. ఇక.. నాగర్‌కర్నూలులో.. పొంగి పొర్లుతున్న నాగనూలు చెరువు ప్రవాహ ఉధృతికి వెంకటస్వామి అనే వ్యక్తి కొట్టుకుపోయాడు. పోలీస్ రెస్క్యూ టీమ్ ప్రాణాలకు తెగించి అతడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

సోదరుడి నిశ్చితార్థానికి వచ్చి వెళుతూ
మృత్యుఒడికి మహిళా శాస్త్రవేత్త

మహబూబాబాద్ వాగులో కొట్టుకుపోయిన కారు

ఖమ్మం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతిప్రతినిధి): తన సోదరుడి నిశ్చితార్థం కోసం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి వచ్చిన మహిళా యువశాస్త్రవేత్త.. తిరుగు ప్రయాణంలో అనూహ్యంగా వరదలో చిక్కుకొని.. మృతి చెందింది. గల్లంతయిన ఆమె తండ్రి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం వద్ద ఈ విషాదం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన నునావత్ మోతీలాల్ కుమార్తె అశ్విని(29) బెంగుళూరులోని ఐసీఏఆర్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేస్తోంది. తన సోదరుడి వివాహ నిశ్చితార్థం కోసం 2 రోజుల క్రితమే ఆమె స్వగ్రామానికి వచ్చింది. శుభకార్యం పూర్తికావడంతో తిరిగి బెంగూళురుకు విమానంలో వెళ్లేందుకు ఆదివారం ఉదయం వర్షంలోనే హైదరాబాద్‌కు తన తండ్రి మోతీలాల్‌తో కలిసి కారులో బయలుదేరింది. వారి కారు.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం వద్దకు రాగానే ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగులో కొట్టుకుపోయింది. ఆ సమయంలో అశ్విని బంధువులకు ఫోన్‌చేసి.. జరిగిన ప్రమాదం గురించి చెబుతుండగానే కారు నీటిలో పూర్తిగా మునిగిపోవడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. తండ్రీ కూతుళ్లు నీటిలో కొట్టుకుపోగా.. కొద్దిసేపటికి అశ్విని మృతదేహం లభ్యమైంది. మోతిలాల్ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. అశ్వారావుపేటలో ఏజీబీఎస్సీ పూర్తి చేసిన అశ్విని.. జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ఏజీబీఎస్సీలో బంగారు పతకం, విశ్వవిద్యాలయం స్థాయిలో ఆరు బంగారు పతకాలను సాధించిన అశ్విని.. అనూహ్యంగా మృతి చెందింది.


వరదలో కొట్టుకొచ్చిన అశ్విని మృతదేశం

మా వాళ్లే రక్షించారు

» ఖమ్మంలో వరద బాధిత కుటుంబం సురక్షితం

ఖమ్మం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మంలోని కరుణగిరి సాయికృష్ణనగర్‌లో మున్నేరు వరదలో ఓ భవనంపై పిల్లలతో సహా చిక్కుకున్న పది మంది సురక్షితంగా బయటపడ్డారు. తమని కాపాడాలని వేడుకుంటూ బాధితుల్లోని ఆకుల రాణి అనే మహిళ ఆదివారం ఉదయం సోషల్ మీడియాలో పెట్టిన వీడియో వైరలైంది. అయితే, వారిని రక్షించేందుకు అధికారులు ఎవరూ స్పందించలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భవనంపైనే ఉన్న తమను తమ బంధువులే రక్షించారని ఆకుల రాణి చెప్పారు. వైరాకు చెందిన తమ బంధువులు ఇద్దరు గజఈతగాళ్లను తీసుకొచ్చి తమని కాపాడారని, తామంతా ప్రస్తుతం ఖమ్మంలోని తమ బంధువుల ఇంటివద్ద సురక్షితంగా ఉన్నామని ఆమె తెలిపారు.


సూర్యాపేట జిల్లా కోదాడలోని 28వ వార్డులో ఎక్స్‌కవేటర్ సహాయంతో ముంపు ప్రాంతవాసులను తరలిస్తున్న స్థానికులు

జల దిగ్బంధం

రాష్ట్రవ్యాప్తంగా రోజంతా దంచికొట్టిన వాన

పలు చోట్ల రికార్డు స్థాయి వర్షపాతం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి. అన్ని జిల్లాల్లో రోజంతా వర్షం పడుతూనే ఉండడంతో.. సగటు వర్షపాతం 9.82 సెంటీమీటర్లుగా నమోదైంది. కొన్ని చోట్ల రికార్డు స్థాయి వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో 52 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా.. 25 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం 23 ప్రాంతాల్లో నమోదయిందని వాతావరణ శాఖ తెలిపింది. 20 సెంటీమీటర్లకుపైగా వాన 40 మండలాల్లో కురవగా.. 88 మండలాల్లో 11-20 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం, 277 మండలాల్లో భారీ వర్షాలు, 199 మండలాల్లో మధ్యస్థ వర్షపాతం నమోదు అయినట్లు వెల్లడించింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వర్షం కురవని మండలమంటూ ఏదీ లేదని పేర్కొంది. ఈ భారీ, అతిభారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వేలాది గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. రోడ్లు దెబ్బతినడంతో రవాణా వ్యవస్థ కూడా ఎక్కడికక్కడ ఆగిపోయింది. దాంతో కొన్నిచోట్ల కూరగాయలు, పాలు, పండ్ల ధరలు పెరిగాయి.


సూర్యాపేట జిల్లా కోదాడలోని షిరిడీసాయి నగర్‌లో బోట్లలో స్థానికులను తరలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

ఖమ్మంలో ఉప్పొంగిన మున్నేరు

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. పలు వాగులు, ఏర్లు పొంగి ప్రవహించడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఖమ్మం నగరం వద్ద మున్నేరుకు ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో 36 అడుగుల వరద రావడంతో పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మున్నేరు పరివాహక ప్రాంతాల్లోని వేలాది ఎకరాల పంటలు జలమయయ్యాయి. ఆకేరు నది కూడా భారీగా పొంగి ప్రవహించింది. ఆదివారం ఉదయం కూసుమంచి మండలంలో రికార్డు స్థాయిలో 31.5సెం.మీ వర్షం కురిసింది. కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద పాలేరు వరద ప్రవాహంలో చిక్కుకుని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గల్లంతయ్యారు. వారిలో ఒకరిని కూసుమంచి పోలీసులు రక్షించారు. మధిర మండలం దెందుకూరులో గేదెలను మేతకు తోలుకెళ్లిన పద్మావతి (34) అనే మహిళ శనివారం వరదలో కొట్టుకుపోగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆదివారం ఆమె మృతదేహం లభించింది. ఎర్రుపాలెం మండలం భవానిపురానికి చెందిన మనిశెట్టి సాంబశివరావు(20) శనివారం స్థానిక భీమవరం వాగులో గల్లంతు కాగా ఆదివారం అతడి మృతదేహం లభించింది. భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలో 39పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 7,090 మందిని తరలించారు. జిల్లాలో కురిసిన వర్షాలు, పొంగిన వరదల కారణంగా సుమారు లక్ష ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. పంట పొలాలతోపాటు ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. ఇక.. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీ సాయిబులగుంపు గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధులు కల్లూరి నీలమయ్య(70), తాటి ఆదెమ్మ(68) వాగులో కొట్టుకుపోయి మృతి చెందారు. వారు పెంచుకుంటున్న 30 ఆవులు, 100 మేకలూ మృత్యువాతపడ్డాయి. భద్రాద్రి జిల్లా మణుగూరును వరద చుట్టుముట్టింది. ఆ పట్టణంలో.. నందికోళ్ల రాము (30) అనే వికలాంగురాలు వరదలో మునిగి మృతిచెందింది.


హైరాబాద్‌లో వర్షాలకు కూలిన గాంధీభవన్ గోడ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. శంకరపట్నం మండలం అంబాలాపూర్ గ్రామంలో ఊర చెరువుకు గండిపడడంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లోతట్టువాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాల కారణంగా.. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మూడు ఏరియాల్లోని శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో రూ.13 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ. 4 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో..

వాగులు, వంకలు పొంగి పొరలడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో ఇటు తెలంగాణలో, అటు ఏపీలో.. రెండువైపా ఇరువైపులా ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై పడిన మట్టి, పెద్దపెద్ద కొండ రాళ్లను స్థానిక పోలీసులు, ఎన్‌హెచ్‌ఏ అధికారులు, స్థానికుల సహకారంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అయితే.. రాత్రి వేళ, వాహనాల రాకపోకలు లేని సమయంలో కొండ చరియలు విరిగిపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధికారుల ఆదేశాల మేరకు తెలంగాణ వైపు నుంచి శ్రీశైలానికి వెళ్లే వాహనాలను పోలీసు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు మన్ననూర్ నుంచే వెనక్కి పంపిస్తున్నారు. కొద్ది రోజులపాటు శ్రీశైలానికి రాకపోకలు వాయిదా వేసుకోవాలని ప్రజలకు సూచించారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో..

ఆగకుండా కురుస్తున్న వర్షానికి ఈసీ, మూసీ నదులు ఉప్పొంగాయి. వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. రహదారులన్నీ జలమయం కావడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫరూక్‌నగర్ మండలం దేవనపల్లి గ్రామంలో చేపలు పట్టేందుకు చెరువులోకి దిగిన శేఖర్ అనే వ్యక్తి దుర్మరణంపాలయ్యాడు. వర్షపు నీటి గుంటలో పడి ఒక బాలుడు మృతిచెందాడు. బషీరాబాద్ మండలం, జీవన్గిలోని మహదేవ లింగేశ్వర దేవాలయం జలగిగ్బంధంలో ఉండిపోయింది. కాగ్నా నది ఉధృతంగా ప్రవహించడంతో ఒడ్డున ఉన్న ఈ దేవాలయం సగానికి పైగానే మునిగిపోయింది. తాండూరు పరిధిలో అల్లాపూర్ వాగులో వరద ఉధృతికి ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడి నదిలో కొట్టుకుపోయిన డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కొన్ని మండలాల పరిధిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ, అతి భారీ వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు వరద ఉధృతితో ప్రవహిస్తున్నాయి. రాజంపేట మండలం గుడితండా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల గోడ కూలింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో గల ఎగువ మానేరు ప్రాజెక్టులో గ్రామానికి చెందిన కైరం కొండ శివ రాములు(55) అనేమత్స్యకారుడి ఆచూకీ గల్లంతయ్యింది. ఆదివారం ఉదయం మానేరు ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు వెళ్లిన శివరాములు వరద ఉధృతికి నీటిలో మునిగి కనిపించకుండాపోయాడు. అతడు ఉపయోగించిన తెప్ప, వల ఒడ్డుకు చేరుకోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో..

ఉమ్మడి నల్గొండ జిల్లాను జోరువాన ముంచెత్తుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన జాతీయ రహదారులతోపాటు, రాష్ట్ర రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లలోకి మోకాళ్లలోతు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. పలు చోట్ల చెట్లు విరిగి, విద్యుత్ స్తంభాలపై పడడంతో సరఫరా నిలిచిపోయి పల్లెల్లో అంధకారం నెలకొంది. సూర్యాపేట జిల్లా కోదాడలో వరద ప్రవాహంలో చిక్కుకొని నాగం రవి (55), యర్రమల్ల వెంకటేశ్వర్లు (55) అనే ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అలాగే.. వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లు భారీ వర్షం కారణంగా కనిపించక.. కారుతో వాటిని ఢీకొని ఒక వ్యక్తి మరణించాడు. సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌పార్క్ సమీపంలో శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిందీ ఘటన. నల్లగొండ జిల్లాలో 498 ఎకరాల్లో వరి, పత్తి పంటలు మునిగి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పాలేరు బ్యాక్ వాటర్ జాతీయ రహదారి 65పైకి చేరడంతో తెలంగాణ-ఏపీ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే.. కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో హైదరాబాద్- విజయవాడ రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రమాదం అంచున ఖమ్మం మున్నేరు బ్రిడ్జి

ఖమ్మం మున్నేరుపై బైపాస్‌పై ఉన్న బ్రిడ్జి ప్రమాద అంచుకు చేరింది. 36 అడుగులకు మున్నేరు వరద చేరడతో బ్రిడ్జి ఊగుతోంది. ఎప్పుడు పడిపోతుందో అన్నట్లుగా పరిస్థితి తయారైంది. దీంతో ఆ బ్రిడ్జిపై పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. బ్రిడ్జి మధ్యలో కనిపిస్తున్న పగులు మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఈ బ్రిడ్జినే కీలకం. ప్రస్తుతం మున్నేరుపై ఉన్న పాతబ్రిడ్జి వరదలో మునిగిపోయింది.



ఆ తొమ్మిది మంది..
సురక్షితం

» ఖమ్మంలో బ్రిడ్జిపై చిక్కుకున్న కార్మికులు

» ఉదయం 9 నుంచి రాత్రి 10 దాకా అక్కడే

» రాత్రి వరద తగ్గడంతో సురక్షితంగా బయటికి

ఖమ్మం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాలతో ఖమ్మం సమీపంలోని మున్నేరు ఉప్పొంగడంతో నగరంలోని ప్రకాశ్‌నగర్ బిడ్జిపై చిక్కుకున్న 9 మంది ఎట్టకేలకు సురక్షితంగా బయటపడ్డారు. ఆదివారం ఉదయం 9 గంటలకు చిక్కుకున్న కార్మికులు రాత్రి 10 గంటల వరకు బిక్కుబిక్కుమంటూ గడిపారు. స్పీడ్‌బోట్లు, రెస్క్యూ టీంలు అందుబాటులో లేపోవడంతో వారిని వెంటనే తీసుకురావడం సాధ్యంకాలేదు. అయితే స్థానికులు డ్రోన్ సాయంతో వారికి భోజనం అందించడంతోపాటు లైఫ్ జాకెట్లు, టార్చ్‌లైట్లు ఇచ్చారు. రాత్రి 7గంటల సమయంలో మంత్రి తుమ్మల సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఘటనా స్థలానికి చేరుకోగా బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు ఉదయం నుంచి అధికారులు సరిగా స్పందించలేదని, రెస్క్యూ బృందాలను తీసుకురాలేదని మండిపడ్డారు. రాత్రి 9 గంటలకు వచ్చిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందం 10 గంటలకు స్పీడ్ బోట్ల సాయంతో బ్రిడ్జిపైకి వెళ్లగా.. అప్పటికే వరద కాస్త తగ్గడంతో బాధితులు బిడ్జికి మరోవైపు నుంచి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో 13 గంటల ఉత్కంఠకు తెరపడింది.

ఆదివారం అత్యధిక వర్షం పడ్డ మండలాలు

	జిల్లా	మండలం	వర్షపాతం (సెం.మీ.లలో)
1	మహబూబాబాద్	ఇనుగుర్తి	45.6
2	మహబూబాబాద్	చిన్నగూడురు	45.1
3	మహబూబాబాద్	నర్సింహులుపేట	40.5
4	మహబూబాబాద్	నెల్లికుదురు	38.3
5	మహబూబాబాద్	దంతాలపల్లె	35.0
6	మహబూబాబాద్	మరిపెడ	34.4
7	సూర్యాపేట	మద్దిరాల	34.1
8	మహబూబాబాద్	కేసముద్రం	33.7
9	మహబూబాబాద్	కురవి	33.7
10	ఖమ్మం	తిరుమలాయపాలెం	33.0
11	మహబూబాబాద్	మహబూబాబాద్	32.4
12	వరంగల్	నెక్కొండ	31.7
13	భద్రాద్రి కొత్తగూడెం	మణుగూరు	31.6
14	ఖమ్మం	కుసుమంచి	31.5
15	సూర్యాపేట	చిల్కూరు	30.6
16	సూర్యాపేట	హుజూర్‌నగర్	30.3
17	భద్రాద్రి కొత్తగూడెం	బురగంపాడు	28.7
18	జనగాం	కొడకండ్ల	28.3
19	సూర్యాపేట	కోదాడ	27.9
20	మహబూబాబాద్	తొర్రూరు	27.4
21	సూర్యాపేట	మట్టపల్లె	26.7
22	ఖమ్మం	చింతకాని	26.2
23	ములుగు	తాడ్వాయి	25.8
24	సూర్యాపేట	మేళ్లచెర్వు	25.6
25	భద్రాద్రి కొత్తగూడెం	భద్రాచలం	25.5
26	మహబూబాబాద్	సీరోల్	25.3
27	ఖమ్మం	యెర్రుపాలెం	25.3
28	ఖమ్మం	వైరా	24.7
29	ఖమ్మం	మధిర	23.9
30	వరంగల్	పర్వతగిరి	23.9

హైదరాబాద్‌ను కుదిపేసిన వర్షం

హైదరాబాద్ నగరాన్ని శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కుదిపేస్తోంది. వర్షాలతో రాజధానిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంబర్‌పేట బతుకమ్మకుంట, విఠల్‌వాడి, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, మహదేవపురం, యూసుఫ్‌గూడ, సరూర్‌నగర్, షేక్‌పేట, బండ్ల గూడ, మలక్‌పేట ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, ఆదివారం సెలువురోజు కావడం... భారీ వర్షాలున్నాయనే అధికారుల ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో నగరజనం చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రధానరహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. భారీ వర్షాలతో హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. నీటిమట్టం ఫుల్ ట్యాంక్‌లెవల్ దాటడంతో తూముల ద్వారా నీటిని మూసీలోకి వదులుతున్నారు. మూసీలో వరద ఉధృతంగా ప్రవహిస్తుండంతో నీరు మూసారాంబాగ్ బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తోంది. 20కి పైగా ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలాయి. 50కిపైగా విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. విద్యుత్‌తీగలు తెగిపోవడంతో గంటల కొద్ది విద్యుత్‌సరఫరా నిలిచిపోయి చీకట్లు కమ్ముకున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలతో తండ్రి, కూతురు సహా ఆరుగురు మృతి చెందారు. కొత్తగూడలో ఒక యువకుడు వాగులో కొట్టుకుపోతుంటే రెవెన్యూ సిబ్బంది కాపాడారు. ఇల్లు కూలి ఇద్దరు గాయపడ్డారు. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షాల వల్ల నలుగురు మృత్యువాత పడ్డారు. తాడ్వాయి మండలం కాల్వపల్లి వద్ద వెంగమాంబ చెరువు మత్తడి వరదలో మునిగి జెరిపోతుల మల్లికార్జున్(35) మృతి చెందాడు. గూడూరు మండలం బొల్లెపల్లిలో పిడుగుపడి తిరుతమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. తొర్రూరు మండలం వెంకటాపురం శివారు బర్ల చెరువులో చేపలవేటకు వెళ్లి గుండాల నర్సయ్య అనే వ్యక్తి వరదనీటిలో మునిగి మృత్యువాతపడ్డాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం శివారులోని చెరువులోకి ఒక గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకువచ్చింది. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇంటికన్నె రైల్వేస్టేషన్ మధ్య మోరీ పూర్తిగా కొట్టుకుపోయింది. ఈప్రాంతంలో 30 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ కొట్టుకుపోయి రైలుపట్టాలు గాలిలో వేలాడుతూ కనిపించాయి. వరద ఉధృతికి మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి రైల్వే మార్గం మధ్య 432 కి.మీ. వద్ద 20 మీటర్ల పొడవు ట్రాక్ కొట్టుకుపోయింది. ఏటూరునాగారం మండలంలో జంపన్నవాగు ఒడ్డున ఉన్న బూటారం గ్రామానికి ముంపు ప్రమాదం ఉండటంతో అధికారులు 230మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. వరంగల్ జిల్లాలో దుగ్గొండి మండలం కేంద్రం చెరువులోకి గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకువచ్చింది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జనజీవనం అతలాకుతలమయ్యింది. ఖానాపూర్ మండలంలో రెంకోని వాగు ఉధృతికి దిలావర్‌పూర్ వద్ద తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో ఖానాపూర్, కడెం మండలాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా, ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా పాతూర్‌లో రికార్డుస్థాయిలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏడుపాయాల ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 54 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు అధికారులు తెలిపారు.


నిజామాబాద్‌జిల్లాలో నీట మునిగిన పంట


హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఆటోపై విరిగిపడ్డ చెట్టు


నిజాంపేటలో రోడ్డుపై వరద ప్రవాహం

నేడు, రేపు భారీ వర్షాలు

» వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం కుంభవృష్టి కురిసింది. వరుణుడి దెబ్బకు రాష్ట్రమంతా తడిసి ముద్దైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. చాలా ప్రాంతాల్లో రోజంతా వాన పడుతూనే ఉంది. పలు జిల్లాల్లో జనజీవనం స్తంభించిపోయింది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి, చిన్నగూడురు మండలాల్లో ఆదివారం అత్యధికంగా 45 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లాలోని నర్సింహులుపేట మండలంలో 40.5 సెం.మీల వర్షం కురిసింది. మొత్తంగా రాష్ట్రంలోని 16 మండలాల్లో 30 సెం.మీలకు పైగా వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కామారెడ్డి, నిజామాబాద్, రాజన్నసిరిసిల్ల, నిర్మల్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేటజిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని యెల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో మంగళవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.


ఖమ్మంలోని ఎఫ్‌సీఐ గోదాంల సమీపంలో మున్నేరు వరదలో మునిగిపోయిన సబ్‌స్టేషన్


ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసి తండాలో వరద బాధితులను రక్షిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది


హనుమకొండ జిల్లా కేంద్రం హంటర్ రోడ్డులో నీట మునిగిన ఎన్టీఆర్ నగర్ కాలనీ

భారీ వర్షాలతో 80 రైళ్ల రద్దు

» 4 పాక్షికంగా.. 49 రైళ్ల దారి మళ్లింపు

సికింద్రాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో దక్షిణ మధ్య రైల్వే 80 రైళ్లను పూర్తిగా, 5 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. 49 రైళ్లను ఇతర ప్రాంతాల మీదుగా మళ్లించింది. తెలంగాణ, ఏపీ మధ్య, ఇరు రాష్ట్రాల్లో తిరిగే పలు రైళ్లను సోమవారం నుంచి శుక్రవారం వరకు (2 నుంచి 6వ తేదీ వరకు) రద్దు చేసింది. రైళ్ల రాకపోకలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించడానికి మరో నాలుగైదు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. కే.సముద్రం-ఇంటికన్నె, తాడ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య, రాయనపాడు వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతింది. పలు రైళ్లు ముందుకెళ్లడానికి వీలు లేక వివిధ స్టేషన్లలో గంటల తరబడి నిలిచిపోయాయి. బీబీనగర్-ఖాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లను పూర్తిగా రద్దు చేయగా మరికొన్నింటిని బీబీనగర్-నల్లగొండ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నారు. వరంగల్ మీదుగా సికింద్రాబాద్-విజయవాడ మధ్య అన్ని రైళ్లను రద్దు చేశారు. గోల్కొండ, కృష్ణ, ఇంటర్‌సిటీ, శాతవాహన, గోదావరి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఆదివారం వరంగల్ మీదుగా వెళ్లాల్సిన పద్మావతి, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్‌కు రాకుండా సికింద్రాబాద్ నుంచి కాచిగూడ మీదుగా దారి మళ్లించారు. న్యూఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా విజయవాడ వైపు వెళ్లాల్సిన రైళ్లను వరంగల్ రాకుండా కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు తరలించారు. సికింద్రాబాద్ నుంచి మచిలీపట్నం బయలుదేరిన మచిలీపట్నం-బీదర్ ఎక్స్‌ప్రెస్ శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అర్ధరాత్రి నుంచి వరంగల్‌లో నిలిచిపోయిన ఈ రైలును ఆదివారం ఉదయం 7.30 గంటలకు తిరిగి సికింద్రాబాద్‌కు పంపించారు. శనివారం రాత్రి నుంచి ఎలుగూరు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన పాటలీపుత్ర-యశ్వంత్‌పూర్, చింతలపల్లి రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌కు పంపించారు. ఈ రైళ్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రధాన రైల్వే స్టేషన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ డివిజనల్ కార్యాలయాల్లో 24 గంటల పాటు పనిచేసేలా ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందాలను నియమించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కాగా, సోమవారం సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20701) 4 గంటలు ఆలస్యంగా ఉదయం 11.15 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు.


వరంగల్ జిల్లా కేసముద్రంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో బస్సుల కోసం బారులు తీరిన ప్రయాణికులు

నేడు విద్యాసంస్థలకు సెలవు

జేఎన్‌టీయూ, ఓయూ పరిధిలో పలు పరీక్షల వాయిదా

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యా శాఖ ఆదివారమే జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. చాలా చోట్ల ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేదు. సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా, జేఎన్‌టీయూ, ఓయూ పరిధిలో సోమవారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు.

220 చోట్ల తెగిన చెరువులు, కుంటలు

» యుద్ధప్రాతిపదికన మరమ్మతులు.. నీటిపారుదల శాఖ

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని అనేక చెరువులు, కాలువలు, చిన్న ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. రోడ్లు, నివాస ప్రాంతాలు, పంట పొలాల్లోకి నీరు చేరింది. దాంతో నీటిపారుదల శాఖ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి కొన్నిటికి మరమ్మతులు పూర్తిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 98 చెరువులకు గండ్లు పడ్డాయి. మరో 67 చెరువులు ధ్వంసమయ్యాయి. 32 ప్రాజెక్టులు, కాలువలకు గండి పడగా, మరో 23 ధ్వంసమయ్యాయి. మొత్తం 220 నీటి వనరులు దెబ్బతిన్నాయని నీటిపారుదల శాఖ గుర్తించింది. ఇందులో 52 చోట్ల మరమ్మతులు పూర్తిచేసింది. మరో 22 ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 126 చెరువులు, కాలువలు, ప్రాజెక్టులకు సంబంధించి పనులు పూర్తయ్యాయనీ, దీని కోసం రూ. 851.68 కోట్లు ఖర్చు చేసినట్లు నీటిపారుదల శాఖ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

12 గంటల నరకయాతన

» వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
» శనివారం రాత్రి నుంచి అందులోనే 46 మంది
» లారీ డ్రైవర్ సాయంతో సురక్షిత ప్రాంతానికి
» వరంగల్ జిల్లా నెక్కొండలో ఘటన

నెక్కొండ, సెప్టెంబరు 1 : భారీ వర్షం, ఉరుములు, మెరుపులు.. కళ్లెదుట రోడ్డుపై పొంగి ప్రవహిస్తోన్న నీళ్లు.. ఉన్న చోట నుంచి కదల్లేని పరిస్థితి.. తిండి లేదు, నిద్ర లేదు.. రెప్ప పడితే రేపటిని చూస్తామో లేదో తెలియని భయం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ శివారులో వరద నీటిలో చిక్కుకుపోయిన ఓ ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు ఎదురైన భయానక అనుభవం ఇది. డ్రైవర్, కండక్టర్‌తోపాటు 46 మంది ప్రయాణికులు ఒకటి, రెండు కాదు 12 గంటలకు పైగా ఈ నరకయాతన అనుభవించారు. ఓ లారీ డ్రైవర్ చేసిన సాహసంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం రాత్రి వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో డ్రైవర్, కండక్టర్‌తోపాటు 25 మంది మహిళలు, 10మంది పురుషులు, 11 మంది చిన్నారులు ఉన్నారు. అయితే, భారీ వర్షాలకు మార్గమధ్యలోని తోపనపల్లి చెరువుకు వరద పోటెత్తగా రాత్రి పది గంటల సమయంలో ఆ బస్సు వెంకటాపురం శివారులో వరద నీటిలో నిలిచిపోయింది. చీకటికి తోడు వర్షం వల్ల డ్రైవర్ బస్సును నడిపే ధైర్యం చేయలేకపోయాడు. దీంతో ప్రయాణికులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాయం కోసం ప్రయత్నిస్తూ ఎదురుచూశారు. ఈ విషయం తెలిసి నెక్కొండ పోలీసులు, వెంకటాపురం ప్రజలు ఘటనా స్థలికి చేరుకున్నా వరదను దాటి బస్సు వద్దకు చేరుకోలేకపోయారు. అర కిలోమీటర్ దూరంలోనే ఆగిపోయిన పోలీసులు.. దూరం నుంచే ప్రయాణికులకు ధైర్యం చెప్పారు. ఇక, ఆదివారం ఉదయం రైల్వే సిమెంట్ స్తంభాల లోడుతో నెక్కొండలో నిలిచిన లారీని చూసిన పోలీసులు సాయం కోసం డ్రైవర్‌తో మాట్లాడారు. దీంతో రంగంలోకి దిగిన సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన లారీ డ్రైవర్ రాము తన లారీని చాకచక్యంగా బస్సు వద్దకు తీసుకెళ్లాడు. ప్రయాణికులను లారీలో ఎక్కించుకుని ఒడ్డుకు చేర్చాడు. ఆ బస్సు ఇప్పటికీ వరదలోనే ఉంది. ఇక, ఆదివారం ఉదయం ఘటనా స్థలికి చేరుకున్న జిల్లా కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే మాధవరెడ్డి.. ప్రయాణికులను వెంకటాపురం పాఠశాలకు తరలించి అల్పాహారం, దుస్తులు అందించారు. అనంతరం నెక్కొండలోని ఓ పాఠశాలలో ప్రయాణికులందరికీ భోజనం అందించిన తర్వాత ఇళ్లకు పంపించారు. అలాగే, ప్రయాణికులను రక్షించిన లారీ డ్రైవర్ రామును కలెక్టర్ అభినందించారు.


ప్రయాణికులను లారీలో తరలిస్తున్న దృశ్యం

ఏపీకి రాకపోకలు బంద్


ఖమ్మం దానవాయిగూడెం సమీపంలో మున్నేరు వరద ట్రాక్‌పైకి రావడంతో నిలిచిపోయిన రైలు

మహారాష్ట్ర, కర్ణాటకకు కూడా..

» భారీ వర్షాలతో 65వ నంబరు జాతీయ రహదారిపైకి పాలేరు బ్యాక్ వాటర్
» హైదరాబాద్ - విజయవాడ వాహనాల నిలిపివేత
» పెన్‌గంగాతో మహారాష్ట్ర రాకపోకలకు ఆటంకం
» శ్రీశైలం రోడ్డులో విరిగిపడిన కొండచరియలు
» ఘాట్ రోడ్డుపై నిలిచిపోయిన రాకపోకలు
» మహబూబాబాద్‌లో కొట్టుకుపోయిన రైల్వేట్రాక్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ ప్రవాహం ప్రధాన రహదారులపైకి వచ్చి వాహనాలు ప్రయాణించేందుకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. దీనికితోడు పలుచోట్ల వరద ప్రవాహానికి రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి. తెలంగాణ నుంచి ఇటు ఆంధ్రప్రదేశ్ తోపాటు అటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు కూడా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పాలేరు బ్యాక్ వాటర్ జాతీయ రహదారి 65పైకి చేరడంతో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నార్కట్‌పల్లి నుంచి 65వ నెంబర్ జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను నార్కట్‌పల్లి-అద్దంకి హైవేకు మళ్లించారు. నార్కట్‌పల్లి నుంచి దామరచర్ల వరకు ట్రాఫిక్ రద్దీ రాత్రి వరకూ కొనసాగింది. మరోవైపు ఏపీలోని కృష్ణాజిల్లా నందిగామ వద్ద కూడా 65వ నంబర్ జాతీయ రహదారిపైకి నీరుచేరింది. విజయవాడ నుంచి ఖమ్మంకు వెళ్లే ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మరోవైపు పాలేరు అలుగుల ద్వారా వస్తున్న నీరు ఖమ్మం-సూర్యాపేట ప్రధానరహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహించడంతో ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం-విజయవాడ రహదారిలో చింతకాని మండలం నాగులవంచ వద్ద రహదారిపై నీరు చేరడంతో ఖమ్మం నుంచి మధిరకు రాకపోకలు నిలిచాయి మధిరనుంచి బోనకల్, మధిరనుంచి పెనుగంచిపోలువైపు రోడ్లపై నీరు చేరడంతో విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నిలిపివేశారు. మున్నేరువాగు ప్రవాహం పెరగడంతో బైపాస్‌లోని మున్నేరు బ్రిడ్జినుంచీ రాకపోకలు ఆగిపోయాయి. మున్నేరు బైపాస్ బ్రిడ్జికి కొంత పగుళ్లు రావడంతో సాయంత్రంనుంచి వాహనాలు నిలిపివేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కీసర టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిలిపివేశారు.


ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఐతవరం వద్ద నిలిచిన తెలంగాణ వైపు వచ్చే వాహనాలు

బీబీనగర్ వద్ద నిలిపివేత..

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం రుద్రవెల్లి బ్రిడ్జి, వలిగొండ మండలం సంగెం వద్ద బ్రిడ్జిల వద్ద రాకపోకలు నిలిపివేశారు. భారీ వర్షాలకు మూసీ పరవళ్లు తొక్కుతుండటంతో బీబీనగర్-పోచంపల్లి, వలిగొండ-చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ వద్ద జాతీయరహదారి 167ఎన్ పనుల్లో భాగంగా బ్రిడ్జి పనులు సాగుతుండగా, సర్వీస్‌రోడ్ తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో హన్వాడ మీదుగా వెళ్ళే మహబూబ్‌నగర్ - కొడంగల్ వాహనాలను కోయిలకొండ మీదుగా దారి మళ్లించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో పల్లెపాడు వాగు పొంగి పొర్లడంతో దాదాపు ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలం ఆనంద్‌పూర్ వద్ద పెన్‌గంగా నదిపై ఉన్న బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఖమ్మం, విజయవాడకు ఇలా వెళ్లవచ్చు!

భారీ వర్షాల కారణంగా హైదరాబాద్-విజయవాడ ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహిస్తూ.. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లేవారు.. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా వెళ్లవచ్చు. ఖమ్మం వెళ్లేవారు.. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, మరిపెడ బంగ్లా మీదుగా వెళ్లవచ్చని హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

శ్రీశైలానికి నిలిచిన రాకపోకలు

శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ ఇరువైపులా ఘాట్ రోడ్డుపై కొండ చెరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నారాయణపేట జిల్లాలెపి ఊట్కూర్ పెద్ద చేరువు నిండి అలుగు పారడంతో మక్తల్ - ఊట్కూరు - నారాయణపేటల మధ్య రాకపోకలు స్తంభించాయి. భూనేడ్ - అభంగాపూర్ మధ్య వాగు ఉధృతి తగ్గకపోవడంతో కోటకొండ నుంచి అభంగాపూర్, బండగొండ, భూనేడ్, కొత్తపల్లి తదితర ప్రాతాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రంగారెడ్డి జిల్లాలోని తాండూరు పరిధిలో వాగులు పొంగి ప్రవహించడంతో సరిహద్దులోని కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్ నస్కల్ - పరిగి, ధన్నారం - వికారాబాద్, మోమిన్‌పేట్ - మర్పల్లి, అత్తాపూర్ - చించల్‌పేట్, పరిగి - మహబూబ్‌నగర్, తాండూరు - చించోలి రూట్లలో వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గౌడవెల్లి వాగు ఉధృతితో గౌడవెల్లి-మేడ్చల్ మధ్య రాకపోకలు ఆగిపోయాయి.


శ్రీశైలం రహదారిపై పడిన బండరాళ్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్


యాదాద్రి జిల్లా పగిడిపల్లి వద్ద నిలిపిన మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్

కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్.. రైళ్ల రద్దు

మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలోమీటర్ వద్ద పెద్ద మోరి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ ప్రాంతంలో 30 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ కొట్టుకుపోయి పట్టాలు గాలిలో వేలాడుతున్నాయి. మరోవైపు మహబూబాబాద్-తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య 432 కిలోమీటర్ వద్ద 20 మీటర్ల పొడవు వరద ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. ఇలా కేసముద్రం స్టేషన్‌కు ఇరువైపులా రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్ రైల్వేస్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. కేసముద్రం రైల్వేస్టేషన్‌లో బెంగళూరు ధన్‌వాడ, ధన్‌వాడ బెంగళూరు సంఘమిత్ర అప్‌అండ్‌డౌన్ వైపునకు వెళ్లే రైళ్లు నిలిచిపోయాయి. ఈ రెండు రైళ్లలో సుమారు 6 వేల మంది ప్రయాణికులు ఉన్నారు. మరోవైపు డోర్నకల్‌లో లింగంపల్లి-కాకినాడ, కాకినాడ-లింగంపల్లి రైళ్లతోపాటు తిరుపతి నుంచి సికింద్రాబాద్ ప్రయాణించే పద్మావతి ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. మహబూబాబాద్‌లో గూడూరు-సికింద్రాబాద్ సింహపురం ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. కాగా, డోర్నకల్, మహబూబాబాద్ స్టేషన్‌ల నుంచి ఆయా రైళ్లను మోటుపల్లి, నల్లగొండ మీదుగా హైదరాబాద్‌కు దారి మళ్లించారు. ఈ ప్రయాణికులకు కేసముద్రంలోని పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉదయం అల్పాహార, మధ్యహ్నం భోజనం తయారు చేసి అందజేశారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అధికార యంత్రాంగం వరంగల్ నుంచి 36 ఆర్టీసీ బస్సులను తెప్పించి, ప్రయాణికులను వరంగల్‌కు తరలించారు.



● శభాష్ పోలీసన్న...

ఈ చిత్రంలో కావడి మోస్తున్నది ఎవరో తెలుసా.. ? పోలీసులు.. అవును.. భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండా జలమయం అవ్వగా.. తండాలోని గిరిజనులను రక్షించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. సుమారు 100 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ క్రమంలో నడలేని స్థితిలో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని జోలెలో కూర్చోబెట్టి దానికి కావడి కట్టి ఎస్సై నగేష్ ఇతర సిబ్బంది స్వయంగా మోసుకెళ్లి సురక్షిత ప్రాంతానికి చేర్చారు.

- సీరోలు (మహబూబాబాద్ జిల్లా)

అమ్మానాన్నల ఎదుటే.. వాన నీటి గుంతలో పడి

13 నెలల చిన్నారి మృతి.. షాద్‌నగర్‌లో విషాదం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ఏర్పడ్డ నీటిగుంతలో పడి.. కన్నవారి ఎదుటే కన్ను మూశాడో పసివాడు! రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని నోబుల్‌పార్క్ కాలనీలో ఆదివారం జరిగిందీ విషాదం. బిహార్ రాష్ట్రానికి చెందిన అక్తర్ మన్సూర్, రౌషన్ కతూం దంపతులు షాద్‌నగర్‌కు వలస వచ్చి నోబుల్‌పార్క్ కాలనీలోని ఒక ఇంటి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆ ఇంటిపక్కనే గుడిసె వేసుకుని ఉంటున్నారు. ఆదివారం అక్కడే ఆడుకుంటున్న వారి కుమారుడు అరీఫ్ మన్సూర్.. తల్లిదండ్రులు చూస్తూ ఉండగానే వర్షపు నీటి గుంతలో పడిపోయాడు. వెంటనే వారు పిల్లవాణ్ని బయటకు తీసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే బాలుడు మృతి చెందినట్టు చెప్పారు. కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రులు తీవ్రంగా రోదించారు.

ముగ్గురిలో ఒక్కరే బతికారు!

» ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో వాన నీటిలో కొట్టుకుపోయిన కుటుంబం
» తల్లి, తండ్రి గల్లంతు.. కుమారుడు క్షేమం

ఖమ్మం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా పాలేరు జలాశయానికి భారీగా వరద పోటెత్తడంతో.. ముగ్గురు సభ్యుల (తల్లి, తండ్రి, కుమారుడు) కుటుంబం వరద నీటిలో కొట్టుకుపోయింది! వారిని కాపాడేందుకు రెస్క్యూటీం, పోలీసులు ఎంతగా ప్రయత్నించినా.. తల్లి, తండ్రి గల్లంతయ్యారు. వారి కుమారుణ్ని మాత్రమే రక్షించగలిగారు. ఆదివారం ఉదయం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో జరిగిందీ ఘటన. ఆ గ్రామంలో నివాసం ఉంటున్న షేక్ యాఖుబ్ ఇంటిని పాలేరు అలుగు నీరు చుట్టుముట్టింది. దీంతో తమ ప్రాణాలు కాపాడుకునేందుకు యాఖుబ్(48), ఆయన భార్య సైదాబి(45), కుమారుడు షరీఫ్ ఇంటిపైకి ఎక్కారు. వారు ముగ్గురూ వరదలో చిక్కుకున్నారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు కాపాడేందుకు ప్రయత్నించారు. డ్రోన్ల సాయంతో వారికి సేఫ్టీ జాకెట్లను అందించారు. ఈ క్రమంలోనే వరద ఉధృతి పెరిగి ఇంటిగోడ కూలడంతో ముగ్గురూ నీటిలో కొట్టుకుపోయారు. కిలోమీటరు దూరంలో.. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఉన్న కానిస్టేబుల్ రాంబాబు వారిని గమనించి వెంటనే తాళ్లసాయంతో షరీఫ్‌ను రక్షించాడు. యాఖూబ్, సైదాబీ ఆచూకీ ఇంకా దొరకలేదు. వారికోసం గాలింపు కొనసాగుతోంది.

నక్కలవాగులో ప్రభుత్వ ఉద్యోగి గల్లంతు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: వర్షాల ధాటికి పొంగిప్రవహిస్తున్న వాగులో ప్రభుత్వ ఉద్యోగి ఒకరు గల్లంతయ్యాడు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో జరిగిందీ ఘటన. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్పాల పవన్(22) మీర్జంపేట గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మీర్జంపేట గ్రామానికి వెళ్లి విధులు నిర్వహించి సాయంత్రం కాల్వశ్రీరాంపూర్‌కు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. అయితే, కొత్తపల్లి శివారు వద్ద.. రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తున్న నక్కలవాగు ఉధృతికి ద్విచక్ర వాహనంతో సహా కొట్టుకుపోయాడు. పోలీసులు, కాల్వశ్రీరాంపూర్‌వాసులు పవన్ కోసం వాగులో గాలింపు చర్యలు చేపట్టారు.


పవన్(ఫైల్)

54 మందిని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో ఆకేరు నదికి వరద ఉధృతంగా రావడంతో ఆదివారం ఉదయాన్నే రాకాసి తండాను చుట్టుముట్టింది. గ్రామస్థుల్లో కొందరు సురక్షిత ప్రాంతాలకు వెళ్లగా.. 54 మంది డాబాలపైకి ఎక్కి సహాయం కోసం చూశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్.. అక్కడికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించి స్పీడ్‌బోట్లతో మొత్తం 54 మందినీ సురక్షితంగా తరలించారు.

వరద సహాయక చర్యల కోసం..

ఖమ్మంకు హెలికాప్టర్, విమానం?

వాతావరణం అనుకూలించక విజయవాడలోనే పార్క్

హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో వరదల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు రెండు హెలికాప్టర్లను పంపాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. సీఎస్ శాంతికుమారిని కోరారు. అయితే, హైదరాబాద్‌లో వర్షం కురుస్తున్నందున హెలీకాప్టర్లను పంపడం సాధ్యపడలేదు. మరోవైపు, ఖమ్మం జిల్లాలో వరద సహాయక చర్యలు చేపట్టేందుకు హెలికాప్టర్ పంపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు అక్కడి అధికారులతోనూ తుమ్మల మాట్లాడారు. అయితే అక్కడ కూడా వర్షాలు కురుస్తుండటంతో హెలికాప్టర్ పంపడం సాధ్యంకాలేదు. ఖమ్మం జిల్లాలో వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు హెలికాప్టర్లను తీసుకురావాలని మంత్రి పొంగులేటి ప్రయత్నించారు. హైదరాబాద్, విశాఖపట్నం నుంచి హెలికాప్టర్లను రప్పించేందుకు కృషి చేశారు. అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో అది సాధ్యంకాలేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విశాఖపట్నంలోని నేవీ అధికారులకు ఫోన్ చేసి రెండు హెలికాప్టర్లను పంపాలని కోరారు. స్పందించిన నేవీ విభాగం సీ కింగ్ హెలికాప్టర్‌తో పాటు డోర్నియర్ విమానాన్ని ఖమ్మం పంపేందుకు అంగీకరించింది. ఈ రెండూ విజయవాడకు చేరుకుని, అక్కడి నుంచి ఖమ్మం వెళ్లి సహాయక చర్యలను అందిస్తాయి. ఖమ్మంలో ఎయిర్‌పోర్టు లేకపోవడంతో.. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితులున్నాయనే విషయాన్ని విమానం ద్వారా సేకరించి, ఆ వివరాలను అధికారులకు అందజేస్తుంటారు. అనంతరం సీ కింగ్ హెలికాప్టర్ ద్వారా సహాయక చర్యలను చేపడతారు. అయితే, ఖమ్మం వెళ్లేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఈ రెండు లోహ విహంగాలు ప్రస్తుతం విజయవాడలో ఉన్నాయి. హైదరాబాద్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించగానే ఖమ్మం జిల్లా లేదా రాష్ట్రంలో ఎక్కడ అవసరమైనా సహాయక చర్యలను అందించేందుకు హైదరాబాద్‌లోని హకీంపేటలో చేతక్ హెలికాప్టర్‌ను ప్రభుత్వం సిద్ధంగా ఉంచిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

మరో 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాల రాక

» అమిత్ షాకు సంజయ్ ఫోన్.. వర్షాల తీవ్రతపై సమాచారం

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ నష్టం సంభవించకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఆదేశించారు. ఆదివారం ఉదయం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలంగాణలో భారీ వర్షాలతో పాటు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరిస్థితిని అమిత్ షా దృష్టికి తీసుకువెళ్లారు. ఖమ్మం జిల్లాలో 110 గ్రామాలు ముంపునకు గురవడంతోపాటు పట్టణంలోని ప్రకాశ్‌నగర్ గుట్టపై 9 మంది, పాలేరు నియోజకవర్గంలోని అజ్మీరాతండా గుట్టపైన 68 మంది, భవనాలపైన 42 మంది చిక్కుకున్న విషయాన్ని అమిత్ షాకు వివరించారు. స్పందించిన ఆయన తెలంగాణకు అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్లు తెలిపారు. షా ఆదేశాలతో చెన్నై, విశాఖపట్నం, అసోం నుండి 3 చొప్పున మొత్తం 9 బృందాలు తెలంగాణకు వచ్చాయని సంజయ్ ఎక్స్ వేదికగా తెలిపారు. అదే సమయంలో ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో మాట్లాడిన సంజయ్.. రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం బండి సంజయ్ ఖమ్మం జిల్లాలో వరదలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో వరద పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్రం అదనంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించిందని తెలిపారు.

టోలీచౌకీలో హైడ్రా కమిషనర్ పర్యటన

నార్సింగ్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదివారం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. టోలీచౌకీ చౌరస్తా, బృందావనీ కాలనీ, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై రంగనాథ్ అధికారులతో మాట్లాడారు. ఇదే ప్రాంతాన్ని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్ కూడా పరిశీలించారు.



పెదవాగుకు మళ్లీ గండి

» సీతారామ ప్రధాన కాల్వ,సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల..

నడిగూడెం, అశ్వారావుపేట/ములకలపల్లి, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేని వర్షాలతో భద్రాద్రి జిల్లాలోని పెదవాగు ప్రాజెక్టు రింగ్ బండ్‌కు భారీ గండి పడింది. దీంతో.. రూ.3.5 కోట్లు వెచ్చించి నిర్మించిన రింగ్‌బండ్ కొట్టుకుపోయింది. జూన్ 18న గండి పడడంతో పంటలకు తాత్కాలికంగా నీరందించేందుకు ప్రభుత్వం దీనిని నిర్మించింది. రెండు రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇంతలోనే శనివారం రాత్రి 25 మీటర్ల మేర గండి పడింది. ఏపీలోని గుబ్బలమంగమ్మ ఆలయ పరిసరాలు, స్థానికంగా భారీ వర్షం పడడంతో పెదవాగుకు వరద పోటెత్తింది. జూన్‌లో జరిగినట్టే.. ప్రాజెక్టులోని నీరంతా బయటకు పోయింది. మరోవైపు సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వకు 25 మీటర్ల మేర గండి పడింది. భద్రాద్రి జిల్లా ములకలపల్లి-పాల్వంచ మండలాల మధ్య వీకే మాదవరానికి రెండు కిలోమీటర్ల దూరంలో సీతారామ ఫేజ్-3లో 38 కి.మీ. వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఇది ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ పంపుహౌజ్‌ను ప్రారంభించిన ప్రాంతానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. వేల క్యూసెక్కుల నీటిని తరలించేలా నిర్మించిన ప్రధాన కాలువ చిన్న వరదకే తెగిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. పాలేరు జలాశయం తిరుగు జలాల ఉధృతితో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద 132, 133 కిలోమీటర్ల పరిధిలో సాగర్ ఎడమకాల్వకు రెండుచోట్ల గండి పడింది. ఇవి 60 అడుగుల మేర ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సిరిపురం డీప్ కట్ వద్ద వంతెనపై నుంచి నీరు గ్రామంలోని ఇళ్లలోకి చేరింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయికన్‌గూడెం పరిసర పంట పొలాలు నీట మునిగాయి. గండిని ఎన్నెస్పీ సీఈ రమేష్‌బాబు పరిశీలించారు. తక్షణ చర్యలు చేపట్టి నీటి విడుదలను నిలిపివేశారు. ఎడమ కాల్వపై షట్టర్ల నాలుగు గేట్లు తెరుచుకోలేదు. ఇదే గండికి కారణంగా తెలుస్తోంది.

అధికారులూ.. జాగ్రత్త!

» 24 గంటలూ అప్రమత్తంగా ఉండండి

» ఎవరూ సెలవులు పెట్టొద్దు

» వర్షాల నేపథ్యంలో సీఎం ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతో పాటు పలు ప్రాంతాల్లో వరదలు వస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 24 గంటలూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆదివారం ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మునిసిపల్, విద్యుత్తు, పంచాయతీరాజ్, హైడ్రా, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అదే విధంగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, దామోదర, జూపల్లి, పొంగులేటితో ఫోన్‌లో మాట్లాడి, వారిని అప్రమత్తం చేశారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అన్ని శాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. అధికారులు సెలవులు పెట్టొద్దని, ఇప్పటికే ఎవరైనా సెలవులపై ఉంటే రద్దు చేసుకుని వెంటనే విధులకు హాజరవ్వాలని సూచించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరం ఉన్నా అధికారులకు ఫోన్ చేయాలని సూచించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినట్లు సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

వరద నీటిని ఒడిసి పట్టుకుందాం: ఉత్తమ్



భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వరద నీటిని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నిల్వ చేయాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తుండడంతో గేట్లు ఎత్తి, నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఆ నీటిని వీలైనంత మేరకు ఎత్తిపోయాలని, రోజుకు ఒక టీఎంసీ తగ్గకుండా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లను నింపాలని ఉత్తమ్ సూచించారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌తో పాటు రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ వరకు జలాశయాల్లోకి కూడా నీటిని ఎత్తిపోయాలని ఆయన ఆదేశించారు.

శ్రీశైలానికి వరద పోటు

జలాశయానికి 5.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. సాగర్‌కు 4.20 లక్షల క్యూసెక్కుల నీటి రాక

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తడంలో భారీగా ప్రవహిస్తున్న నీరు

అతి భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. రాష్ట్రంలోనూ, ఎగువ ప్రాంతంలోనూ కురుస్తున్న వర్షం కారణంగా కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు నిండుకుండలా మారుతున్నాయి. కృష్ణానది ఎగువ నుంచి 3.72 లక్షల క్యూసెక్కులు, కర్నూలు పరిసర ప్రాంతాల నుంచి 35 వేల క్యూసెక్కులు వస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. జూరాల నుంచి 3.89 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, శ్రీశైలం పరివాహక ప్రాంతాల నుంచి మరికొంత వరద తోడు కావడంతో జలాశయానికి 5,27,784 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు పది గేట్లు పది అడుగుల మేర ఎత్తి 4.04 లక్షల క్యూసెక్కులు, జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా 68 వేల క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 587.90 అడుగులకు చేరింది. కుడికాల్వ ద్వారా 5292 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,261 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల నుంచి 4,97,524 క్యూసెక్కులు మొత్తంగా 5,16,877 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, నాగార్జునసాగర్ నుంచి, వాగులు వంకల నుంచి పులిచింతలకు 6 లక్ష ల 57 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ మొత్తం నీటిని 21 గేట్లను ఐదు మీటర్ల మేరకు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి ఏ క్షణంలోనైనా వరద ప్రవాహం 10 లక్షల క్యూ సెక్కులు దాటే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 2009 అక్టోబరు 5వ తేదీ రాత్రి 11 గంటలకు అత్యధికంగా 11,10,404 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. బ్యారేజీ చరిత్రలో ఇదే రికార్డు. బ్యారేజీకి భారీ ప్రవాహం మరో 48 గంటల పాటు కొనసాగే అవకాశాలున్నాయి. ఆదివారం రాత్రికి బ్యారేజీ వద్ద 9.02 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

మూసీ ప్రాజెక్టు ఐదు గేట్ల ఎత్తివేత..

భారీ వర్షాలతో మూసీ ప్రాజెక్టుకూ వరద పోటెత్తుతోంది. శనివారం రాత్రి నుంచే మూసీ ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో ఐదు క్రస్ట్ గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 12,270 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 641.80 అడుగులుగా ఉంది. ప్రాజెక్టుకు 5,800 క్యూసెక్కుల వరద వస్తుండగా, పైనుంచి వచ్చే ఉధృతిని గమనించి నీటిని దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మూసీ నదిపై ఉన్న శాలిగౌరారం, కేతేపల్లి ప్రాజెక్టులు నీటితో నిండిపోయాయి. మరోవైపు పాలమూరు జిల్లాలో భారీ వర్షాలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. మరోవైపు ఖమ్మం సమీపంలోని మున్నేరుకు భారీగా వరద చేరింది. ఉదయం 22 అడుగులు ఉన్న మున్నేరు సాయంత్రం 36 అడుగులకు చేరింది. మున్నేరుకు ఇది రికార్డు స్థాయి వరదగా నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మున్నేరుకు వరద రావడంతో పరివాహక ప్రాంతాల్లోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్, రఘునాధపాలెం, ఖమ్మం నగరం చింతకాని, ముదిగొండ, బోనకల్ తదితర మండలాల్లోని గ్రామాలు వేల ఎకరాల పంటలు జలమయయ్యాయి. ఇక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకూ క్రమంగా వరద పెరుగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 37,165 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 62.673 టీఎంసీలకు నీరు చేరింది. ప్రాజెక్టు నిండేందుకు ఇంకా 17 టీఎంసీలే అవసరం ఉండగా.. నిర్మల్ జిల్లాలోని గడ్డెన్న వాగు, గోదావరి, మంజీరా ద్వారా వస్తున్న వరద నేపథ్యంలో.. ముందస్తుగా ప్రాజెక్టు వరద కాలువ గేట్లను ఎత్తి నీటిని మిడ్‌మానేరుకు విడుదల చేశారు.

నిజాంసాగర్‌కూ భారీగా వరద..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సైతం భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టులోకి 15,600ల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాగా, ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 285.75 మీటర్లకు చేరుకుంది. ఇక నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులోకి 65 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు పది వరద గేట్లను ఎత్తి దిగువకు 79,850 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 6.361 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 1,37,303 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండంతో 20 గేట్లు ఎత్తి 1,35,272 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. కాగా, రాజన్న సిరిస్లి జిల్లా ఎగువ మానేరు ప్రాజెక్ట్ మత్తడి దూకుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి 6,848 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా 7,075 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. ఇక లోయర్ మానేరు డ్యాంలోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మిడ్ మానేరు నుంచి 3వేల క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 39,047 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉంది.

ఏడుపాయల ఆలయం మూసివేత

మెదక్ జిల్లాలోని మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏడుపాయల ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఘనపూర్ ఆనకట్ట, హల్దీ ప్రాజెక్టులు పొంగిపొరుతున్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి దాటిన తర్వాత నిర్మిస్తున్న బ్రిడ్జి తెగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తొగుట మండలం వెంకట్రావ్‌పేట వాగు గడ్డ వద్ద రోడ్డుపై నుంచి కూడవెళ్లి వాగు ప్రమాదకరంగా ప్రహించడంతో రోడ్డును మూసివేశారు. హుస్నాబాద్, పందిళ్ల వాగు పొంగిపొర్లడంతో తాత్కాలికగా వేసిన రహదారి తెగిపోగా హన్మకొండ-సిద్దిపేట రహదారిని మూసివేశారు. కాగా, సంగారెడ్డి జిల్లాలోని సింగూరు, నల్లవాగులోకి కూడా భారీగా వరద వస్తోంది. దీంతో పెద్దమొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు

సిద్ధంగా ఉండండి

» హైడ్రా కూల్చివేతలను 3 రోజులు ఆపి.. పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలి

» కలెక్టర్లతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాలు, వరదల కారణంగా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కలెక్టర్లను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఆదివారం ఆయన పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలన్నారు. రోడ్లపై వరద ప్రవహించే చోట వాహనాలను అనుమతించవద్దని పోలీసు శాఖను ఆదేశించారు. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణల తొలగింపులో ఉన్న హైడ్రా అధికారులు మూడు రోజుల పాటు కూల్చివేతలకు విరామం ప్రకటించి, రెస్క్యూ టీంలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు కావాల్సిన నిధులను సిద్ధంగా ఉంచామని చెప్పారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడులో వరదలో చిక్కుకున్న మత్యకారుణ్ని రక్షించేందుకు శనివారం అర్ధరాత్రి తాను స్వయంగా వెళ్లి చర్యలు తీసుకున్నట్లు గుర్తుచేశారు. నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులతోనూ భట్టి సమీక్షించారు. ఆదివారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

రాబోయే 24 గంటలూ జాగ్రత్త!

ముందస్తు చర్యల వల్లే భారీ నష్టం తప్పింది.. అయినా 9 మంది చనిపోవడం దురదృష్టకరం

» కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



వరదలో గల్లంతైన యాకూబ్ సోదరుడిని ఓదారుస్తున్న పొంగులేటి

హైదరాబాద్/కూసుమంచి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ఆయన ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అనంతరం తన కార్యాలయంలో పొంగులేటి విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ముందస్తుగా చేపట్టిన చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా కాపాడగలిగాం. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో 9 మంది చనిపోయారు. ఇది చాలా దురదృష్టకరం. గోదావరి, కృష్ణా నదులతో పాటు పలు వాగుల ద్వారా వచ్చే వరదను ఎప్పటికప్పుడు అంచనా వేసి పకడ్బందీగా నీటిని వదలడం వల్ల చెరువులు, కుంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. ప్రధానంగా మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వరదలు, వర్షాల ప్రభావం అధికంగా ఉండి నీటిలో చిక్కుకున్న పలువురిని సురక్షితంగా కాపాడగలిగాం. పరిస్థితుల తీవ్రత దృష్ట్యా అన్ని స్థాయుల అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేయాలని సీఎస్‌ను ఆదేశించాం. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని కలెక్టర్లకు సూచించాం. జీహెచ్ఎంసీ పరిధిలో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలకు అవకాశం ఉండడంతో అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని ఆదేశించాం. సోమవారం సాయంత్రం వరకు ప్రజలు బయటికి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాం. మహబూబాబాద్, డోర్నకల్ మధ్య రైల్వే లైనుపై వర్షపు నీరు చేరుకోవడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులకు భోజన వసతి కల్పించి, బస్సులు ఏర్పాటు చేసి వారిని అక్కడి నుంచి తరలించాం" అని మంత్రి చెప్పారు.

పాలేరు ఘటనపై మంత్రి భావోద్వేగం

తన నియోజకవర్గం పాలేరులోని నాయకన్‌గూడేనికి చెందిన యాకూబ్, ఆయన భార్య సైదా వరదలో కొట్టుకుపోవడంపై మంత్రి పొంగులేటి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. విలేకరుల సమావేశం జరుగుతున్న సమయంలోనే యాకూబ్ కుటుంబం కొట్టుకుపోయిందని సమాచారం అందడంతో కన్నీటి పర్యంతమయ్యారు. "నేను ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని కాపాడేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. హెలికాప్టర్లను పంపేందుకు ఫోన్‌లు చేస్తూనే ఉన్నా. భారీ వర్షాలకు హెలికాప్టర్లు టేకాఫ్ కావడం కష్టమన్నారు. మరోవైపు యాకూబ్, సైదాకు ధైర్యం చెబుతూనే ఉన్నా. స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలను సిద్ధం చేసి, ఒక డ్రోన్ ద్వారా వారికి లైఫ్ జాకెట్లను అందించాం. ఇంతలోనే వరద పోటెత్తడంతో వారున్న ఇంటిగోడ కూలి నీటిలో కొట్టుకుపోయారు. వారి కొడుకు షరీఫ్‌ను రక్షించగలిగాం" అని మంత్రి తెలిపారు. అనంతరం ఆయన ఖమ్మం వెళ్తూ నాయకన్‌గూడెంలో ఆగి.. యాకూబ్ సోదరుడు లాల్ సాహెబ్, ఇతర కుటుంబసభ్యులను ఓదార్చారు.

'నైరుతి'పై కుంభవృష్టి!

అంతే తప్ప ఇది క్లౌడ్ బరస్ట్ కాదు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు వ్యవధిలో కురిసిన కుంభవృష్టి వర్షానికి ఏపీలోని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. 24 గంటల్లో ఈ స్థాయి వర్షాలు ఎందుకు కురిశాయి..? మేఘాలు ఏమైనా బద్ధలయ్యాయా..? లేక మరేమైనా కారణాలున్నాయా..? అన్న సందేహాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలకు 'నైరుతి' భాగంలో ఎక్కువ వర్షించడం సాధారణం. అంటే ఆ అల్పపీడనాలు, వాయుగుండాలకు సంబంధించి నైరుతి భాగం ఎక్కడ ఉంటే అక్కడే కుంభవృష్టి వర్షాలు కురుస్తాయి. ఇందుకు ఉమ్మడి గుంటూరు, కృష్ణాతోపాటు పొరుగున తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో కుంభవృష్టిగా కురిసిన వర్షాలే నిదర్శనమని వాతావరణ నిపుణులు వెల్లడించారు.

భారీ తేమను మోసుకొచ్చి..

సాధారణంగా నైరుతి సీజన్‌లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు/వాయుగుండాలు ఏర్పడినప్పుడు.. వాటికి సంబంధించి నైరుతి భాగంలో ఉన్న ప్రాంతాలు.. ఇంకా నైరుతి రుతుపవనాలు అత్యంత బలంగా ఉండే సమయంలో అంటే అరేబియా సముద్రం నుంచి భారీగా తేమ తీసుకువచ్చినప్పుడు పశ్చిమ కనుమలు, బంగాళాఖాతం నుంచి వచ్చే తేమ ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో అసాధారణ వర్షపాతం నమోదు కావడం ఇందుకు ఉదాహరణగా చెబుతారు. దీనికి వాతావరణంలో మరికొన్ని పరిస్థితులు తోడు కావడంతో కుంభవృష్టి వర్షాలు కురుస్తుంటాయి. శుక్రవారం నుంచి శనివారం అర్ధరాత్రి వరకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అదే జరిగిందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలు భూమిపైకి వచ్చేటప్పుడు భారీగా తేమను తీసుకువస్తుంటాయి. వాటికి సంబంధించి మొత్తం ప్రాంతంలో నైరుతి భాగంలోనే ఎక్కువ తేమ కేంద్రీకృతమై ఉంటుంది. మిగిలిన చోట్ల ఉన్న తేమతో మోస్తరు నుంచి భారీ వర్షాలే కురుస్తుంటాయి. ఆగస్టులో తీవ్రమైన ఎండల ప్రభావంతో ఇటు భూమి.. అటు సముద్రం బాగా వేడెక్కింది. ఒక విధంగా భూమి, సముద్రంలో వాతావరణ అనిశ్చితి నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో వాయుగుండం భారీగా సముద్ర నీటిని తాగేసి... భూమిపైకి విడిచిపెట్టింది. అలా విడిచిపెట్టిన ప్రాంతం ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వరంగల్ జిల్లా వరకు ఉండడంతో కుండపోతగా వర్షం కురిసిందని వాతావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు. అయితే ఈ సీజన్‌లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు/వాయుగుండాలు కోస్తా మీదుగా పయనించే క్రమంలో ఇటువంటి కుండపోత వర్షాలు సాధారణమేనని విశ్లేషించారు. కుంభవృష్టి వర్షాలకు ఇదే కారణం తప్ప 'క్లౌడ్ బరస్ట్' కాదని స్పష్టం చేశారు. ఒకటి నుంచి రెండు గంటల వ్యవధిలో కొద్ది ప్రాంతంలో కుంభవృష్టి వర్షాలు కురిస్తే దాన్ని 'క్లౌడ్ బరస్ట్'గా చెబుతారని అన్నారు.

వరద పరిస్థితులపై మోదీ ఆరా

» సీఎం రేవంత్‌కు ఫోన్ చేసిన ప్రధాని, షా

» హెలికాప్టర్లు పంపిస్తామని హామీ

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరా తీశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేశారు. తెలంగాణలో వర్షాలు వరద పరిస్థితులను, జరిగిన నష్టాన్ని మోదీ అడిగి తెలుసుకున్నారు. పలు జిల్లాల్లో భారీ వర్షం.. వరదలతో వాటిల్లిన నష్టాన్ని సీఎం రేవంత్ ప్రధానికి వివరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలను, తీసుకున్న జాగ్రత్తలను తెలియజేశారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని రేవంత్ ప్రధానికి తెలిపారు. అప్రమత్తంగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని మోదీ అభినందించారని సీఎం కార్యాలయం తెలిపింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామని మోదీ, అమిత్ షా తెలిపినట్లు సీఎంవో పేర్కొంది. వరద పరిస్థితులపై సీఎం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపింది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.